www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

8th ANNIVERSARY 22nd October, 2026

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 295 | శుక్రవారం | 25-09-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



27న పనిచేయనున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు

ఓటు హక్కును హరించే విధానాన్ని అమలు చేస్తున్న సిఇసి

26న సిపిఐ అఖిలపక్ష సమావేశం

07




## ప్రజల విశ్వాసాన్ని ఘోరంగా

# దెబ్బతీసిన జ్ఞానేశ్

## ఆయనకు పదవిలో కొనసాగే హక్కు లేదు

- ఇసిఐ తీరుపై మండిపడిన వామపక్ష జాతీయ నేతలు
- బిజెపి చేతిలో ఇసి కీలుబొమ్మగా పని చేస్తోందని స్పష్టమైందని వ్యాఖ్య
- తాజా పరిణామాలపై భేటీ అయిన వామపక్ష పార్టీలు
- ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) బిజెపి చేతిలో కీలు బొమ్మగా పని చేస్తోందని స్పష్టమైందని వామపక్ష పార్టీలు పేర్కొన్నాయి. కోట్లాది మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి మినహాయించడంతో సహా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ప్రవర్తన కమిషన్‌పై ప్రజల విశ్వాసాన్ని ఘోరంగా దెబ్బతీసిందని విమర్శించాయి. జ్ఞానేశ్‌కుమార్ సిఇసి పదవిలో కొనసాగే హక్కును కోల్పోయారని, ఇసి విశ్వసనీయత తను పునరుద్ధరించడానికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితి, భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై చర్చించేందుకు న్యూఢిల్లీలోని ఎ.కె.జి. భవన్‌లో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం. ఎ. బేబీ, పొలిట్ బ్యూరో సభ్యులు బి. వి. రాఘవులు, అరుణ్ కుమార్,

తరువాయి 8లో

### 28 నుంచి ఐదు వామపక్షాల నిరసన

ఎన్నికల సంఘం స్వాతంత్ర్యం, విశ్వసనీయత క్షీణించడాన్ని వ్యతిరేకిస్తూ, ఓటు హక్కును, భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, సెప్టెంబర్ 28న షహీద్ – ఎ – ఆజం భగత్ సింగ్ జయంతిని పాటిస్తూ, మహాత్మా గాంధీ జయంతితో ముగిసేలా, సెప్టెంబర్ 26 నుండి అక్టోబర్ 2 వరకు వారం రోజుల పాటు దేశవ్యాప్త నిరసనలకు ఐదు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.ఓటు హక్కును పరిరక్షించండి. ఎన్నికల సంఘం విశ్వసనీయతను పునరుద్ధరించండి– ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అనే నినాదంతో నిరసనలు నిర్వహించాలని సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పి కోరాయి.

#### కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు

## భూములపై విచారణకు

# ప్రత్యేక కమిటీ

### చైర్‌పర్సన్‌గా శ్రీదేవసేన నియామకం



- చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘనలపై క్షుణ్ణంగా పరిశీలన
- జగదీశ్‌రెడ్డి, గంగుల సహా పలువురు ముఖ్య నాయకులకు చెందిన భూ వ్యవహారాలపై కూడా విచారణ


ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో భూముల కొనుగోలు, కేటాయింపులు, ఇతర అవకతవకలపై సమగ్ర విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ జిల్లాల్లో జరిగిన భూ అక్రమాలపై ఆరా తీసేందుకు ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ జి.ఓ నెంబర్ 134ను జారీ చేసింది. చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘనలపై క్షుణ్ణంగా పరిశీలన జరిపి, ఈ అక్రమాలకు బాధ్యులెవరో తేల్చి, వారిపై తగిన చర్యలకు సిఫార్సులు చేయడమే ఈ కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక విచారణ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఎ. శ్రీదేవసేన, నియమితులయ్యారు. కమిటీ కన్వీనర్‌గా రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, సభ్యుడిగా జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో

తరువాయి 8లో

## జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారాలి

### మోదీ, షా, సిఇసి ‘దేశద్రోహులు’ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌లను ‘దేశద్రోహులు’గా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. వారు భారత ఓటు హక్కును ధ్వంసం చేశారని అన్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అప్రూవర్‌గా మారాలని ఆయనకు సలహా ఇస్తున్నానని అన్నారు. అలా చేయడం దేశభక్తిని చాటడమే అవుతుందని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గురువారం ఇక్కడి ఇందిరా భవన్‌లో

తరువాయి 8లో

## సిఇసి రాజీనామాకు 48 గంటల గడువు

### లేకపోతే జంతర్‌మంతర్– 2 తప్పదని సిజెపి హెచ్చరిక



**న్యూఢిల్లీ:** ఓటర్ల హక్కులను దెబ్బతీస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) డిమాండ్ చేసింది. ఆయన 48 గంటల్లో పదవి నుంచి తప్పుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని, ఇందులో ‘జంతర్ మంతర్ 2.0‘ కూడా ఉంటుందని హెచ్చరించింది. గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ తారుమారైందని ఆరోపించారు. పౌరుల ఓటు హక్కును వారి నుంచి దూరం

తరువాయి 8లో

## 22-ఎ సమస్యలకు పరిష్కారం

- రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు
- అనుమతులున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్లకు మార్గం సుగమం

ప్రజాపక్షం/హైదరాబాద్

జి.ఓ 118, జి.ఓ 76 తర్వాత 22ఎ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు సహచర మంత్రులతో చర్చించి, 22ఎ సమస్యలను ఫాస్ట్ ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. 22ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లకు

తరువాయి 8లో



## గణేశ్ నిమజ్జనోత్సవానికి

# సర్వం సిద్ధం

ప్రజాపక్షం/హైదరాబాద్

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని జిహెచ్ఎంసితో పాటు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని వేగంగా, సురక్షితంగా,

తరువాయి 12లో

## ప్రపంచ శ్రేయస్సుకు

# చైనా–అమెరికా కృషి

- విభేదాలపై సర్దుబాటు ధోరణి– పరిమిత పోటీ
- సహకారంతో ఒకేదిశగా పయనించాలి
- ఈ రెండూ ప్రత్యర్థులు కాదు, భాగస్వాములు
- వాషింగ్టన్‌లో జిన్‌పింగ్ కీలక వ్యాఖ్య



**బీజింగ్:** ప్రపంచ శ్రేయస్సును చైనా–అమెరికా పరస్పర సహకారంతో ముందుకు నడిపిస్తాయని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. నూతన శకంలో ఇరు దేశాలూ కలసిమెలసి ఉండేందుకు ఒక మార్గాన్ని కనుగొనాలని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు,ప్రపంచ పరిస్థితులకు సంబంధించిన ప్రధానాంశాలపై ట్రంప్‌తో లోతైన చర్చల కోసం తాను ఎదురుచూస్తున్నానన్నారు. చైనా అధికార పత్రిక సమాచారం ప్రకారం, పదకొండు సంవత్సరాల తర్వాత అమెరికాలో పర్యటిస్తున్న చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ దంపతులకు డోనాల్డ్ ట్రంప్ అరుదైన ఘనస్వాగతం పలికారు. ఆండ్రూ ఎయిర్‌ఫోర్స్ రన్‌వే వద్ద జిన్‌పింగ్, ఆయన భార్య పెంగ్ లియువాన్‌ల రాకకోసం ట్రంప్, ఆయన భార్య మెలానియా ముందుగానే వెళ్ళి ఎదురుచూశారు. సైనికులు సంగీత వాద్యాలు మోగిస్తుండగా స్వయంగా స్వాగతం పలికారు. విమానంలోంచి దిగిన తర్వాత బాలలు వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రెడ్ కార్పెట్‌కు ఇరువైపులా 500 మంది సైనికుల గన్‌శాల్యూట్‌తో ఆయనకు అసాధారణ స్వాగతం పలికారు. ఇరుదేశాల జాతీయ గీతాలాపనల తర్వాత బి–1 బాంబర్ సైనిక విమానాలు విన్యాసాలు నిర్వహించాయి. హోటల్‌కు

తరువాయి 8లో




## భగత్‌సింగ్ స్ఫూర్తితో

# యువతరం ముందుకు సాగాలి

- 28న రాష్ట్రవ్యాప్తంగా షాహిద్ జయంతి
- ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో భారీ కటౌట్

ప్రజాపక్షం/హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్‌సింగ్ జయంతిని ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్, ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్‌లు పిలుపునిచ్చారు. జయంతి కార్యక్రమాలు కేవలం పూలమాలలకే పరిమితం కాకుండా యువతలో చరిత్రపై అవగాహన, శాస్త్రీయ దృక్పథం, సామాజిక సమానత్వం, విద్య, ఉపాధి వంటి సమకాలీన అంశాలపై చర్చలకు వేదికగా

తరువాయి 8లో

## దానం పిటిషన్

# కొట్టివేత

### హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** తనపై హైకోర్టు అనర్హత వేటు వేయడాన్ని సవాలు చేస్తూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. అదే సమయంలో, పార్టీ ఫిరాయింపులపై కీలక వ్యాఖ్యలు చేసింది. పార్టీలు మారడం అనేది వారివారి ఇష్టమని, అయితే ఒక పార్టీ గుర్తుపై పోటీ చేసి మరో పార్టీలో చేరి పదవుల్లో కొనసాగడం సరైంది కాదని

తరువాయి 12లో


‘ప్రజాపక్షం’ దినపత్రిక 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



Ar. RAJA RAO. M D.Arch., B.Arch.
Cell: 9885158885, 9908958885

ఓం

Ar. NAGA JYOTHI. M B.Arch, (M.Sc Maths)
Mail ID: nice.designers@gmail.com

NDNC

NICE DESIGNERS &
NICE CONSTRUCTIONS

ARCHITECTS, INTERIOR DESIGNERS, STRUCTURAL ENGINEERS, VAASTU PLANNERS,
ESTIMATORS, CONSTRUCTION CONTRACTORS & LICENSED SURVEYORS



Ar. RAJA RAO. M
D.Arch., B.Arch
Ar. NAGA JYOTHI. M
B.Arch., M.Sc., Maths

Shop No. 1,2&4, First Floor, Aditya Mansion, Opp: GHMC Kapra
Circle Office South Kamalanagar, ECIL (Post), Medchal Dist - 500 062.
Medchal - Malkajgiri Dist. Office : 040-27134900

4th Floor, Sri Vaishnavi Double Ten, Opp: Cyber Towers
Behind Mehfil, Hitech City, Madhapur.
Mail Id: dnc.vaasthunirman@gmail.com
Office : 040-23118838



ఇట్లు
మీ ఆత్మ శ్రేయోభిలాషి
నిర్మలానంద అతీత సద్గురు
ఆర్కిటెక్ట్
రాజారావు మైలపల్లి

అఖండ భారతదేశం చాలా గొప్పది. అందరూ బాగుండాలి. దానికి మనం చేయవలసింది ఒకే ఒక్కటే - సత్యం మాట్లాడుట, ధర్మంవైపు మగ్గుచూపుడు, న్యాయమైన పనులే చేయుట, శాంతిని నెలకొల్పటానికి అశాంతిపరులను శిక్షంచి మంచివారుగా చేయుట, ప్రేమతో ఒకరితో ఒకరు జీవించుట ఇదే మన అఖండ భారతీయత, సత్యయుగం వైపు మన ప్రయాణం.

# భూ సంస్కరణలపై చర్చకు తరుణం

ఇటీవల భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నిషేధిత జాబితా గురించి తెలంగాణలో దుమారమే రేగింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని 22 ఎ సెక్షన్ కింద రాష్ట్రంలోని ప్రభుత్వ భూములు, దేవాదాయ, బంజరు, అసైన్డ్, అటవీ భూములకు సంబంధించిన సర్వే నంబర్ వివరాలు ఉంటాయి. వాటితో పాటుగా ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ఆధీనంలో ఉండే వివాదాస్పద భూముల సర్వే నంబర్‌లను కూడా ఆ జాబితాలోకి ఎక్కిస్తారు. అంటే ఆ జాబితాలో ఉంచిన భూములను ఎవరి పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు లేదు. ఈ మధ్య కాలంలో కోర్టు ఆదేశాల మేరకు ఆ జాబితాను సరి చేసే క్రమంలో గతంలో 22ఎ లో ఉంచి, కాలక్రమంలో దాని నుంచి బైటపడిన భూముల వివరాలు సాంకేతికంగా తిరిగి అందులో చేరడంతో వివాదం మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరిలోని కాలనీలలో వేలాది కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. ఈ అంశంపై సెప్టెంబర్ 16న శాసనసభ చర్చ సందర్భంగా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వడమే కాకుండా నెల రోజుల్లో పరిష్కారానికి 12 రకాల మార్గాలను వెల్లడించారు. ఆ సందర్భంలోనే మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు, పలువురు బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు, నాయకులు, వారి అనుంగులు ఫామ్ హౌజ్‌లు, తదితర పేర్లతో భూ గరిష్ట పరిమితి చట్టానికి మించిన భూములు కలిగి ఉన్న విషయాన్ని సభ ముందుంచారు. కెసిఆర్ కుటుంబానికి 400లకు పైగా ఎకరా లు ఎర్రవెల్లిలో ఉన్నాయని, పక్కనే నిషేధిత జాబితాలో ఉన్న వందల ఎకరాల భూములను కలుపుకున్నారనే తీవ్ర ఆరోపణ చేశారు. అంతే కాకుండా నిషేధిత జాబితాలోని భూములను వాటిలో కలుపుకున్నారనే తీవ్ర ఆరోపణలు చేయటమే కాకుండా, విచారణకు ఒక కమిటీ వేస్తానని ప్రకటించారు. అందుకు అనుగుణంగా గురువారం నాడు ఐఎఎస్ అధికారిణి ఎ.దేవసేన నేతృత్వంలో విచారణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

శాసనసభ చర్చ సందర్భంగా భూ గరిష్ట పరిమితి చట్టం గురించి సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించడంతో చట్టం ప్రకారం ఎన్నిక ఎకరాల భూమి ఉండాలనే అంశం తెరపైకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఏడాదికి వచ్చే పంటలు, నీటి వసతి ఆధారంగా ఐదుగురు సభ్యుల కుటుంబానికి తరి 10 – 27 ఎకరాలు వరకు భూమి ఉండవచ్చు. మెట్ట, సాగు నీటి వసతి లేని భూమి అయితే కుటుంబానికి 35 – 54 ఎకరా ల వరకు అనుమతిస్తారు. ఆ పైన ఉండే భూమిని 'మిగులు భూమి'గా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఎర్రవెల్లి క్షేత్రంలో సతీమణితో కలిపి కెసిఆర్ కుటుంబానికి 67.13 ఎకరాలు, కెటిఆర్ కుటుంబానికి వివిధ ప్రాంతాలలో 123.19 ఎకరాల భూములు ఉన్నట్లు అసెంబ్లీలో సిఎం వెల్లడించారు. నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా చంద్రబాబునాయుడు, వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిలు ఉన్న సమయంలోనే నాడు రాజకీయ నాయకులు హైదరాబాద్‌కు శివారులలో భూములు కొనుగోలు చేసి, ఫామ్ హౌజ్‌లు ఏర్పాటు చేసుకోవడం ఆరంభమైందని పరిశీలకులు చెబుతుంటారు. అయితే, తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇది విస్తృతమైంది. ముఖ్యంగా కెసిఆర్ ఎర్రవెల్లిలో వ్యవసాయ క్షేత్రంలోనే ఇళ్ళు కట్టుకొని, తరచుగా అక్కడే ఉంటుండడంతో ఫామ్ హౌజ్ పదం ప్రజల నోళ్ళలో నానింది. ఆ తరువాత బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తమ నియోజకవర్గాలలోనో, వెలుపలో ఫామ్ హౌజ్‌లు ఏర్పాటు చేసుకున్న విషయం నాడు పెద్ద ఎత్తున చర్చ జరిగేది. శాసనసభ సమావేశాల చివరి అంకంలోనే కాంగ్రెస్ ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎ, ఎంపిలు కెసిఆర్ ఫామ్ హౌజ్ వద్దకు, తరువాత హరీశ్‌రావు, కెటిఆర్, జగదీశ్‌రెడ్డి తదితరుల ఫామ్ హౌజ్, వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్ళారు. ప్రైవేటు భూముల వద్దకు వెళ్తుండడంపై బిఆర్‌ఎస్ నేతలు అభ్యంతరం పెట్టినప్పటికీ, వారి భూములను చూపడం ద్వారా జనాంతికంగా ఉన్న విషయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలనేది కాంగ్రెస్ వ్యూహంగా కనపడింది. అదే సమయంలో కాంగ్రెస్ నేతల భూముల గురించి, అందులో సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి తదితరులు భూముల గురించి బిఆర్‌ఎస్ నేతలు ప్రశ్నలు సంధించినా, అది పెద్దగా ప్రజల్లోకి వెళ్ళలేదు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ఎంపిల ఫామ్ హౌజ్‌లు, విలాసవంతమైన విల్లాలను కొన్ని యూట్యూబ్ ఛానళ్ళు ప్రముఖుల 'హోం టూర్' పేరుతో చిత్రీకరించాయి. తమ నివాసాలు, ఆడంబరాల ను నేతలు ఉత్సాహపడి మరీ గొప్పలు చెప్పుకొచ్చారు. ఇప్పుడా వీడియో క్లిప్పింగ్‌లు వైరలవుతుండడంతో ఇరుకున పడుతున్నారు. తమ ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల నామినేషన్‌తో పాటు దాఖలు చేసామని బిఆర్‌ఎస్ నేతలు సమర్థించుకునే ప్రయత్నం చేశారు. అయితే, ఉద్యమ కాలంలో ఎన్నికల సమయానికి ఎకరం కూడా లేని, లక్షల్లోనే ఆదాయం చూపిన పలువురు నేతలకు ఇప్పుడు భారీ ఫామ్ హౌజ్‌లు, విల్లాలు, కోట్ల వ్యాపారాలు ఎలా వచ్చాయనే కాంగ్రెస్ నేతల ఎదురుదాటి ఇరకాటంలో పడేస్తోంది.

నిజానికి భూమి అనే అంశాన్ని ఎజెండాలోకి తీసుకువచ్చింది కమ్యూనిస్టులనేది ఎవ్వరినడిగినా చెబుతారు. 'భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం' అనే నినాదంతో నైజాం రాచరిక పాలన, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన చరిత వారిదే. లక్షల ఎకరాలు చెరబట్టిన నిజాం నవాబు, దొరలు దేశ్‌ముఖ్‌ల కోటలను బద్ధలు కొట్టింది వారే. నాటి పోరాటంలో 'దున్నే వానికే భూమి' పేరుతో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో పది లక్షల ఎకరాల భూమి పేదలు, రైతులు, రైతు కూలీలకు పంపిణీ జరిగింది. దానికి పోటీగా భూదానోద్యమాన్ని ముందుకు తీసుకువచ్చినా కమ్యూనిస్టుల పోరాటమే భూ పంపిణీకి బాటలు వేసింది. ఆ వెలుతురులోనే దేశవ్యాప్తంగా భూ సంస్కరణలు, భూ పరిమితి చట్టాలు వచ్చాయి. పేదల చేతుల్లోకి భూములు వచ్చాయి. ఆర్థిక సంస్కరణల తరువాత తిరిగి భూములు కేంద్రీకరణ మొదలైంది. సెజ్‌ల పేరిట ప్రభుత్వమే కార్పొరేట్ సంస్థలకు పెద్ద ఎత్తున భూములను కట్టబెట్టింది. ఇందుకు రైతుల నుంచి బలవంతంగా తక్కువ మొత్తానికే భూమి సేకరించి, వాటికి అప్పగించింది. అదే క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోయి, కబ్జాలు, నేతల భూ దాహం ఎక్కువవడంతో పట్టణభూపరిమితి చట్టం తొలగించడం, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటులకు బాటలు పడ్డాయి.

సామాన్య మధ్యతరగతి ఊళ్ళలో భూమి అమ్ముకున్నా పట్టణాల్లో ఇంటి స్థలం వచ్చే పరిస్థితి లేదు. అదే సమయంలో నేతలు, బడా బాబులు భూములను చెరబడుతున్నారు. రాష్ట్రంలో 22 ఏ, ఫామ్ హౌజ్‌లపై చర్చ జరుగుతున్న సమయంలో మరో సారి భూ సంస్కరణలు, భూ గరిష్ట పరిమితిపై చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది. పెరిగిన జనాభా, భూముల ధరల నేపథ్యంలో వ్యవసాయ భూములు, పట్టణాలలో ఆవాస స్థలాల పరిమితి అంశంపై విశ్లేషణ జరగాలి. మెజారిటీ ప్రజలకు సాగు భూమి, ఆవాసస్థలం ఉండేందుకు అనువుగా చట్టాలలో మార్పులపై విస్తృత మథనం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ●



## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**భారత ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ భారత ఓటు హక్కును ధ్వంసం చేశారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలి. అపూర్వర్‌గా మారితే కొంతవరకూ దేశభక్తిని నిరూపించుకున్నట్టు అవుతుంది. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్న సిఇసితోపాటు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా దేశద్రోహులు అవుతారు. ఓటును రక్షించే సంస్థ ఎన్నికల సంఘమే. అక్కడి నుంచే మిగతా వ్యవస్థలన్నీ ఉద్భవిస్తాయి. ఓటు ధ్వంసమైతే రాజ్యాంగం పనిచేయదు. చట్టాలు ధ్వంసమవుతాయి. సంస్థలకు అర్థం ఉండదు. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే, గతంలో అసెంబ్లీలకు, లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని నేను వంద శాతం నమ్ముతున్నాను. ఓటు చోరీ నుంచి చట్టం చోరీ వస్తుంది. దాని నుంచి సంస్థల చోరీ జరుగుతుంది.**

–రాహుల్ గాంధీ
లోక్‌సభలో ప్రతిపక్ష నేత




## ఆరోగ్య రక్షణలో కీలక పాత్ర.. కష్టాల్లో ఫార్మాసిస్టుల జీవనం

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్ డేను నిర్వహిస్తా రు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల సేవలను గుర్తించ డం, ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. వైద్యుడు వ్యాధిని నిర్ధారించి చికిత్సను సూచిస్తే, ఆ చికిత్సలో కీలకమైన మందు సరైనదేనా, సరైన మోతాదులో ఉందా, ఎలా వినియోగించాలి, ఇతర మందులతో ఎలాంటి ప్రభావాలు ఉంటాయి వంటి విషయాల్లో ఫార్మాసిస్టులు ముఖ్యమైన బాధ్యతను నిర్వహిస్తారు. ప్రపంచ ఫార్మసీ రంగానికి సెప్టెంబర్ 25 ప్రత్యేకమైన రోజు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటిక ల్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్ డే నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం 2010 సంవత్సరం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని క్రమబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఫార్మసిస్టుల సేవలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, ఆరోగ్య సంరక్షణలో ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను తెలియజేయడానికి ఈ రోజు ఒక వేదికగా మారింది. ఫార్మసీ చట్టం, 1948 కింద ఏర్పడిన ఫార్మసీ కౌన్సిల్ వ్యవస్థ దేశంలో ఫార్మసీ విద్యకు సంబంధించి న ప్రమాణాలు, ఫార్మసిస్టుల వృత్తిపరమైన రిజిస్ట్రేషన్ వంటి అంశాలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. బి.ఫార్మా, డి.ఫార్మా తదితర కోర్సుల ద్వారా ప్రతి సంవత్సరం వేలాదిమంది ఫార్మసీ విద్యను అభ్యసించి ఆరోగ్య రంగంలోకి ప్రవేశిస్తున్నారు. భారతదేశంలో 10 లక్షలకు పైగా రిజిస్టర్డ్ ఫార్మసిస్టులు ఉన్నారని విస్తృతంగా పేర్కొంటారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపులు, ఔషధ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజారోగ్య రంగాల్లో వారు సేవ లు అందిస్తున్నారు. ఫార్మాసిస్టు అంటే కేవలం మందుల ప్యాకెట్ తీసి రోగికి ఇచ్చే వ్యక్తి కాదు. వైద్యుల ప్రిస్క్రిప్షన్‌ను పరిశీలించడం, మందుల పేర్లు, మోతాదులు, గడువు తేదీలు తనిఖీ చేయడం, మందులను నిర్దిష్ట ఉష్ణోగ్రతలో భద్రపరచడం, రోగికి మందుల వినియోగ విధానాన్ని వివరించడం వంటి అనేక బాధ్యతలను వారు నిర్వహిస్తారు. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎక్కువకాలం మందులు తీసుకోవాల్సి ఉంటుంది. మందులను సమయానికి తీసుకోవడం, వైద్యుల సూచన లేకుండా మోతాదును మార్చకపోవడం, లక్షణాలు తగ్గాయని మందులను అకస్మాత్తుగా ఆపకపోవడం వంటి విషయాల్లో ఫార్మాసిస్టులు ప్రజలకు అవగాహన కల్పించగలరు. ఆసుపత్రులు, మెడికల్ షాపులు అనేక సందర్భాల్లో 24 గంటలూ పనిచేస్తాయి. దీంతో ఫార్మాసిస్టులు రాత్రి వేళల్లో కూడా విధులు నిర్వహించాల్సి వస్తుంది. తగిన సిబ్బంది లేకపోతే ఒకే ఫార్మాసిస్టుపై అధిక పని భారం పడుతుంది. ఎక్కువసేపు నిలబడి పనిచేయడం, రోగులు, వారి బంధువుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం, మందుల లభ్యత, ధరలు, ప్రిస్క్రిప్షన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం వంటి బాధ్యతలు కూడా వారి రోజువారీ పనిలో భాగమే. ఫార్మసీ విద్యను పూర్తిచేసిన యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు, గౌరవప్రదమైన వేతనాలు, వృత్తిపరమైన ఎదుగుదలకు అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. మందు సాధారణ వినియోగ వస్తువు కాదని, వైద్యుల సూచనలకు అనుగుణంగా ఉపయోగించాల్సిన ఆరోగ్య సాధనమని ప్రజలు గుర్తించాలి.

*(సెప్టెంబర్ 25న 'ప్రపంచ ఫార్మసిస్ట్ డే' సందర్భంగా)*

ఆళవందార్ వేణు మాధవ్, 8686051752

# భగత్‌సింగ్‌ను విగ్రహంగా కాదు ఆలోచనగా చదవాలి

## షాహిద్ స్ఫూర్తితో యువత శాస్త్రీయ దృక్పథం కోసం పాటుపడాలి



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు
9705309583

వేల కాగడాలు ఏకమైతే... లక్ష గొంతులు ఒక్కటైటే.... కోటి ఆశలు నిలువెల్లా నింపుతుంటే అతనొక్కడవుతాడు. జాతి ఆత్మ ఘోషను గుండెల నిండా నింపుకొని పుట్టిన వాడు. అన్నానికి బదులు ఆవేశం తిని పెరిగినవాడు. వేలమంది ప్రాణాలు విడిచినా మట్టి వాసననే ప్రాణవాయువుగా పీల్చుకొని బతికినవాడు. తెల్లదొరల ముందు.. ధైర్యంగా మీసం మెలేసిన పౌరుష ధీశాలి.. ఉరితాడును సైతం ఎంతో ఇష్టంగా ముద్దాడిన పోరాట యోధుడు, భారత స్వాతంత్ర్య చరిత్రలో అరుణారుణ అక్షరాలతో లిఖించబడిన విప్లవ వేగుచుక్క షహీద్ భగత్ సింగ్....

అతనొక మేధావి.... అతనొక సామాజిక వేత్త....
అతనొక చరిత్రకారుడు.... అతనొక ఉద్యమ కారుడు.....
అతనొక స్వాతంత్ర్యయోధుడు.... అతనొక మార్క్సిస్టు సిద్ధాంత కర్త.....
అతనొక విప్లవకారుడు.... అన్నిటికి మించి అమరుడతడు......
అతనే షహీద్ భగత్ సింగ్...

భగత్‌సింగ్‌ను స్మరించుకోవడం అంటే ఒక వీరుడి చిత్రపటానికి పూల మాల వేయడం, నినాదాలు చేయడం మాత్రమే కాదు. ఆయనను నిజంగా అర్థం చేసుకోవాలంటే ఆయన చదివిన పుస్తకాలను, రాసిన వ్యాసాలను, చేసిన ప్రశ్నలను, సమాజంపై ఆయనకున్న దృక్పథాన్ని అధ్యయనం చేయాలి. కేవలం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ తన చిన్న జీవితకాలంలోనే భారత స్వాతంత్ర్యాన్ని ఒక విస్తృతమైన సామాజిక విముక్తి ప్రశ్నగా చూశాడు. ఆయనకు స్వాతంత్ర్యం అంటే విదేశీ పాలకుడు వెళ్లిపోవడం మాత్రమే కాదు. పేదరికం, దోపిడీ, అసమానత, అజ్ఞానం, మూఢనమ్మకాలు తొలగి ప్రతి మనిషికి గౌరవంతో జీవించే అవకాశం కలిగే సమాజం నిర్మించడం. అందుకే భగత్‌సింగ్‌ను విగ్రహంగా నిలబెట్టడం కంటే ఆలోచనగా యువతలోకి తీసుకెళ్లడం ఈ తరానికి ఉన్న గొప్ప బాధ్యత.

భగత్‌సింగ్ దేశాన్ని ప్రేమించాడు. కానీ దేశభక్తిని అందమైన విధేయతగా చూడలేదు. సమాజంలో అన్యాయం కనిపిస్తే ప్రశ్నించడం, ప్రజల జీవితాల్లో మార్పుకోసం ఆలోచించడం, దోపిడీకి వ్యతిరేకంగా నిలబడడం కూడా దేశభక్తిలో భాగమేనని ఆయన జీవితం చెబుతుంది. ఆయన విస్తృతంగా చదివాడు, ప్రపంచంలోని రాజకీయ, సామాజిక ఉద్యమాలను అధ్యయనం చేశాడు, తన అభిప్రాయాలను నిరంతరం పరిశీలించుకున్నాడు. అందుకే భగత్‌సింగ్ ఆలోచనలలో పఠనం, తర్కం, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత ముఖ్యమైన స్థానాన్ని పొందాయి. నేటి డిజిటల్ యుగం లో ఒక వార్త క్షణాల్లో లక్షల మందికి చేరుతుంది. అదే సమయంలో తప్పుడు సమాచారం కూడా అంతే వేగంగా వ్యాపిస్తుంది. ఈ పరిస్థితిలో భగత్‌సింగ్ నుంచి యువత నేర్చుకోవాల్సిన మొదటి పాఠం, ఏది చెప్పినా నమ్మకండి. చదవండి, ప్రశ్నించండి, ఆధారాలను పరిశీలించండి, నిజాన్ని తెలుసుకోండి.

నేటి భారతదేశంలో యువత ఎదుర్కొంటున్న ప్రధా న సమస్యల్లో ఉపాధి ఒకటి. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, తాత్కాలిక మరియు కాంట్రాక్ట్ ఉద్యోగాలపై ఆధారపడుతున్న యువ కార్మికులు. వీరి సమస్యలను కేవలం వ్యక్తిగత వైఫల్యాలుగా చూడలేం. ఉపాధి అవకాశాల సృష్టి, ప్రభుత్వ ఖాళీల భర్తీ, నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అభివృద్ధి, కార్మిక హక్కులు, సామాజిక భద్రత వంటి అంశాలతో నిరుద్యోగ సమస్య ముడిపడి ఉంది. అందువల్ల యువతకు ఉద్యోగం కల్పించడం కేవలం ఎన్నికల సమయంలో ఇచ్చే హామీగా కాకుండా దేశ ఆర్థిక అభివృద్ధికి మరియు యువత గౌరవప్రదమైన జీవనానికి సంబంధించిన ప్రాథమిక సామాజిక ప్రశ్నగా చూడాలి. భగత్ సింగ్ సమాజాన్ని మార్చే శక్తిగా యువతను చూసినట్లే, నేటి యువత కూడా తమ భవిష్యత్తు కోసం వ్యక్తిగత పోటీతో పాటు సమిష్టి సామాజిక చర్చను ముందుకు తీసుకెళ్లాలి.

విద్య సమాజ మార్పుకు అత్యంత శక్తివంతమైన సాధనం. కానీ విద్య కేవలం పరీక్షలో మంచి మార్కులు సాధించి ఉద్యోగం పొందడానికి ఉపయోగపడే సాధనంగా పరిమితమైతే దాని సామాజిక ప్రయోజనం తగ్గిపోతుంది. నిజమైన విద్య మనిషికి జ్ఞానం మాత్రమే కాకుండా ప్రశ్నించే శక్తి, విశ్లేషించే సామర్థ్యం, సమాజాన్ని అర్థం చేసుకునే దృష్టి, బాధ్యతాయుతమైన పౌర స్ఫూర్తి ఇవ్వాలి. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల కు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ విద్యా సంస్థలు బలోపేతం కావాలి. ఉన్నత విద్య ఆర్థికంగా అందనంత దూరంలోకి వెళ్లకూడదు. విద్యార్థి తన కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా తన కలలను వదులుకోవాల్సిన పరిస్థితి ఉండకూడదు. భగత్‌సింగ్ స్వయం గా విస్తృతంగా చదివి తన ఆలోచనా ప్రపంచాన్ని నిర్మించుకున్నాడు. అందువల్ల ఆయన జయంతి సందర్భంగా ప్రతి యువకుడిలో పాఠ్యపుస్తకానికి మించి ప్రపంచాన్ని చదవాలి అనే పఠనా సంస్కృతిని పెంచడం అవసరం.

భగత్‌సింగ్‌ను నేటి కాలంలో అత్యంత ప్రాసంగికంగా నిలబెట్టే అంశాల్లో శాస్త్రీయ మరియు హేతుబద్ధమైన ఆలోచన ఒకటి. ఆయన తన విశ్వాసాలను కూడా ప్రశ్నించడానికి వెనుకాడని మేధో ధైర్యాన్ని ప్రదర్శించాడు. నేను ఎందుకు నాస్తికుడు అయ్యాను వంటి రచనలో తన ఆలోచనా ప్రయాణాన్ని తర్కంతో వివరించాడు. శాస్త్రీయ దృక్పథం అంటే కేవలం సైన్స్ చదవడం కాదు. ఏ విషయాన్నైనా ఆధారం, పరిశీలన, తర్కం ఆధారంగా అర్థం చేసుకోవడం. నేటి సోషల్ మీడియా కాలంలో మూఢనమ్మకాలు, తప్పుడు వైద్య




సమాచారం, నిర్ధారణ లేని ప్రచారాలు, వదంతులు వేగంగా వ్యాపిస్తున్నాయి. యువత ప్రతి సమాచారాన్ని ప్రశ్నించే అలవాటు పెంచుకోవాలి. ఎవరు చెప్పారు? కంటే దానికి ఆధారం ఏమిటి? అనే ప్రశ్నకు ప్రాధాన్యత ఇవ్వాలి. భగత్‌సింగ్ ఆలోచనలను నిజంగా ముందుకు తీసుకెళ్లడం అంటే హేతువు, శాస్త్రీయ దృక్పథం, మానవతా విలువలను యువతలో బలపరచడం. నేటి పోటీ ప్రపంచం ప్రతి యువకుడిని నీవు ఎలా ముందుకు వెళ్తావు? అని అడుగుతోంది. కానీ భగత్‌సింగ్ ఆలోచనలు మరో ప్రశ్నను కూడా మన ముందుంచుతాయి. నీవు ముందుకు వెళ్తున్నప్పుడు నీ చుట్టూ ఉన్న సమాజం పరిస్థితి ఏమిటి? వ్యక్తిగత విద్య, ఉద్యోగం, ఆర్థిక స్థిరత్వం అవసరమే. అయితే అదే సమయంలో సమాజంలో ఉన్న అసమానతలు, పేదరికం, నిరుద్యో గం, వివక్ష, విద్యా అవకాశాల కొరత వంటి సమస్యలపై స్పందించే సామాజిక బాధ్యత కూడా యువతలో ఉండాలి. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడం కాదు. ప్రజా సమస్యలను అర్థం చేసుకోవడం, ప్రశ్నించడం, చర్చించడం, శాంతియుత ప్రజాస్వామ్య మార్గాల్లో పరిష్కారాల కోసం కృషి చేయడం కూడా. భగత్‌సింగ్ వారసత్వాన్ని సజీవంగా ఉంచేది ఇదే చైతన్యం. చదివిన యువత... ఆలోచించే యువత. ఆలోచించే యువత... ప్రశ్నించే యువత. ప్రశ్నించే యువత... సమాజాన్ని మార్చగల యువత.

**భగత్‌సింగ్ ఆలోచనల నుంచి నేటి యువత వరకు – ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం మళ్లీ ఎందుకు మారుమోగుతోంది?**

2026లో ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా జరిగిన యువత ఉద్యమం ఒక ముఖ్యమైన విషయాన్ని మన ముందుకు తెచ్చింది. విద్యా వ్యవస్థలోని సమస్యలు, పరీక్షల విశ్వసనీయత, యువత భవిష్యత్తు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి ప్రశ్నలపై వేలాది మంది యువత వీధుల్లోకి వచ్చారు. ఆ ఉద్యమంలో ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం మారుమోగింది. భగత్‌సింగ్ చిత్రపటాలు కూడా కనిపించాయి. ఇది మొత్తం జెన్ జీ ఒకే రాజకీ య సిద్ధాంతాన్ని స్వీకరించిందని చెప్పడానికి ఆధారం కాదు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. అన్యాయం ఎదురైనప్పుడు ప్రశ్నించే యువత ఉంది. వ్యక్తిగత సమస్యలను సామాజిక ప్రశ్నలుగా మార్చే చైతన్యం ఉంది. భగత్ సింగ్ పేరు, ఇంక్విలాబ్ నినాదం ఇంకా కొత్త తరానికి అర్థవంతమైన రాజకీయ భాషలో భాగంగా ఉన్నాయి. పరీక్షలో జరిగిన అన్యాయం ఒక విద్యార్థి వ్యక్తిగత సమస్యగా మొదలై, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, అవకాశాల సమానత్వం, ప్రభుత్వ బాధ్యత వంటి విస్తృత ప్రశ్నలుగా మారినప్పుడు అక్కడే వ్యక్తిగత ఆవేదన నుంచి సామాజిక చైతన్యానికి ప్రయాణం ప్రారంభమవుతుంది.

భగత్‌సింగ్‌కు ఇంక్విలాబ్ అంటే కేవలం అధికారం లో ఒకరిని తొలగించి మరొకరిని కూర్చోబెట్టడం కాదు. సమాజపు పునాదుల్లో మార్పు తీసుకురావడం. దోపిడీ, అసమానత, పేదరికం, నిరుద్యోగం, సామాజిక అన్యాయం కొనసాగుతూనే రాజకీయ మార్పును సంపూర్ణ స్వాతంత్ర్యంగా చూడలేమనే విస్తృత ఆలోచన ఆయన రాజకీయ పరిణామంలో కనిపిస్తుంది. అందుకే ఇంక్విలాబ్ జిందాబాద్ అనేది ఒక నినాదం మాత్రమే కాదు, సమాజాన్ని మార్చాలనే నిరంతర ఆకాంక్షకు ప్రతీక. నేడు యువతలో సమానత్వం, ప్రజా విద్య, ఉపాధి, కార్మిక హక్కులు, సామాజిక న్యాయం వంటి ప్రశ్నలు మళ్లీ బలంగా ముందుకు వస్తున్నప్పుడు, వాటిని భగత్‌సింగ్ ఆలోచనా వారసత్వంతో అనుసంధానించి చదవాల్సిన అవసరం ఉంది. ఇది యువత అంతా సోషలిజాన్ని స్వీకరించిందనే సరళమైన నిర్ధారణ కాదు. కానీ సమా జం ఎవరి కోసం? అభివృద్ధి ఫలాలు ఎవరికి? విద్య, ఉపాధి అందరికీ సమానంగా ఎందుకు అందకూడదు? సంపద, అవకాశాల అసమానత ఎందుకు కొనసాగాలి? అనే ప్రశ్నలు బలపడుతున్నాయంటే, అక్కడ భగత్‌సింగ్ ఆలోచనలను కొత్త తరం ముందు తిరిగి ఉంచాల్సిన చారిత్రక అవకాశం ఉంది. భగత్‌సింగ్‌ను పోస్టర్‌లో మాత్రమే కాదు, యువత ప్రశ్నల్లో, సమానత్వం కోసం జరిగే పోరాటాల్లో, శాస్త్రీయ ఆలోచనలో, దోపిడీ రహిత సమాజం కోసం జరిగే ప్రజా ఉద్యమంలో సజీవంగా చూడాలి.

భగత్‌సింగ్‌ను వివిధ రాజకీయ, సామాజిక వర్గాలు తమతమ దృక్కోణాల్లో స్మరిస్తుంటాయి. అయితే ఆయన స్వయంగా రాసిన రచనలు, లేఖలు, జైలు నోట్లు, ఆయ న రాజకీయ పరిణామాన్ని పరిశీలిస్తే ఆయనను కేవలం ఒక ఫొటో, ఒక టోపీ, ఒక నినాదం లేదా ఒక వీరోచిత సంఘటనకు పరిమితం చేయడం ఆయన ఆలోచనా విస్తృతిని తగ్గించినట్లే అవుతుంది. భగత్‌సింగ్‌ను చదవడం అంటే ఆయన ఆలోచనలతో ఏకీభవించడం మాత్ర మే కాదు. ఆయన ప్రశ్నలను మన సమాజం ముందు పెట్ట డం, చర్చించడం, విశ్లేషించడం కూడా. ఆయనను స్మరించే ప్రతి విద్యాసంస్థలో, ప్రతి యువజన సంఘం లో, ప్రతి గ్రంథాలయంలో పఠన చర్చలు జరగాలి. భగత్‌సింగ్ చిత్రాన్ని గోడపై పెట్టడం కంటే ఆయన పుస్తకాన్ని యువత చేతిలో పెట్టడం గొప్ప నివాళి. ఆయన పేరును నినదించడం కంటే ఆయన ఆలోచనలను చర్చించడం గొప్ప నివాళి.


**షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతి (సెప్టెంబర్ 28)** సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) తరపున భవిష్యత్ యువతకు సందేశం. భగత్‌సింగ్‌ను కేవలం స్మరించకండి, చదవండి. కేవలం చదవకండి, ఆలోచించండి. కేవలం ఆలోచించకండి, ప్రశ్నించండి. ప్రశ్నించిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో సంఘటితంగా ముందుకు సాగండి.


ఉద్యోగం కోసం పోరాడే ప్రతి నిరుద్యోగి పక్కన నిలుద్దాం. విద్య హక్కు కోసం పోరాడే ప్రతి విద్యార్థి గొంతుకగా నిలుద్దాం. మూఢనమ్మకాల స్థానంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుదాం. అసమానతల స్థానంలో సమానత్వాన్ని, ద్వేషం స్థానంలో మానవత్వాన్ని, నిరాశ స్థానంలో భవిష్యత్తుపై నమ్మకాన్ని నిర్మిద్దాం. యువత చేతుల్లో పుస్తకం ఉండాలి, మెదడులో ప్రశ్న ఉండాలి, హృదయంలో మానవత్వం ఉండాలి, సమాజం పట్ల బాధ్యత ఉండాలి. అదే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి. అదే AIYF నిర్మించాలనుకునే చైతన్యవంతమైన భవిష్యత్ యువత.

# ఒంటరితనాన్ని దూరంచేసే మార్గం ఏదీ?

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వైయక్తిక కుటుంబాలు రోజు రోజుకు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒంటరితనం విస్తృతంగా వివిధ కుటుంబాల్లో విజృంభిస్తోంది.. అదే సమయంలో సొంత వాళ్ళకు, సొంత ఊళ్లకు దూరం కావడం వల్ల చాలామంది ఒంటరితనం అనుభవిస్తున్నారు.. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారింది... ఇదే సమయంలో ప్రపంచాన్ని ఏకం చేయడానికి నేనున్నా అంటూ గత రెండు దశాబ్దాలుగా పట్టణ ప్రాంతాల నుంచి మారుమూల గ్రామాల్లోకి చొచ్చుకొచ్చిన 'ఆరు అంగుళాల నవీన సాంకేతిక ఆయుధం సెల్ ఫోన్' మొత్తం ప్రపంచాన్ని ఆ మాటకు వస్తే ప్రజల జీవితాలనే మార్చి వేసింది.. అగ్గికి ఆజ్యం పోసినట్లు ముఖ్యంగా మన దేశంలో పబ్లిక్‌రంగంలో ఉన్న టెలికాం బి.ఎస్.ఎన్.ఎల్‌ను అణగదొక్కుతూ, ప్రైవేటురంగంలో అనేక నెట్వర్క్ సంస్థలు 'జియో' వంటివి ఉద్భవించి, ఫ్రీ డేటా అంటూ మొత్తం యావత్ దేశాన్ని సెల్ మత్తుతో ముంచెత్తుతోంది... దీంతో అప్పుడే పుట్టిన చంటి బిడ్డ నుంచి మరణానికి చేరువలో ఉన్న ముసలి వాళ్ళు వరకూ సెల్ మత్తులో ఊగిసలాడుతున్నారు...ఈ సెల్ ను సద్వినియోగం చేసుకునే వారికంటే దుర్వినియోగం చేసుకునే వారే ఎక్కువ అని తెలుస్తుంది..

ముఖ్యం గా రకరకాల యాప్‌లు అందుబాటులోకి వచ్చా యి.. వీటిలో యువతను, బలహీన మనస్తత్వం కలిగిన వారిని బుట్టలో వేసుకునే, ఆకట్టుకునే వారి జీవితాలను నాశనం చేసే అనేక యాప్‌లు పుట్టికొచ్చి, వాటి వలలో చిక్కుకుని విలవిల లాడుతున్న పరిస్థితి ఏర్పడింది. అపరిమితమైన డేటా ప్యాక్, అన్ లిమిటెడ్ కాల్స్ వంటి నెట్వర్క్ ప్యాకేజీలు వివిధ సంస్థలు తరచూ తక్కువ ధరలకు అందుబాటులోకి తేవడంతో దాదా పు అందరూ ఈ ప్యాకేజీ లు వాడుతూ తమకు ఇష్టమైన యాప్‌లు చూస్తూ ఈ ప్రపంచంలో కనీసం తమ ఇళ్లలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో మొత్తం సమయా న్ని ఒంటరిగా గడుపుతున్న పరిస్థితి...ఈ ఒంటరితనం సమయాన్నే మంచి మహాద్భుతమైన అవకాశంగా అందిపుచ్చుకుని కార్పోరేట్ ప్రపంచం, వివిధ నెట్వర్క్ సంస్థలు, యాప్‌లు వివిధ సంస్థలు పెద్ద పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ లక్షల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు.. ఈ ఒంటరితనం పోగొట్టుకునే క్రమంలోనే యువత, మహిళలు అనేక అసాంఘిక కార్యకలాపాలకు, చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నా రు. కొందరు మత్తుకు,





మైకానికి లోనవుతుంటే, మరి కొందరు అశ్లీల కార్యక్రమాలకు, వివాహేతర సంబంధాలకు, అక్రమ సంబంధాలకు, హింసా ప్రవృత్తికి లోనవుతున్నారు.. ఇటీవల కాలంలో చాలా హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకి పెచ్చరిల్లిపోవడానికి ప్రత్యక్ష కారణం ఒంటరితనం అయితే, పరోక్షంగా సెల్ ద్వారా అందుబాటులోకి వచ్చిన వివిధ రకాల యాప్‌లు... ఆన్లైన్ గేమ్‌లు, బెట్టింగ్ వ్యాపారాలు, వీడియో గేమ్స్, సులభంగా డబ్బులు సంపాదించే మార్గాలు తెలిపే యాప్‌లు, వీడియోలు, యూట్యూబ్ ఛానెల్స్, రీల్స్, షార్ట్ ఫిల్మ్ ఇలా లెక్కలేనన్ని సౌకర్యాలు అందుబాటులోకి కార్పోరేట్ సంస్థలు, పరిశ్రమలు, నెట్వర్క్ సంస్థలు తీసుకుని రావడంతో లక్షల కోట్ల రూపాయ లు వ్యాపారాలు చేస్తూ, కోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్నారు.. ఒకపూట తిండి లేకపోయినా ఫర్వాలేదు కానీ ఒక నిమిషం ఫోన్, నెట్వర్క్ లేకుండా నేటి ప్రజలు ఉండలేకపోతున్నారు అంటే అతిశయోక్తికాదు...ఈ విధంగా సెల్ మాయాజాలంలో ఒంటరితనం పోగొట్టుకునే క్రమంలోనే జీవితాన్ని ఏ రకమైన చైతన్యం, సృజనాత్మతకత లేకుండా గడుపుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.. ముఖ్యంగా యువత చాలామంది అనవసరమైన సామాజిక మాధ్యమాల్లో విహరించడం వల్ల చెడు వ్యసనాలకు బానిసలవుతూ సమాజంలో అసాంఘిక శక్తులుగా మారుతూ దేశానికి అతిపెద్ద సామాజిక సమస్యగా తయారవుతున్నారు.. శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యాలకు, మానసిక రుగ్మతలకు లోనవుతున్నారు. ముఖ్యంగా ఒంటరితనం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొన్ని డేటింగ్ యాప్‌లు లాభా లు గడిస్తున్నారు.. ముఖ్యంగా 'గ్లీడెన్' యాప్‌లో ఇప్పటికే మనదేశంలో 40 లక్షలు మందికి పైగా చేరారు అంటే ఎంత భయంకరంగా అనుచిత ప్రవర్తనకు ప్రజలు లోనవుతున్నారో అర్థం అవుతుంది. ఇంకో విచి త్రం ఏమిటంటే పెళ్ళైన మహిళలు కూడా ఇటువంటి యాప్‌లలో సభ్యులుగా చేరడం కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడానికి కారణం అవుతుంది.

ఐ.ప్రసాదరావు
, 9390509791

# మేఘాలయలో బిజెపిలోకి 8మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు

**గువహతి :** క్రిష్టియన్ మెజారిటీ రాష్ట్రం మేఘాలయలో బిజెపి పంటపండింది. యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ (యుడిపి) కి చెందిన 8మంది ఎమ్మెల్యేలు బుధవారం బిజెపి గూటికి చేరారు. దాంతో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) తర్వాత రెండవ పెద్ద పార్టీగా బిజెపి అవతరించింది. ఫిరాయింపుదారులు న్యూఢిల్లీలో బిజెపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఈ ఫిరాయింపులతో శాసన సభలో యుడిపి బలం 12నుంచి4కు తగ్గగా, బిజెపి బలం 2నుంచి 10కి చేరింది. యుడిపి, బిజెపి రెండూ కూడా ఎన్‌పిపి నాయకత్వంలోని పాలక మేఘాలయ డెమొక్రటిక్ అలయెన్స్ ప్రభుత్వంలో భాగస్వాములు. బిజెపిలోకి 8మంది ఫిరాయింపుదారులను చేర్చుకుంటున్నట్లు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిట్ పాత్రా కేంద్రమంత్రి కిరణ్ రిజుజు సమక్షంలో ప్రకటించారు. తమ ఎన్‌పిపికి ఎట్టి ప్రమాదం లేదని ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా వ్యాఖ్యానించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ (భూ సేకరణ)
ఫారం - 6
(చట్టం -30/2013 లోని సెక్షన్ 11 (1) లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం )
ప్రాథమిక నోటిఫికేషన్

G1/5652/2026 — తేది: 08.09.2026
నెం. సి/40/2026 — తేది: 02.09.2026

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, నార్కెట్ పల్లి మండలం చెర్వుగట్టు గ్రామం, నందు భూమి విస్తీర్ణం: ఎ. 7.36 1/2 గుంటల పట్టా భూమి ప్రజా ప్రయోజనార్ధం ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో భాగంగా కుడి ప్రధాన కాలువ యొక్క D2-2R మైనర్ కి.మీ. 0.537 నుండి కి.మీ. 1.121 మరియు కి.మీ. 1.788 నుండి కి.మీ. 2.975 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ (11) అనుసరించి ప్రకటన జారిచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి. ఓ. యం. ఎస్. నెం.54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్ / 2ఎ) (క్యాడ్ & డిపార్టుమెంటు) తేది: 25.07.2017 నాడు జారీ చేసినారు అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యయము II & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, నార్కెట్‌పల్లి మండలం, చెర్వుగట్టు గ్రామం, విస్తీర్ణం ఎ.7.36 1/2 గుంటల పట్టా ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారిచేయనైనది.

మండలం: నార్కెట్‌పల్లి — గ్రామం: చెర్వుగట్టు — జిల్లా: నల్లగొండ

| క్ర. సం. | సర్వే నెం./ భూమి స్వభావము విస్తీర్ణం (ఎ.గుం) | భూసేకరణ విస్తీర్ణం ఎ.గుం. | పట్టాదారు / ఎంజాయర్ పేరు, భర్త/తండ్రి పేరు | చెట్లు / నిర్మాణాలు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 765 పట్టా/ తరి 1.23 1/2 | 0.00 1/2 | వేముల నర్సింహా తండ్రి మైసయ్య | -- |
| 2 | | 0.09 | జింకల ఆనందం తండ్రి మల్లయ్య | 1 బోరు, పైప్ లైన్, 25 నిమ్మ చెట్లు, 1 వేప చెట్టు |
| 3 | | 0.07 3/4 | వేముల నర్సింహా తండ్రి మైసయ్య | పైప్ లైన్, 2-తాటి చెట్లు |
| | | 0.07 34 | వేముల ఎల్లయ్య తండ్రి మైసయ్య | 2 సమాధులు, 1 దర్గా, పైప్ లైన్ |
| 4 | | 0.38 1/2 | వేముల వెంకన్న తండ్రి మైసయ్య | పైప్‌లైన్ |
| 5 | 766 పట్టా/ తరి 1.14 1/2 | 0.09 | నకిరేకంటి స్వామి తండ్రి రామచంద్రయ్య | 1 బోరు, పైప్ లైన్, 2 టేకు, 8 వేప చెట్లు |
| 6 | | 0.28 | బొబ్బలి సైదులు తండ్రి గంగయ్య | 6 తాటి చెట్లు, 02 వేప,పైప్ లైన్ |
| 7 | | 0.17 1/2 | శీగా సత్తయ్య తండ్రి ఎల్లయ్య | -- |
| 8 | 482 పట్టా/ తరి 0.38 1/2 | 0.21 1/2 | బొబ్బలి సోమయ్య తండ్రి లచ్చయ్య | 2 సమాధులు, 2 వేప చెట్లు |
| 9 | | 0.06 1/2 | దాసరి ముత్తయ్య తండ్రి సాయిలు | 5 తాటి చెట్లు |
| 10 | | 0.10 1/2 | దాసరి ముత్తయ్య తండ్రి సాయిలు | -- |
| 11 | 481 పటా/ తరి 0.11 1/2 | 0.04 | జంగిలి సైదులు తండ్రి లింగయ్య | 1 బోర్, పైప్ లైన్ |
| | | 0.04 | జంగిలి మల్లిఖార్జున్ తండ్రి లింగయ్య | 1 బావి, 1 బోరు, పైప్ లైన్, ఫెన్సింగ్ |
| | | 0.03 1/2 | జంగిలి మహేశ్ తండ్రి లింగయ్య | 1 బోరు, పైప్లైన్, 4 వేప చెట్లు |
| 12 | 480 పట్టా/ తరి 0.36 | 0.11 1/2 | జంగిలి వెంకన్న తండ్రి సైదులు | 1 బావి, 2 బోరు, పైప్ లైన్ |
| 13 | | 0.11 1/2 | జంగిలి శేఖర్ తండ్రి సైదులు | |
| 14 | | 0.04 1/4 | యాస మల్లారెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్‌లైన్ 1 బోరు, పైప్ లైన్ |
| 15 | | 0.04 1/4 | యాస మోహన్ రెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 16 | | 0.04 1/2 | యాస నర్సీ రెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 17 | 485 పట్టా/ తరి 0.31 1/2 | 0.01 1/2 | యాస మల్లారెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 18 | | 0.01 1/2 | యాస మోహన్ రెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 19 | | 0.02 | యాస నర్సిరెడ్డి తండ్రి శంకర్ రెడ్డి | పైప్ లైన్ |
| 20 | | 0.26 1/2 | తునుపునూరి ప్రభాకర్ తండ్రి సత్తయ్య | పైప్ లైన్ |
| 21 | 486 పట్టా / తరి 0.23 | 0.23 | జాల జానయ్య తండ్రి సాయిలు | పైప్ లైన్ |
| 22 | 471 పట్టా/ తరి 0.14 | 0.02 1/4 | జాల జానయ్య తండ్రి సాయిలు | -- |
| 23 | | 0.10 | జీట్లా సరిత భర్త నాగరాజు | -- |
| 24 | | 0.01 3/4 | జాల జానయ్య తండ్రి సాయిలు | -- |
| 25 | 470 పటా/ తరి 0.22 | 0.08 | జాల జానయ్య తండ్రి సాయిలు | పైప్ లైన్ |
| 26 | | 0.14 | వంగల సత్యనారాయణ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి | పైప్ లైన్ |
| 27 | 469 పటా/ తరి 0.22 | 0.07 | వంగల సత్యనారాయణ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి | పైప్ లైన్ |
| 28 | | 0.03 | మేకల కాంతమ్మ భర్త పట్టాబి | పైప్ లైన్ |
| 29 | | 0.10 | రేగట్టే లింగారెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | పైప్ లైన్ |
| | | | రేగట్టే వెంకట్రాం రెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | -- |
| 30 | | 0.02 | రేగట్టే లింగారెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | పైప్‌లైన్ |
| 31 | | | రేగట్టే వెంకట్రాం రెడ్డి తండ్రి బుచ్చి రెడ్డి | పైప్‌లైన్ |
| | మొత్తము | 7.36 1/2 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 ( చట్టం నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ 11 (1) సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ఆర్ & ఎల్.ఎ., విభాగం-2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్. నెం. 6, జి. వి. గూడెం, నల్గొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ఆర్ & ఎల్.ఎ. విభాగం-2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్-15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఎ. విభాగము2, నల్గొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ. విభాగం-2, నల్లగొండ.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ.
సం/- జిల్లా కలెక్టర్, నల్లగొండ.
DIPR RO NO. 903/LA/PP/Advt/Pub/2026-27

# 2030 నాటికి పేదరిక నిర్మూలన

- 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- రాష్ట్ర అభివృద్ధి కార్యాచరణకు వేగం పెంచే దిశగా కీలక నిర్ణయాలు
- టిఎస్‌డిపిఎస్ బలోపేతం..
- ప్రత్యేక పిఎంయు ఏర్పాటు
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్ రూపకల్పన
- ప్రభుత్వం జిఎఫ్ఎస్‌టి భాగస్వామ్యానికి ప్రతిపాదన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుంది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌కు చెందిన జిఎఫ్ఎస్‌టి వైస్ చైర్మన్ ఎస్.పి.టక్కర్, జిఎఫ్ఎస్‌టి ప్రతినిధులు, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించేలా వ్యవస్థలను రూపొందించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఆ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం (టిఎస్‌డిపిఎస్) ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పిఎంయు) ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను పిఎంయు నిర్వహించనున్నారు.

### 2030 నాటికి 'జీరో పావర్టీ'

2030 నాటికి తెలంగాణను 'జీరో పావర్టీ' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక, లక్ష్యిత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణను 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని బలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

### రంగాల వారీ నిపుణుల సేవలు

రాష్ట్ర ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్‌టెంట్ల సేవలను వినియోగించుకోనున్నారు. ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక సహకారాన్ని నిపుణుల ద్వారా పొందనున్నారు. వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్ సపోర్ట్, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, కీలక అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు తెలంగాణ ప్రభుత్వం జిఎఫ్ఎస్‌టి మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకునే ప్రతిపాదనను సిద్ధం చేస్తారు.

### జిల్లాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

రాష్ట్ర స్థాయి అభివృద్ధి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే వీలున్న ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రణాళికలకు డేటా ఆధారిత డ్యాష్‌బోర్డులు, స్పష్టమైన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కెపిఐలు), కొలిచే వీలున్న ఫలితాలు, బడ్జెట్ అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో జిల్లాల అభివృద్ధి పురోగతిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు లోటుపాట్లను గుర్తించి, అవసరమైన చోట సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

### ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్

ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ఇతర కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్‌సను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ గ్రోత్ ల్యాబ్స్‌లో ప్రధానంగా పేదరిక నిర్మూలన, మౌలిక వసతులులాజిస్టిక్స్, ఆరోగ్యం, పర్యాటకం, పశుసంపద ఆక్వాకల్చర్, పట్టణీకరణ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ అంశాలపై దృష్టి సారించనున్నారు. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఉన్న అవరోధాలను పరిష్కరించడం, రంగాల వారీ వ్యూహాలను రూపొందించడం, ప్రాధాన్యతలను కాలపరిమితితో కూడిన, కొలిచే వీలున్న కార్యాచరణ ప్రణాళికలుగా మార్చడం గ్రోత్ ల్యాబ్స్ ప్రధాన ఉద్దేశంగా ఉంటుందని తెలిపింది.

### ఫలితాల ఆధారంగా అభివృద్ధి

టిఎస్‌డిపిఎస్ పిఎంయు బలోపేతం, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్, రంగాల నిపుణుల సేవలు, ప్రభుత్వం జిఎఫ్ఎస్‌టి భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు, ఫలితాలపై దృష్టి, మిషన్ మోడ్‌లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది. 2030 నాటికి పేదరిక నిర్మూలన, 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు రాష్ట్ర అభివృద్ధి దార్శనికతను కార్యాచరణలోకి తీసుకురావడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని సమావేశంలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కేంద్రం దిగమతి సుంకాన్ని తగ్గించడం... ఆయిల్ పామ్ రైతులను దగా చేయడమే

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించడం ఆయిల్‌పామ్ రైతులను దగా చేయడమేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్య క్తం చేశారు. ఒకవైపు రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రో త్సహిస్తూ, మరోవైపు దిగుమతి సుంకాన్ని తగ్గించడం కేంద్ర ప్రభుత్వ ధ్వంధ్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు.ఒక చేత్తో రైతులను ఆయిల్‌పామ్ వైపు నడిపిస్తూ.. మరో చేత్తో విదేశీ పామాయిల్‌కు మార్కెట్ సులభతరం చేయడం ఏ విధమైన రైతు అనుకూల విధానమని మంత్రి ప్రశ్నించారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశీ పామాయిల్ దిగుమతులకు పోటీ ప్రయోజనం పెరిగి, దేశీయంగా ఆయిల్‌పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశీయ ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దిగుమతి సుంకాన్ని44 శాతానికి పెంచాలని కోరుతుంటే.. కేంద్రం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గించడం ఆందోళన కలిగించే పరిణామమని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ధర భరోసా కల్పించాల్సిన సమయంలో దిగుమతులను చౌక చేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఆయిల్ పామ్ దీర్ఘకాలిక పంట అని, మొక్క నాటినప్పటి నుంచి రైతు సంవత్సరాల పాటు నీరు, ఎరువులు, నిర్వహణపై పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని తుమ్మల తెలిపారు. సాగులోకి వచ్చిన తర్వాత విధానపరమైన మార్పులతో మార్కెట్ ధరలపై ప్రతికూల ప్రభావం పడితే నష్టపోయేది రైతులేనన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెద్ద ఎత్తున విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో 88 వేలకుపైగా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని చెప్పారు. పెట్టుబడి రాయితీలు, మొక్కల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, రిఫైనరీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.కేంద్రం కూడా దేశీయ ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంచి, వంట నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఎన్‌ఎంఇఓపి ద్వారా లక్ష్యాలు నిర్దేశిస్తోందని మంత్రి గుర్తుచేశారు. అయితే సాగు విస్తరణకు ప్రోత్సాహం ఇస్తూనే దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల రైతుల్లో అనిశ్చితి ఏర్పడుతుందని అన్నారు. ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర కల్పించాలన్నది తెలంగాణ రైతుల ప్రధాన డిమాండ్ అని మంత్రి తెలిపారు. దేశీయ రైతులకు స్థిరమైన ధర భరోసా కల్పించే విధానాన్ని కేంద్రం రూపొందించాలని కోరారు. దేశ అవసరాల్లో గణనీయమైన భాగం వంట నూనెల దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో దేశీయ ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంచడం అత్యవసరమని తుమ్మల అన్నారు. దేశీయ రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది. రైతును బలోపేతం చేయకుండా దిగుమతులను చౌక చేయడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్ సాధ్యం కాదు అని పేర్కొన్నారు.కేంద్రం దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని దేశీయ ఆయిల్‌పామ్ రైతులకు ధర రక్షణ కల్పించే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ

- ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలి
- పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెంచాలి
- అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తృతం చేసి పెట్టుబడులు, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచాలని సూచించారు. పర్యాటక అభివృద్ధి అంటే కేవలం ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడం మాత్రమే కాదని, తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో గురువారం పర్యాటక, సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులు, శాఖ ఆస్తుల వినియోగం, బడ్జెట్ కేటాయింపులు, ప్రైవేట్ పెట్టుబడులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక బ్రాండింగ్‌పై చర్చించారు.

### పిపిపి విధానంలో కొత్త ప్రాజెక్టులు

పర్యాటక శాఖకు చెందిన భవనాలు, ఖాళీ స్థలాలు, ఇతర ఆస్తులను గుర్తించి పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో అభివృద్ధి చేయాలని భట్టి సూచించారు. ఆదాయాన్ని సమకూర్చేలా ఆస్తులను వినియోగించడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే చర్యలు చేపట్టాలన్నారు. పెట్టుబడిదారులకు ఎదురవుతున్న లీజు విధానాలు, ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యత తదితర సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌లను రూపొందించాలన్నారు. హోటళ్లు, రిసార్టులు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద పరిరక్షణకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. రామప్ప వంటి చారిత్రక ప్రదేశాల్లో పరిరక్షణ, నిర్వహణ, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరిరక్షణ బాధ్యతలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టుల మధ్య సమతుల్యత పాటించాలన్నారు. విద్యార్థుల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంచేందుకు 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థులను చారిత్రక ప్రదేశాలు, మ్యూజియంలు, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా రాష్ట్ర వారసత్వంపై అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ పెట్టుబడులు, ఉపాధి, ఆదాయం పెరిగేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ స్నిగ్ధా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## డిఎస్‌పి అక్రమాస్తుల కేసులో కొనసాగుతున్న ఎసిబి సోదాలు

- 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు.. బినామీల ఇళ్లలో కీలక పత్రాలు స్వాధీనం
- బొమ్మ వెంకటేశ్ ఇంట్లో రూ.1.35 కోట్ల నగదు.. విదేశీ కరెన్సీ, 14 లీటర్ల విదేశీ మద్యం గుర్తింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగం డిఎస్‌పి సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) సోదాలు కొనసాగుతున్నాయి. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా గురువారం హైదరాబాద్, జహీరాబాద్ పరిధిలోని 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన ఎసిబి అధికారులు, అనుమానిత బినామీల ఇళ్ల నుంచి కేసుకు సంబంధించిన పలు కీలక పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఎసిబి వివరాల ప్రకారం.. డిజిపి కార్యాలయంలో పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డిఎస్‌పిగా పనిచేస్తున్న సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు గత జూన్ 27న నమోదు చేశారు. అవినీతి నిరోధక చట్టం1988లోని సెక్షన్ 13(1)(బి)తో పాటు 13(2) కింద సిటీ రేంజ్2 ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో భాగంగా గతంలో నిర్వహించిన సోదాలకు కొనసాగింపుగా తాజా తనిఖీలు చేపట్టారు. భీమ్‌రెడ్డితో ఆర్థిక, ఇతర లావాదేవీలు ఉన్నట్లు అనుమానిస్తున్న బినామీల నివాసాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎసిబి అధికారులు, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను సేకరించారు. ఈ క్రమంలో బొమ్మ వెంకటేశ్ అనే వ్యక్తి నివాసంలో రూ.1.35 కోట్ల నగదు గుర్తించినట్లు ఎసిబి వెల్లడించింది. అదే విధంగా విదేశీ కరెన్సీతో పాటు సుమారు 14 లీటర్ల విదేశీ మద్యం కూడా లభ్యమైనట్లు తెలిపింది. విదేశీ మద్యం గుర్తించిన విషయాన్ని ఎసిబి అధికారులు ఎక్సైజ్ శాఖకు తెలియజేశారు. దీనిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నారు. అవసరమైన కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఎసిబి పేర్కొంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని ఎసిబి తెలిపింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, నగదు, ఇతర వస్తువుల ఆధారంగా తదుపరి దర్యాప్తు చేపట్టనున్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై స్పష్టత ఇవ్వాలి

పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే
అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరూ కూడా తొలగించొద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓటర్ల హక్కుల విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పలు అంశాలపై ఆయన స్పందించారు. గత పది నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెలువడిన నివేదికలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం6లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడానికి అనుసరించిన ప్రక్రియ, చట్టపరమైన ఆధారాలను వెల్లడించాలన్నారు. తొలిసారి ఓటు హక్కు పొందే యువతకు అనవసర ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఇసిఐనెట్ ద్వారా ఓటర్ల డేటాలో మార్పులు చేసే విషయంలో ఎన్నికల నమోదు అధికారుల (ఇఆర్‌ఓ) పాత్ర, పర్యవేక్షణపై స్పష్టత ఇవ్వాలన్నారు. డేటాలో మార్పులు ఎవరు, ఎప్పుడు, ఏ కారణంతో చేశారనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించిన ఓటర్ల పేర్లు, అందిన అభ్యంతరాలు, తిరిగి చేర్చిన పేర్ల వివరాలను రాష్ట్రాలు, నియోజకవర్గాల వారీగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలన్నీ ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని ఆ సంస్థ వర్గాలు పేర్కొన్న నేపథ్యంలో, అభ్యంతరాలపై పూర్తి వివరాలను వెల్లడించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. తెలంగాణలో అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని పొన్నం స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడాలని, అనర్హమైన పేర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

## విధి నిర్వహణలో ఎస్ఐ వెంకన్న మృతి బాధాకరం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణేష్ నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కొత్తగూడెం టూ టౌన్ ఎస్ఐ కె. వెంకన్న మృతి చెందడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ వెంకన్న ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని పేర్కొన్నారు. ఆయన మృతి కుటుంబానికే కాకుండా మొత్తం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**


**క్ర.సం.1, పని పేరు:** శామీర్‌పేట్ వార్డ్ నెం.300, కీసర సర్కిల్-01, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసిలోని శామీర్‌పేట్ చెరువు నుంచి చెత్త, శిథిలాలను టిప్పర్లు, జెసిబి సహాయంతో లేబర్ ద్వారా జవహర్‌నగర్‌కు తరలించడం, **అంచనా విలువ:** రూ.4.95లక్షలు, **బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం:** 25.09.2026 ఉ.10:30గం.ల నుండి 26.10.2026 ఉ.10:30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి
DIPR R.O. No. : 10602-PP/CL/ADVT/2026-27, Date: 24-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I**

| NIT No. | పని పేరు | QTY | బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| కొటేషన్ నోటీసు నెం. 10/HD/EE-I/ MKJ ZONE/ MMC/26-27, Dated: 24.09.2026 | అవసరమైన టోనర్ / ఇంక్ సరఫరా మరియు అన్ని అనుబంధ ఖర్చులతో సహా, కార్యాలయ ప్రాంగణంలోనే ప్రింటర్ కార్ట్రిడ్జ్‌లను రీఫిల్ చేయడం. | Each | 25.09.2026 ఉ.11.30గం.ల నుండి 28.09.2026 ఉ.11.30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, సెల్ నెం. 9154796465 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 10637-PP/CL/ADVT/2026-27, Date: 24-09-2026



## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇండ్ల ప్రొసీడింగ్స్ గురువారం 11 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ గౌడ్ మాట్లాడుతూ ఇది సామాన్య ప్రజల ఆవాస కలను నిజం చేసి కార్యక్రమం అన్నారు. ఇళ్ల కలను నిజం చేసుకునే లబ్ధిదారులకు ప్రభుత్వ మద్దతు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కిషోర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు సర్వరాజు, సర్పంచ్‌లు నాగేంద్ర, సంగోళ్ల వెంకటేష్, లింగప్ప, సురేష్ పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన తాగునీటికి మరో ముందడుగు

**ప్రజాపక్షం/నర్వ :** నర్వ మండల పరిధిలోని లక్కర్దొడ్డి గ్రామంలో నూతన ఫిల్టర్ వాటర్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నై సాగర్ మాట్లాడుతూ ప్రజల స్వచ్ఛమైన తాగునీటి గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, లక్కర్‌దొడ్డి గ్రామ సర్పంచ్ సుశీల దేవన్న, ఉపసర్పంచు వెంకటేశ్వర్ రెడ్డి, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరణప్ప, రామ్‌కీసంస్థ అధికారులు విజయ్‌కుమార్ , వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధక్షులు పి.అశోక్ గౌడ్, నర్వ గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు బోయ పాటి నరసింహ, వార్డు సభ్యులు తిరుపతయ్య, జయమ్మ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ద మల్లేష్, సాగర్ , హనుమంతు, పెద్ద నరసింహ, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని గడిమున్కంపల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి రైతులతో సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 13 వరకు భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా యాసంగి సీజన్‌లో వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం వల్ల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. డిజిటల్ పంట నమోదు కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేస్తున్న పంటలను ఖచ్చితంగా నమోదు చేయించి, గ్రామ వాలంటీర్‌కు సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ ప్రసాద్, ఏఈఓ అజయ్ కుమార్, గ్రామ సర్పంచు నాగమణి, గోపాల్ తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఉచిత దుస్తులు, సాక్స్‌లు బెల్టుల పంపిణీ


**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలంలోని పంచదేవ్ పహాడ్ గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల పంచదేవ్ పహాడ్ మక్తల్ నందు తెలంగాణ ప్రభుత్వం ఉచిత దుస్తులు, సాక్స్‌ల , బెల్టుల కార్యక్రమం ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ , గ్రామపంచాయతీ సెక్రటరీ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, మహిళ సంఘాలు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం సరికాదు

**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని జాజాల గ్రామ సర్పంచ్ జిలకర కాశమ్మ ఈనెల 22వ తేదీ మండల కేంద్రంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యేపై అసత్య వ్యాఖ్యాలు చేయడం సరికాదని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమలేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచిని దళిత మహిళ అన్నాడని అసత్య ప్రచారం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే కూడా ఒక దళితుడే అని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించుకోని మాట్లాడాలని తిరుమలేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు చెన్నయ్య పాండు, చంద్రశేఖర్, విష్ణు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ

**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని డిండి చింతలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఉపసర్పంచు గంధం సత్యం యాదవ్ 70 మంది విద్యార్థులకు గురువారం స్పోర్ట్స్ డ్రస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాటశాల హెచ్‌ఎం లలిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఇలాంటి దాతలు ముందుకు వచ్చినట్లయితే విద్యార్థుల భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా మార్చవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాంభీష్మ పంచాయితీ కార్యదర్శి ప్రదీప్ రెడ్డి , ఉపాధ్యాయులు విద్యా కమిటీ మెంబర్లు , విద్యార్థులు , గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేని సన్మానించిన రైతులు, నాయకులు

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె.శివ కుమార్ ని ఒప్పించి తెలంగాణ రాష్ట్రం జూరాల ప్రాజెక్టుకు నీళ్ల విడుదల చేయడానికి కృషి చేసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిని గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండలం రైతులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కష్టాలను తెలుసుకోని సాగు నీటి విడుదలకు కృషి చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచు అశోక్ రెడ్డి, నాయకులు శ్రీరాములు రెడ్డి, రామాంజనేయులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ధాన్యం సేకరణ నిర్వహించాలి

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ ప్రియాంక



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మొదటి రోజు నుంచే పకడ్బందీగా నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సేకరణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రియాంక అధికారును ఆదేశించారు. గత సీజన్‌లో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి అమలు చేస్తున్న నూతన నిబంధనలు, ప్రోటోకాల్స్‌ను వందశాతం అమలు చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో వ్యవసాయ, మార్కెటింగ్, పీఏసీఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో ధాన్యం సేకరణపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జీపీఎస్ హమాలీల వివరాల నియోదు , జీపీఎస్, వ్యవసాయ డేటా ఇంట్రిగేషన్ వంటి విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.

**ముందుగానే కేంద్రాలు, స్థలాలు గుర్తించాలి :** ధాన్యం సేకరణపై హెడ్ ఆఫీస్, కమిషనర్ స్థాయి నుంచి నిరంతర సమీక్షలు జరగుతున్నందున జిల్లా అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సేకరణ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించాలని, మండలాల్లో ప్రభుత్వ స్థలాలతో పాటు భవిష్యత్ అవసరాల కోసం సుమారు 15 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. పిఎసిఎస్‌ల పరిధిలో అనువైన స్థలాలను గుర్తించి అదనపు సేకరణ కేంద్రాలు,గోదాముల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో సాధ్యం కాకపోయిన వచ్చే సీజన్ నాటికి అందుబాటులోకి వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**చివరి నిమిషంలో మార్పులకు తావివ్వొద్దు :** సేకరణ కేంద్రాలను ప్రారంభించే ముందే స్థానిక ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్‌లు, మార్కెటింగ్ శాఖ, సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకునే సిబ్బంది, హమాలీలు, పరికరాలు, ఇతర సామాగ్రిని సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో మాదిరిగా చివరి నిమషంలో కేంద్రాల మార్పులు, వివరాల నిమోదులో జప్యం జరగకుండా ఆన్‌లైన్‌లో అవసరమైన సమాచారాన్ని ముందుగానే నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ఫణికుమార్, సివిల్ సప్లై డీఎం సైదులు, వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, సంబంధిత అధికారలు పాల్గొన్నారు.



## విద్యుత్ కోసం రైతుల నిరసన

విద్యుత్ సరఫరా లేక సబ్‌స్టేషన్ ముట్టడి

**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండలం నిజామాబాద్ గ్రామస్థులు, రైతులు విద్యుత్ సరఫరా లేకపోవడంతో గురువారం పానుగల్ మండలం కేతేపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ను ముట్టడి చేశారు. నిన్నటి నుంచి గ్రామానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంచినీటి కోసం కూడా విద్యుత్ అందక అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన 100 మందికి పైగా రైతులు పాల్గొని అధికారులను నిలదీశారు. విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండు చేశారు. సబ్‌స్టేషన్ అధికారులు స్పందించిన విద్యుత్ ఏఈ రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. ఏఈ చందన కుమార్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయ్యడం జరిగిందని త్వరలోనే కనెక్షన ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



## ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శన

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సౌజన్యంతో నాకో వారి సహకారంతో వెన్నెల కల్చరల్ అకాడమీ కళాబృందం బుధవారం జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ జడ్చర్లలో హెచ్ఐవి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె సుద్దుల ద్వారా ఆటపాటలతో ప్రజలకు ఎయిడ్స్ హెచ్ఐవి గురించి అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ సందర్భంగా కళాకారులు హెచ్ఐవి సంక్రమించే విధానం రాకుండా ముందస్తు జాగ్రత్తలు మందులు వాడకం ప్రాధాన్యత సుఖవ్యాధుల లక్షణాలపై అవగాహన కల్పించారు. ఉచిత సమాచారం కోసం 1097 టోల్ ఫ్రీ నెంబర్ సెల్ఫ్ అసెస్మెంట్, క్యూఆర్అండ్ ను స్కాన్ చేసుకోవాలని వివరించారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి టెస్ట్ చేసుకోవాలని హెచ్ఐవి ఉన్న వాళ్లు భయపడకుండా ఆర్ట్ మందులు వాడాలని సూచించారు. వెన్నెల కల్చర్ అకాడమీ కళా బృందం కళాకారులు టీమ్ లీడర ఎదిర నరసింహ, చెన్నయ్య, యాదగిరి, జి.చెన్నయ్య, ఝాన్సీ ఎంఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అశోక్ గౌడ్, ప్రోగ్రామ్ మేనేజర్, జిఎన్‌ఎమ్ తార, ఓఆర్‌డబ్ల్యూ పద్మ, హారిక, ప్రభావతి, గణేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల ఆర్థిక అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేయాలి

విబిజీ-రామ్‌జీ పథకంతో సమగ్ర గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గ్రామాల ఆర్థిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా సర్పంచ్‌లు పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జీరామ్‌జీ పథకం అమలు, వికసిత్ గ్రామ పంచాయితీ ప్రణాళికపై సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణా అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు శాశ్వత ఆస్తులు, మౌలిక వసతుల అభివృద్ధికి జీరామ్ జీ పథకం కింద పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అత్యవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పథకం మార్గదర్శకాలు, నిబంధనలను సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు, అధికారులు పూర్తిగా తెలుసుకోవాలని, పథకం కింద 375 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టరాదని, తాగునీరు, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ , గ్రామీణ మౌలిక వసతులు, సహజ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి పనిలో నాణ్యత, పారదర్శకత పాటించాలని, నిధులను నిబంధనల ప్రకారమే వినియోగించాలని, పనుల వివరాలు, ఖర్చులు, పురోగతిని నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పథకం అమలు విధానం, పనుల ఎంపిక, ఆమోద ప్రక్రియ, నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిపిఒ శ్రీరాములు, అదనపు డిఆర్డీఒ రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, జిల్లాలోని 460 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రాయిచేడ్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు వేగవంతం చేయాలి :** రాయిచేడ్ గ్రామంలో నిర్మిస్తున్న అచ్చంపేట నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం అచ్చంపేట సబ్ కలెక్టర్ లోని చాబ్రాతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, క్రీడా సౌకర్యాలు కల్పించేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్న చిట్టెం

మంత్రిపై లేనిపోని అబద్ధాలు పలికితే సహించేది లేదు

గీత పారిశ్రామిక ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్



**ప్రజాపక్షం/అమరచింత :** మంత్రి వాకిటి శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి లేనిపోని అబద్దాలు చెప్పితే సహించేది లేదని రాష్ట్ర గీత పారిశ్రామిక ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ హెచ్చరించారు. గురువారం అమరచింత మండల కేంద్రంలోని హనుమాన్ పెట్రోల్ బంకు దగ్గర ఉన్న ఫంక్షన్ హాలులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో 2000కోట్లతో అభివృద్ధి పనులను చూడలేకనే మంత్రిపై దుర్భాషలాడుతూ మాజీ ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడడం సరైనది కాదని హెచ్చరించారు. మంత్రి వాకిటి శ్రీహరిపై వ్యక్తిగతంగా ఆరోపణలు చేయడం సరైనది కాదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు మీరే ఎన్నికలు నిలబడాలని మంత్రి వాకటి శ్రీహరి ఎన్నికల్లో ఉంటారన్నారు. ఎనాడు కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే పై దురుసుగా మాట్లాడలేదని గుర్తు చేశారు. అలాగే మాజీ మంత్రి కేటీఆర్ కూడా సిఎం గురించి ఇక్కడ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మంత్రి వాకిటి శ్రీహరి గురించి మాట్లాడే తీరును ఆయన తప్పు పట్టారు. డిసిసి కార్యదర్శి రమేష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డిచ, పట్టణ అధ్యక్షులు రవికాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జింక రవి కుమార్ యాదవ్ అరుణ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కమలాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, స్థానిక పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు

అదనపు కలెక్టర్ నర్సింగరావు

స్టూడెంట్స్ హెల్త్ ప్రొఫైల్ కార్డుల పంపిణీ ప్రారంభం

**ప్రజాపక్షం/గద్వాల్ :** విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తారని జోగులాంబ గద్వాల జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా హెల్త్ కార్డులు అందజేస్తుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు ఆరోగ్య పాఠశాల పేరుతో ముద్రించిన స్టూడెంట్ హెల్త్ ప్రొఫైల్ కార్డుల పంపిణీ గురువారం గద్వాలలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిర్వహించగా అదనపు నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పలువురు విద్యార్థులకు కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు వివిధ పరీక్షల నిర్వహించి కార్డుల్లో వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అనుసరించి అవసరమైన చికిత్స పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఆకుకూరలు, పండ్లు, మాంసకృత్తులు, తదితర పౌష్టికాహారం సమపాలల్లో తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు రాగి జావ కూడా ఇస్తుండటంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం త్వరలోనే బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెసిడెన్షియల్, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, కౌన్సిలర్ వేదవతి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సవారన్న, ఇతర వైద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, జిల్లా వైద్యాధికారి డా.సంధ్యా కిరణ్మయి భీమ్‌నగర్లోని పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్‌లో ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 43,419 మంది విద్యార్థులకు దశలవారీగా సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వారు తెలిపారు. ఆరోగ్య పరీక్షల్లో విద్యార్థుల ఎత్తు, బరువు, రక్తపోటు, పల్స్, హీమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్ తదితర పరీక్షలతో పాటు కంటి, చెవి, ముక్కు, గొంతు, గుండె, చర్మం, ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తారన్నారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన విద్యార్థులకు అవసరమైన చికిత్స, తదుపరి పరీక్షలు, రిఫరల్ సేవలు అందించనున్నారని చెప్పారు. వైద్య పరీక్షల వివరాలను నమోదు చేస్తూ ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షల వివరాలను నమోదు చేస్తూ ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా హెల్త్ ప్రొఫైల్ కార్డు రూపొందించనున్నారు.

ఇందులో విద్యార్థి ఆరోగ్య చరిత్ర, గుర్తించిన ఆరోగ్య సమస్యలు, అందించిన వైద్య సేవలు తదితర వివరాలను నమోదు చేస్తారు. తద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.ప్రసూన రాణి, డా.రాజు, డా.అస్గర్ అలీ, వైద్యాధికారులు డా.శరణ్య, డా.ప్రియాంక, నేత్ర వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, జిల్లా కార్యాలయ సిబ్బంది వరలక్ష్మి, తిరుమల్ రెడ్డి, నరేందర్ బాబు, నరసయ్య, హీర్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## డిజె పాటలతో సాగిన లంబోదరుడి నిమజ్జనోత్సవం



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో వివిధ వాడలో నవరాత్రులు కొలువు దీరిన విశేష పూజలు ధూప దీపన నైవేద్యాలు అందుకున్న గణనాథుడు నవరాత్రి మహోత్సవాలు గురువారం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక శోభతో నిర్వహించారు. వివిధ కాలనీలో చౌరస్తాలో ప్రతిష్టించిన గణేష్ విగ్రహాలు పువ్వులు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన వాహనాలో పూర్వ వీధుల గుండా శోభయాత్రగా తరలించారు. యువకులు పెద్ద రంగుల చల్లుతూ ఎంతో ఉత్సాహంగా అడుగులు వేశారు. గణపతి బొప్పా మోరియా జై బోలో గణేష్ మహరాజ్ కి జై అంటూ భక్తుడు నిమజ్జనానికి తరలి వెళ్లడం జరిగింది.

# సిసి కెమెరాల నిఘాలో గణేష్ శోభయాత్ర

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట బందోబస్తు : ఎస్పీ సునీత్

**ప్రజాపక్షం/నారాయనపేట్ :** జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. నారాయణపేట, మక్తల్ పట్టణాల్లో గణేష్ శోభయాత్రలు సిసి కెమెరాలు, వీడియోగ్రఫీ, డ్రోన్ కెమెరాలు నిఘా కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించి ఎస్పీ సిసి కెమెరాల ద్వారా పట్టణాల్లో జరుగుతన్న శోభయాత్రలను స్వయంగా పర్యవేక్షించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. డయల్ 112 కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 1,728 గణేష్ విగ్రహాల్లో ఇప్పటికే సుమారు. 1,300 విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని ఎస్పీ తెలిపారు. మిగిలిన విగ్రహాల నిమజ్జనం కూడా ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.

**చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలి :** నిమజ్జన ప్రాంతాల్లో నిర్వాహకులు, కమిటీ సభ్యులు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్పీ సూచించారు. జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాలను 24*7 పర్యవేక్షిస్తున్నామని తెలిపారుప. శాంత్రిభద్రతలకు నిఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**డిజెలకు నిషేధం :** ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతల దృష్ట్యా డీజేలకు నిషేధం అమల్లో ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. తక్కువ శబ్దంతో సౌండ్ బాక్సులు, సంప్రదాయ పద్ధతులోనే ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు బెల్ట్‌షాపులపై దాడులు కొనసాగించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.

**సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు వద్దు :** సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేలా అనుచిత పోస్టులు చేయవద్దని ఎస్పీ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దేవరకొండ ఖిల్లాకు మహర్దశ...

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ఖిల్లా, ఖిల్లా గుట్టను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ అన్నారు. గురువారం ఖిల్లా అభివృద్ధికి ఇప్పటికే రూ. 75లక్షలు మంజూరు అయ్యాయని, ఖిల్లా గుట్ట సమగ్ర అభివృద్ధి కోసం సుమారు రూ. 5కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును దేవరకొండకు తీసుకువచ్చి రూ. 5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించనున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్గొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ మున్సిపల్(ఖిల్లా)పార్క్‌లో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంఎల్‌ఏ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడారు. దేవరకొండ ప్రాంతానికి చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పరంగా ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసి బస్సులపై దేవరకొండ ఖిల్లా, పూర్ణకుంభం గుర్తులు కనిపించేవని, దేవరకొండ ఖిల్లా ఈ ప్రాంతానికి చారిత్రక ప్రతీకగా నిలించిందని, దాని వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులతో పాటు మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, నర్సింహా, వెంకటేష్‌గౌడ్, రైస్, సురేష్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, హరికృష్ణ, సాయిచంద్రగౌడ్, విద్యాశాఖ అధికారులు, యువ టూరిజం క్లబ్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక బ్రిడ్జి

### తాళ్లమల్కాపురం - కీతవారిగూడెం మధ్య స్తంభించిన రాకపోకలు

### కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తుల ఆగ్రహం



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండలంలోని తాళ్ల మల్కాపురం గ్రామ శివారులో నూతన వంతెన నిర్మాణ ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి వంతెన (డైవర్షన్ రోడ్డు) వర్షపు వరద దాటికి కొట్టుకుపోయింది. దీంతో తాళ్లమల్కాపురం కీతవారిగూడెం గ్రామాల మధ్య ప్రధాన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ప్రవాహ ఉధృతిని తట్టుకోలేక తాత్కాలికంగా వేసిన పైపులు, మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో రహదారి తెగిపోయింది. దీంతో ఉదయం నుంచే రెండు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మండల కేంద్రానికి వెళ్లే ఉద్యోగులు, నిత్య ప్రయాణికులు అవతలి వైపు వెళ్లలేక తీవ్ర అవస్థలు పడ్డారు. అత్యవసర వైద్య సేవల కోసం రోగులను తరలించాలన్నా వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడంతో సమీప గ్రామాల మీదుగా కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు.
**కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం...** వంతెన పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, నాసిరకం పనుల వల్లే ఈ దుస్థితి తలెత్తిందని గ్రామస్తులు మండిపడ్డారు. వర్షాకాలం సమీపించినా శాశ్వత వంతెన పనులను వేగవంతం చేయలేదని, తాత్కాలిక రహదారిని కూడా తూతూ మంత్రంగా వేసి వదిలేయడం వల్లే స్వల్ప వరదకే కొట్టుకు పోయిందని ఆరోపించారు. సంబంధిత ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, యుద్ధప్రాతిపదికన తాత్కాలిక రాకపోకలను పునరుద్ధరించాలని, అలాగే నత్తనడకన సాగుతున్న నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


## సూర్యాపేట జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు


**ప్రజాపక్షం/సూర్యాపేట :** అల్పపీడన ప్రభావంతో సూర్యాపేట జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుండి గురువారం వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. ఉదయం నుండి ఆకాశం అంతా మేఘావృతమై వర్షం కురిసింది. జిల్లాలోని కోదాడ, తుంగతుర్తి నియోజక వర్గాలు ఓ మోస్తారు భారీ వర్షాలు పడ్డాయి. ఎల్‌నినోతో గత నెల రోజుల నుండి ముఖం చాటేసిన వరుణుడు కాస్త కరుణించడంతో ఎండిపోయే దశకు వచ్చిన మెట్ట పంటలకు ఊపిరిపోసినట్లు అయింది. వేసవిని తలపించేలా ఎండ వేడిమితోపాటు తీవ్ర ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయిన జిల్లావాసులు గత రెండు రోజులుగా వాతావరణం చల్లబడి వర్షాలు పడుతుండడంతో ఉపశమనం కలిగింది. వాతావరణ శాస్త్రవేత్తలు అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిస్తాయని ముందుస్తు హెచ్చరికలు జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

### నీట మునిగిన స్నేహనగర్

### భారీ వరదతో ఎదురెక్కి వచ్చిన చేపలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో సూర్యాపేట మున్సిపాలిటిలోని 14వ వార్డు స్నేహనగర్ కాలనీ నీట మునిగింది. ఎగువ ప్రాంతం నుండి వరద నీరు భారీగా కాలనీలోకి చేరడంతో సమీప చెరువులో ఉన్న చేపలు ఎదురెక్కి వచ్చాయి. దీంతో కాలనీవాసులు చేపలు పట్టుకునేందుకు ఎగబడ్డారు. ఇదిలాఉంటే రోడ్లపై భారీగా నీరు చేరడంతో కాలనీవాసులు ఇంట్లో నుండి బయటకు వెళ్లేందుకు తీవ్ర అవస్తలు పడ్డారు. స్థానిక కౌన్సిలర్ గాలి సాయి కుమార్ కాలనీవాసులు సమాచారం అందించడంతో అక్కడ పర్యటించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీవాసులు కోరడంతో మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. వార్డు ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# నిండుకుండలా మూసీ

### వరద ఉధృతి పెరిగితే గేట్లు ఎత్తే ఛాన్స్

### ఆరు మండలాలు.. 41 గ్రామాలకు హెచ్చరికలు జారీ

### ప్రాజెక్టు దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో రెండో అతిపెద్దదైన మూసీ రిజర్వాయర్ కు ఎగువ నుంచి వస్తున్న వరదతో నిండు కుండలా మారుతోంది. గత రెండు రోజులుగా ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన సమయంలో గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూసీ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) 645 అడుగులు కాగా.. ప్రస్తుతం 640.58 అడుగులకు చేరింది. 4.46 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి గాను 3.35 టీఎంసీల నీరు ఉంది. గత 24 గంటల్లో 1,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ఆరు మండలాలు.. 41 గ్రామాలు**
మూసీ గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి ఏర్పడితే దిగువ ప్రాంతాలపై ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.
**సూర్యాపేట జిల్లా:** సూర్యాపేట,పెన్‌పహాడ్, పాలకీడు మండలాల్లోని రత్నాపురం,రామవరం, హనుమాన్ తండా,వెంకట్రాంపూర్, నంద్యాలగూడెం, కొంకతిమ్మని అన్నారం,సర్కిల్‌పేట,కాసరాబాద్,అనాజిపురం, అనంతారం, దోసపహాడ్, సజ్జాపురం, గంటవారిగూడెం, ఎల్లారం,సోమవరం, చింతకుంట్ల, పులగం బండ తండా,మూసీ ఒడ్డు సింగారం,ఎల్లాపురం,శూన్యపహాడ్ గ్రామాలు.
**నల్లగొండ జిల్లా:** కేతేపల్లి,మాడుగులపల్లి,మిర్యాలగూడ మండలాల్లోని బొప్పారం,కాసనగోడు, చికటిగూడెం,కొత్తపేట,ఉప్పలపహాడ్,కొప్పోలు, భీమారం,ఆమనగల్,లక్ష్మీదేవిగూడెం,రావులపెంట,రాజాపేట,నర్సింహులగూడెం,తక్కెళ్లపాడు,కాల్వపల్లి,ఆళ్లగడప,రాయనిపాలెం, ములకల కాల్వ,కేశవాపురం,తుంటుకుంటవిల్ల,వాడపల్లి,వజీరాబాద్ గ్రామాలు.
**నదిలోకి వెళ్లొద్దు :** మూసీ పరివాహక,దిగువ ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లరాదని అధికారులు స్పష్టం చేశారు.నది పరిసరాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గేట్లు ఎత్తే సమయంలో అధికారులు చేసే సూచనలు, భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## ఎంజియులో మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపిన అంబులెన్స్ డ్రైవర్

### విద్యార్థి కాలు విరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



**ప్రజాపక్షం/నల్లగొండ:** మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థి భద్రతపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.యూనివర్సిటీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి మద్యం మత్తులో ట్రాక్టర్ నడుపుతూ విద్యార్థిని ఢీకొట్టిన ఘటన కలకలం రేపింది.ఈ ప్రమాదంలో ఐఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి నితిన్ కుడి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే అధికారులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గతంలో కూడా ఇదే ఉద్యోగి మద్యం మత్తులో యూనివర్సిటీకి వచ్చినందుకు యాజమాన్యం సస్పెండ్ చేసినట్లు విద్యార్థులు చెబుతున్నారు.తాజా ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు.విద్యార్థులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించే భద్రతా సిబ్బంది, వాహనాలు నడిపే ఉద్యోగులకు కూడా ఇదే తరహా పరీక్షలు నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.మద్యం సేవించి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని,ఈ ఘటనలో సెక్యూరిటీ ఆఫీసర్ నిర్లక్ష్యం ఉందని, ఆయనను కూడా విధుల నుంచి తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పలువురు విద్యార్థి సంఘాల నాయకులు,రాజకీయ నాయకులు ఆసుపత్రికి వెళ్లి నితిన్‌ను పరామర్శించి, ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఉద్యోగులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలి**
విద్యార్థుల భద్రత విషయంలో యూనివర్సిటీ యాజమాన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్,బిఆర్‌ఎస్ నల్లగొండ టౌన్ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.యూనివర్సిటీలో విద్యార్థులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్న విధంగానే యూనివర్సిటీ ఉద్యోగులు, ముఖ్యంగా వాహనాలు నడిపే డ్రైవర్లకు కూడా అవసరమైన సమయంలో బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

**గాయపడిన విద్యార్థి వైద్య ఖర్చులను యూనివర్సిటీ భరించాలి**
ఎంజియూలో విద్యార్థుల భద్రతపై యూనివర్సిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.యూనివర్సిటీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి మద్యం మత్తులో ట్రాక్టర్ నడుపుతూ విద్యార్థిని ఢీకొట్టిన ఘటనపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఘటనపై యూనివర్సిటీ అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని,బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నితిన్‌ను పరామర్శించిన వారిలోఎంజీయూ బిఆర్‌ఎస్‌వి అధ్యక్షుడు వాడపల్లి నవీన్,జిల్లా నాయకులు పల్లి శివశంకర్ యాదవ్,పల్లె రంజిత్ కుమార్, అంబటి ప్రణీత్ తదితరులు ఉన్నారు.




## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

### మహిళా సంఘాలకు రూ.8.29లక్షల వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/గుండాల :** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక హైమావతి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య మండలంలోని 92 మహిళా సంఘాలకు రూ. 8.29 కోట్ల వడ్డీలేని రుణాలను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ముందుగా గుండాల మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ షాపును ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి, మహిళా సంఘాల సభ్యులు క్రమశిక్షణతో పొదుపు చేయడం, తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం వల్లే బ్యాంకులు పెద్ద మొత్తంలో రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరిగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దశరథగుప్త, సర్పంచ్ ఐలయ్య, మహేష్, ఉప సర్పంచ్ రమేష్, మండ సమైఖ్య అధ్యక్షురాలు వాణి, రివిజినల్ మేనేజర్ అనిల్‌కుమార్, ఎస్బిఐ మండల మేనేజర్ శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులను గౌరవించి కంటికి రెప్పలా కాపాడుకుందాం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాజానికి, కుటుంబానికి మార్గదర్శకులైన వయోవృద్ధులను గౌరవించి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారం రోజులపాటు నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాల గోడపత్రికను గురువారం కలెక్టరేట్‌లోని విసి ఛాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా, ఇంట్లోనే ఉంచుకొని ప్రేమగా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు హితవు పలికారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకుండా నిర్లక్ష్యం చేసే పిల్లల స్థూల వేతనం నుంచి నేరుగా 15 శాతం లేదా గరిష్టంగా రూ.10వేల వరకు కట్ చేసి, తల్లిదండ్రుల ఖాతాకు జమ చేసేలా కఠిన నిబంధనలు ఉన్నాయని స్పష్టం చేశారు. వృద్ధుల హక్కులు, చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సీనియర్ సిటిజన్లకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కేటాయించిన ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 14567 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా కమిటి సభ్యులు సీతారామయ్య, జి. విద్యాసాగర్, ఎస్‌డి హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.

### రైతులకు సాగునీరు, విద్యుత్ అందివ్వడంలో

## కాంగ్రెస్ సర్కార్ విఫలం

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో, రెండు పంటలకు అవసరమైన సాగునీటిని విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. గురువారం దామరచర్ల మండల పరిధిలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల నుంచి రైతులు, బిఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ధర్నా అనంతరం ప్లాంట్ లోపలికి వెళ్లేందుకు నిరసనకారులు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. భారీగా మోహరించిన పోలీసు బలగాలు బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను నిలువరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అనంతరం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్లాంట్ లోపలికి వెళ్ళి సీఈతో మాట్లాడి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పంటలు ఎండిపోకుండా రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా చేయడంతో పాటు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ రైతులకు సరిపడా కరెంట్ అందించడం లేదని విమర్శించారు. గత కేసీఆర్ హయాంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగాలను ఆంధ్ర ప్రాంత వ్యక్తులకు అమ్ముకుంటోందని ఆరోపించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే, ఈ ప్రభుత్వం బొగ్గు సరఫరా చేయకుండా అమ్ముకుంటూ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తోందని విమర్శించారు. సాగు సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు రెండు పంటలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిషోర్, ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, తిప్పన విజయసింహా రెడ్డి, రాష్ట్ర నాయకులు రఘు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ నాయకులకు ఏటిఎంగా మారిన యాదాద్రి పవర్ ప్లాంట్


### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ధ్వజం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో బినామీ కాంట్రాక్టులు, కమిషన్ల పేరుతో కోట్ల రూపాయల భారీ అవినీతి చోటుచేసుకుందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణం వద్ద కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలసి ఏర్పాటు చేసిన అత్యంత భారీ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్‌ఎస్ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశానికి ఆయన ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేటీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారితే, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావులకు ఏటీఎంగా మారిందని మండిపడ్డారు.బొగ్గు నిల్వలు ఏమాత్రం అందుబాటులో లేని ప్రాంతంలో కేవలం కమిషన్ల కోసమే పవర్ ప్లాంట్‌ను నిలబెట్టారని, దూర ప్రాంతాల నుంచి బొగ్గును రవాణా చేయడం వల్ల ప్లాంట్‌పై తీవ్రమైన అదనపు ఆర్థిక భారం పడుతోందని వివరంగా వెల్లడించారు. అభివృద్ధి పేరు చెప్పి పార్టీ ఫిరాయింపులకు పాల్పడి, ప్రాజెక్టుల నిర్మాణంలో వందల కోట్ల రూపాయల కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. ప్లాంట్ కోసం భూములు ఇచ్చి సర్వస్వం త్యాగం చేసిన స్థానిక భూనిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశారని, అర్హులైన పేదలను పక్కనపెట్టి బిఆర్‌ఎస్ నాయకుల కుటుంబ సభ్యులకు, అనుచరులకు ఉద్యోగాలు ఇప్పించుకున్నారని ఆరోపించారు. గతంలో ఇంతటి భారీ అవినీతికి పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పవర్ ప్లాంట్ సందర్శనకు వచ్చారో ప్రజలకు జవాబు చెప్పాలని నిలదీశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నాలుగు యూనిట్లను త్వరగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఐదో యూనిట్‌ను కూడా ప్రారంభించే దిశగా పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, భూనిర్వాసితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలి

### జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని వేగవంతం చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం ఇంచార్జి కలెక్టర్ ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూమ్ (2BHK) ఇండ్ల నిర్మాణ ప్రగతిపై జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు, సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి, లబ్ధిదారుల ఎంపిక, మంజూరులు, నిధుల విడుదల తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అర్హులైన గుడిసెదారులందరినీ గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. ఇండ్ల మంజూరు, నిధుల విడుదలలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు L3 స్థాయి నుంచి L1 స్థాయికి సడలింపు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనివల్ల అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రయోజనాలు వేగంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ అలివేలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక కట్టడాల పరిశీలన




**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రాచీన సామ్రాజ్య రాజధానియైన ఇంద్రపాల నగరాన్ని సందర్శించారు.క్రీస్తు శకం నాలుగవ శతాబ్ది కాలంలో ఎంతో వైభవంగా వెలుగొందిన ఇంద్రపాలనగర ప్రాంతం గత వైభవాన్ని ఒకసారి నెమరు వేసుకొని అప్పటి చారిత్రక కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త,తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలోనే కాక భారతదేశ వ్యాప్తంగా ఉన్న అనేక చారిత్రక కట్టడాలను, సుప్రసిద్ధ ప్రదేశాలను విద్యార్థులు సందర్శించడమే కాకుండా వాటి పట్ల అవగాహన పెంపొందించుకొని,గత పాలకుల వైభవాన్ని,పరిపాలనా విధానాన్ని,ప్రజల సంస్కృతిని, భౌగోళిక స్థితిగతులను అధ్యయనం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు.యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.కిషన్ మాట్లాడుతూ చారిత్రక కట్టడాలను,సుప్రసిద్ధ ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి పాలకులపై ఉందన్నారు.

## ప్రజలకు అండగా ఉంటూ.. బాధ్యతాయుతంగా ఉండాలి

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సమాజంలో దాడులు, వేధింపులకు గురై వచ్చే మహిళల పట్ల న్యాయంగా వ్యవహరిస్తూ, వారి న్యాయం జరిగే విధంగా బాధ్యతయుతంగా ఉండాలని, ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా పనిచేయాలని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ అన్నారు. తెలంగాణ ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ గా బుద్ధ భవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ళ శారదను గురువారం మధుయాష్కీ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

### పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలి

రంగారెడ్డి జిల్లా స్థాయిలో పార్టీని క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో జిల్లా అధ్యక్షులది కీలక పాత్ర అని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. గురువారం బంజారా హిల్స్‌లోని వారి నివాసంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా నియమితులైన చిగురింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి తన నియామకానికి సహకరించినందుకు మధుయాష్కీ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రాధ రాణి అన్నారు. గురువారం యాచారం మండల పరిధి లోని మేడిపల్లి, మల్కిజ్‌గూడ గ్రామాల్లో ఆమే పర్యటించారు. గ్రామాల్లో అమలౌతున్న ప్రభుత్వ పథకాలను ఆమే పరిశీలించారు. వాటర్ రిచార్జ్, కౌంపోడ్స్, ఇంకుడు గంతలను ఆమే పరిశీలించారు. మేడిపల్లి మల్కిజ్‌గూడ గ్రామాల్లో విండో పెన్షన్ల లబ్ధిదారులను నేరుగా వారి ఇంటికి వెళ్ళి పరిశీలించారు. కార్యక్రమంలో అయాగ్రామాల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణం ఆపడం తగదు



**ప్రజాపక్షం/యాచారం :** యాచా రం గ్రామ పంచాయతీ పరిధిలోని గాండ్ల గూడ గ్రామంలో రాజకీయ కక్ష్యతో అందరికి ఉపయోగ పడే సిసి రోడ్డు వేయకుండా నిలపి వేశారని గ్రామానికి చెందిన వంగూరి నర్సింహ్మా, మహెంధర్, మల్లేశ్ తెలిపారు. సిసి రోడ్డు వేయాల్సి ఉండగా గ్రామ 9వ వార్డు మెంబర్ బెల్లి వైష్ణవి పట్టించుకోవడం లేదన్నారు. కొంతమంది గ్రామ నాయకుల అరాచకాలతో సిసి రోడ్డును అపారన్నారు. సర్పంచ్ అనిత శరణం, పంచాయతీ కార్యదర్శి, పైఅధికారులు తెలిపిన పట్టనట్లుగా వ్యహరిస్తున్నారని తెలిపారు. దీనిపై అధికారులు విచారణ చేసి సిసి రోడ్డు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## పంచాయతీ అనుమతి లేని ఫంక్షన్‌హాల్ కూల్చివేత




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న రివేరా ఫంక్షన్ హాల్‌ను జిల్లా పంచాయతీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ సమక్షంలో గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు గురువారం జెసిబి సహాయంతో ఫంక్షన్ హాల్ ప్రహరి గోడ, రోడ్డును కూల్చి వేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరి గూడ గ్రామ రెవిన్యూ పరిధిలో సివిఆర్ కాలేజీ సమీపంలో గ్రామ పంచాయతీ అనుమతీ లేకుండా రివేరా ఫంక్షన్ హాల్‌ను అక్రమంగా నిర్మించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పంచాయతీ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు చేపట్టడంలో విఫలం చెందారని విమర్శించారు. గ్రామ పంచాయతీ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బి.శ్రీవేణినందకుమార్, ఉప సర్పంచ్ ఎన్నుకావ్య వెంకట్ రెడ్డి, గ్రామ కార్యదర్శి శాంతిషా, వార్డు సభ్యులు ఎన్.మహేందర్, కె.రవితేజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/కొత్తూరు:** ఎమ్మెల్యే ఫోటోగ్రాఫర్ రాణా రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెళ్ళి పరామర్శించారు. గురువారం కొత్తూరు మండల కేంద్రానికి చెందిన చిల్కమర్రి రాణా వారి ఇంటికి వెళ్ళి పరామర్శించి రోడ్డు ప్రమాదానికి గల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాణాకు దైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంట మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు కుమార్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహులు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, చిల్కమర్రి నర్సింహులు పాల్గొన్నారు.

# సకాలంలో సంక్షేమ పథకాల ప్రయోజనాలు

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి, కె.చంద్రారెడ్డి, మహేశ్వరం డిసిపి కె.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టిలపై నమోదైన అట్రాసిటీ కేసుల పురోగతిని కమిషన్ చైర్మన్ సమీక్షించారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం చెల్లింపు తదితర అంశాల్లో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం జరగకుండా పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన భూ సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య,ఉ పాధి, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఆయా వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి కాలనీలు, ఆవాస ప్రాంతాల్లో



తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, విద్యా సంస్థలు తదితర మౌలిక వసతుల పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. అట్రాసిటీ నిరోధక చట్టం, ఇతర సంబంధిత చట్టాల అమలుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాధితులకు తక్షణ సహాయం, న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికి సంబంధించి అమలు చేస్తున్న కార్యక్రమాలు, అట్రాసిటీ కేసుల పురోగతి, పెండింగ్ సమస్యలు, పరిష్కరించిన అంశాల పై కమిషన్ చైర్మన్‌కు వివరాలు అందించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి మరియు హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని అధికారులు తెలిపారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, జిల్లా శంకర్, జిల్లా ఎంసి సభ్యులు విజయ్ కుమార్, బి.రాజు, లక్ష్పతి నాయక్, యాదగిరి, పి.నర్సిములు, ఎస్‌సి కార్పొరేషన్ అభివృద్ధి అధికారి జొన్నల పద్మావతి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రామారావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాలికను రక్షించిన శశికుమార్‌కు సిపి సన్మానం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మైనర్ బాలికను ప్రమాదం నుంచి రక్షించి, నిందితుడిని పోలీసులకు అప్పగించిన శశికుమార్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి) డాక్టర్ ఎం.రమేశ్ అభినందించి సన్మానించారు. ఆగస్టు 16న ఓ రెండేళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి నుంచి బాలికను శశికుమార్ ధైర్యంగా రక్షించారు. మార్గంలో వెళ్తుండగా బాలిక అరుపులు విని వెంటనే స్పందించిన శశికుమార్, అక్కడికి చేరుకుని బాలికను సురక్షితంగా రక్షించడంతో పాటు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా శశికుమార్‌ను గంగారం చెరువు వద్దకు పిలిపించి సిపి డాక్టర్ ఎం.రమేశ్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారిని రక్షించడం అభినందనీయమని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. శశికుమార్ చూపిన ధైర్యం, మానవత్వం ఇతరులకు స్ఫూర్తిదాయకమని సిపి తెలిపారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు

నిమజ్జనం ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండాలి

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిమజ్జనం ముగిసే వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ ఆదేశించారు. గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ గురువారం పరిశీలించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగి, నెక్నపూర్, కోకాపేట చెరువులు, అమీన్పూర్ పరిధిలోని రాయసముద్రం లేక్, సాకి చెరువు, పటాన్‌చెరు, చందానగర్‌లోని గంగారం చెరువుతో పాటు నార్సింగి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను సిపి తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. పోలీసులతో పాటు విద్యుత్, రెవెన్యూ, వైద్య, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. నిమజ్జనాలను ఆసరాగా చేసుకుని ఆకతాయితనానికి పాల్పడేవారు, దొంగతనాలకు పాల్పడే ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిపి స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిశితంగా గమనించి, నేరాలకు పాల్పడే వారిని గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నిమజ్జనం పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సిపి అధికారులకు స్పష్టం చేశారు.

# వృద్ధుల సంక్షేమానికి సమష్టి కృషి




అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వృద్ధుల సంక్షేమానికి సమష్టి కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఒసి)లో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి పవన్ కుమార్, డిఆర్ ఒ శారదాదేవి, జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు, హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. వృద్ధుల పట్ల గౌరవం, సంరక్షణ, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి పవన్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం, వారి హక్కుల పరిరక్షణ, చట్టపరమైన సహాయంపై అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన న్యాయ సహకారం అందిస్తామన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో "సీనియర్ సిటిజన్స్ కేర్ అండ్ రెస్పెక్ట్ " ప్రతిజ్ఞతో పాటు వృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు వారంపాటు వివిధ అవగాహన, సంక్షేమ, సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వృద్ధుల సంఘాల ప్రతినిధులు, జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** నియోజకవర్గం కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం ఇబ్రహీంపట్నం నియోజక వర్గం కేంద్రంలో గురునానక్ కాలేజీ సమీపంలో సర్వే నెంబర్ 320లో ఆరున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని క్రీడా మైదనానికి ప్రభుత్వం కేటాయించటంతో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రెవిన్యూ అధికారుల సమక్షంలో క్రీడా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అధిక నిధులు మంజూరి చేయించి త్వరలో పెండింగ్‌లో ఉన్న క్రీడా మైదనాం పూర్తి చేస్తామని తెలిపారు. క్రీడా మైదాన కేటాయింపుకు తక్షణమే ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపాలని ఆర్డిఒ, రెవీన్యూ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో క్రీడా మైదానం ఏర్పాటుకు తమ వంతు భాధ్యతని హామీ ఇచ్చారు. ముందుగా గురుకుల విద్యాఫీఠ్ పాఠశాల్లో జరుగుతున్న విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడోత్సావాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి,ఆర్‌డిఒ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంఇఒ హిర్యానాయక్, మున్సిపల్ కమీషనర్ సుదర్శన్, డి?శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా వినాయక ఉత్సవాలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బడంగ్‌పేట్‌లోని సాయి కృష్ణ ఎన్‌క్లేవ్లో శ్రీ ధృజ యువ భక్తి మండలి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. 11 రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ వినాయకుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు మరియు భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో కాలనీ వాసులు, మహిళలు, చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. యువజన సభ్యులు ఐకమత్యంతో ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం ట్యాంక్‌బండ్‌లో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో హరీష్ కుమార్, రవి తేజ, సాయి కుమార్, శివ కుమార్ గౌడ్, అఖిల్, అరవింద్, రోహిత్, నితిన్, మాధవన్, నిఖిల్, రతన్, కిట్టు, సాయి విశాల్, విశాల్, వెంకట్, సాయి రామ్ రెడ్డి, రేవంత్ రెడ్డి, శశాంక్, భారద్వాజ్ తదితర యువజన సభ్యులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** అన్ని దానాలకంటే అన్నదానం మహా గొప్పదని, ఇంతకుమించి పుణ్యకార్యం మరోకటి లేదని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప అన్నారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో కౌన్సిలర్ బచ్చలి నరేష్, తిరుపతి గౌడ్‌ల ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందు ఉండాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖదీర్, కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కౌన్సిలర్ బచ్చలి నరేష్, నేతలు బచ్చలి రమేష్, బోడంపాటి రాము గౌడ్, అశోక్, జట్టు అనిల్, పేపర్ లక్ష్మీమన్, రిపోర్టర్ కృష్ణ, రాజు, జుట్టు నరసింహా, వారహియూత్ సభ్యులు, పాల్గొన్నారు.

**షాబాద్:** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కల్గుతుందని ముద్దెంగూడ మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య అన్నారు. గురువారం ముద్దెంగూడ గ్రామంలోని వినాయకుని లడ్డూ వేలం పాటలో రూ. 2 లక్షలకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సంకెపల్లిగూడ సర్పంచ్ లావణ్య, ముద్దెంగూడ సర్పంచ్ నర్సింలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# 27న పనిచేయనున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు




**న్యూఢిల్లీ:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, వినియోగదారులకు బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం కలగకుండా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం, ఈనెల 27వ తేదీ, ఆదివారం ప్రభుత్వ రంగ బ్యాంకులు (పిఎస్‌బిలు), ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్‌ఆర్‌బిలు) సాధారణంగా పనిచేస్తాయి. ఈనెల 26వ తేదీ నాలుగో శనివారం కావడంతో సాధారణ సెలవు, 27 ఆదివారం మరో సెలవు. ఆ వెంటనే 28 నుంచి 30 వరకు ప్రతిపాదిత సమ్మె జరగనుంది. దీంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఈనెల 27న అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఎటిఎంలింక్డ్ శాఖలు, కరెన్సీ చెస్టులు పని చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతి ఇచ్చింది. అయితే ఈ నిర్ణయం ప్రధానంగా ప్రభుత్వ రంగ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు వర్తిస్తుంది. ప్రతిపాదిత సమ్మె జరిగితే శాఖల్లో ప్రత్యక్ష సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. కాబట్టి సమ్మెను వాయిదా వేయాలని అటు ప్రభుత్వం, ఇటు బ్యాంకు యాజమాన్యాలు యూనియన్లను కోరాయి.

# ఓటు హక్కును హరించే విధానాన్ని అమలు చేస్తున్న సిఇసి

'సర్' వివాదంపై కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా నుంచి యువతను, ముఖ్యంగా 'జన్ జెడ్'ను తొలగించే ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంపై ఎన్నికల కమిషన్‌లో విభేదాలు నెలకొన్నాయన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ గురువారం ఈ ఆరోపణలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ దురుద్దేశపూరిత చర్యలకు జవాబుదారీ వహించాల్సి ఉంటుందని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. బుధవారం ప్రముఖ జాతీయ దినపత్రిక 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఒక వచ్చిన సంచలన కథనం ద్వారా సిఇసి ఎన్నికల కమిషన్ సమగ్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పూర్తిగా నాశనం చేసిన తీరు వెలుగులోకి వచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. దీనికి తోడు గురువారం మరో కీలక కథనం వెలువడిందని కూడా ఆయన పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యే ఓటర్లను 'ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్ తొలగించడంతో వారిని ఓటర్ల జాబితాలో తిరిగి చేర్చాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) ఏడు రోజుల్లో ఎనిమిదిసార్లు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారని, గోవాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్ఒలు) కూడా ఆ ఓటర్లు చెల్లుబాటు అయ్యే ఓటర్లేనని నిర్ధారించారని రమేశ్ అన్నారు. అయినప్పటికీ ఆ ఇ–మెయిల్స్‌ను పట్టించుకోకుండా ఓటర్లను తొలగించారని రమేశ్ 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనాన్ని ఉటంకిస్తూ, ఎస్ఐఆర్ మొత్తం ప్రక్రియను ఈ ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్‌కు అప్పగించారని ఆయన ఆరోపించారు. దీని ఫలితంగా 'సర్' మూడో దశలో విపత్కర పరిస్థితి ఏర్పడిందని, ఢిల్లీలో 54 శాతం మంది ఓటర్లను, దేశవ్యాప్తంగా దాదాపు 12 కోట్ల మంది ఓటర్లను తొలగించడం లేదా అనుమానాస్పద ఓటర్లుగా గుర్తించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. 'చట్టవిరుద్ధమైన, కేంద్రీకృత చర్యలో భాగంగా ఇఆర్ఒలకు ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించే అవకాశాన్ని పరిమితం చేశారు. 1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఓటర్ల జాబితాపై చట్టబద్ధమైన అధికారం ఇఆర్ఒకు ఉంటుంది. ఈ నిబంధన ఉల్లంఘనపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కేబినెట్ కార్యదర్శికి లేఖ రాశారు' అని రమేశ్ వివరించారు. కొత్త ఓటర్లను చేర్చేందుకు ఉపయోగించే 'ఫామ్ 6' ద్వారా దరఖాస్తు చేసుకునే ప్రక్రియను కూడా మరింత కష్టతరం చేశారని ఆయన ఆరోపించారు. జెన్‌జిలను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే లక్ష్యంగా చేసుకున్నారని రమేశ్ విమర్శించారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి దాదాపు రెండేళ్లుగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకు తాజాగా వెలువడుతున్న ప్రతి ఆధారం మరింత బలాన్ని ఇస్తున్నదని ఆయన అన్నారు. సిఇసి వైఖరిని ఆయన 'మెథడ్ ఆఫ్ డిస్‌ఎన్‌ఫ్రాన్ఫైజింగ్ ఇండియన్స్' (ఎంఒడిఐ/ మోదీ)గా రమేశ్ అభివర్ణించారు. ఈ విధానాన్ని సిఇసి జ్ఞానేశ్ కుమార్ అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా రాజీపడిపోయిందని, ఫలితంగా దాని విశ్వసనీయత దెబ్బతిన్నదని రమేశ్ పేర్కొన్నారు.

# సిఇసిపై మొయిత్రా ఫిర్యాదు



**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరుతూ ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు సమర్పించారు. కాగా, పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఓటర్ల చేర్పు, తొలగింపు, పునరుద్ధరణ, ఓటరు నమోదు ప్రక్రియలో మార్పులు సహా ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చిన కథనాన్ని మొయిత్రా తన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇద్దరు సహచర కమిషనర్ల అభిప్రాయాలకు విరుద్ధంగా సిఇసి స్వయంగా ఎన్నికల కమిషన్ తరఫున నిర్ణయాలు తీసుకునే అధికారం లేదని ఆమె పేర్కొన్నారు. అలాగే 'సర్' ప్రక్రియ కోసం ప్రజాధనం గణనీయంగా ఖర్చు చేసినందున, దాని దుర్వినియోగంపై కూడా దర్యాప్తు చేయాలని కోరారు. 2023 సిఇసి, ఇసి చట్టంలోని సెక్షన్ 16 అధికారిక విధుల్లో తీసుకున్న చర్యలకు వారికి కొన్ని రకాల న్యాయ రక్షణ లభిస్తుందని మొయిత్రా అంగీకరించారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు, పోలీసు దర్యాప్తు న్యాయస్థానంలో జరిగే విచారణ కాదని, అందువల్ల ఆ నిబంధన వాటికి వర్తించదని ఆమె వాదించారు.

# అక్రమ కాల్‌సెంటర్ గుర్తింపు

## అమెరికాలో రూ. 100 కోట్లు మోసం

**న్యూఢిల్లీ,** : అమెరికాలోని బాధితుల నుంచి 'టెక్‌సపోర్ట్' పేరుతో సుమారు రూ.100 కోట్ల మేర మోసం చేసిన ఓ అంతర్జాతీయ కాల్ సెంటర్‌ను ఢిల్లీ పోలీసులు గుర్తించారు. ఈ కేసులో 11 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. పితంపుర గ్రామంలోని అద్దె భవనంలో మూడు, నాలుగు అంతస్తుల్లో ఈ కాల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈనెల 21న ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ (ఐఎఫ్ఎస్ఒ) విభాగం అక్కడ దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకుంది. రూ.41 లక్షల నగదు, 29 ల్యాప్‌ట్యాప్‌లు, 25 మొబైల్ ఫోన్లు, ఎనిమిది రౌటర్లు, ఒక ఎస్‌యువిని స్వాధీనం చేసుకున్నారు. భారతీయ న్యాయ సంహిత, సమాచార సాంకేతిక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద ఈనెల 22న కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముఠా అమెరికాలో ఉంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని, ఒక వ్యూహం ప్రకారం 'టెక్‌సపోర్ట్' మోసానికి పాల్పడేది. బాధితుల కంప్యూటర్లలోకి రిమోట్‌గా మాల్‌వేర్‌ను ప్రవేశపెట్టి, సాంకేతిక సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించే పాప్‌అప్‌లను చూపించేవారు. బాధితులు ఆ నంబర్‌కు కాల్ చేస్తే, సాఫ్ట్‌ఫోన్ అప్లికేషన్ ద్వారా ఆ కాల్స్‌ను పితంపుర కాల్ సెంటర్‌కు మళ్లించేవారు. కాల్ సెంటర్ సిబ్బంది ముందుగా సిద్ధం చేసిన స్క్రిప్టుల ఆధారంగా తమనుతాము టెక్నికల్ సపోర్ట్ సిబ్బందిగా పరిచయం చేసుకుని, బాధితుల కంప్యూటర్లకు వైరస్ లేదా ఇతర సమస్యలు వచ్చాయని చెప్పేవారు. అనంతరం రిమోట్ యాక్సెస్ కల్పించే ఇన్‌స్టాల్ చేయించేవారు. బాధితుల బ్యాంకు ఖాతాలు కూడా ప్రమాదంలో ఉన్నాయని చెప్పి, వారిని మరో నిందితుడి వద్దకు బదిలీ చేసేవారు. అతను బ్యాంకు అధికారిగా నటించి గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేయాలని లేదా క్రిప్టోకరెన్సీ బదిలీ చేయాలని ఒత్తిడి చేసేవాడని పోలీసులు తెలిపారు. కొన్ని సందర్భాల్లో ఎఫ్‌బిఐ, ఇతర అమెరికా ఫెడరల్ సంస్థల పేరుతో నకిలీ పత్రాలు పంపి బాధితులను భయపెట్టేవారని పోలీసులు తెలిపారు. నిందితులు విలియమ్స్, రయాన్, సోఫీ, జెన్నీ, అలెక్స్ వంటి నకిలీ పేర్లతో బాధితులతో మాట్లాడేవారని చెప్పారు.



కొత్వాల్ గూడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కుమార్తె అంజలి-రఘు నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు. కాబోయే వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

# 26న ఎపిలో సిపిఐ అఖిలపక్ష సమావేశం

## వైఎస్ జగన్‌కు ఆహ్వానం



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఈ నెల 26న విజయవాడ దాసరి భవన్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించ తలపెట్టింది. రాజకీయాలకు అతీతంగా ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా పార్టీలు,రైతు, ప్రజా సంఘాల నేతలను సిపిఐ ప్రతినిధుల బృందం ఆహ్వానించింది. పార్టీ నాయకుల బృందం వివిధ పార్టీల కార్యాలయాలకు వెళ్ళి అగ్రనాయకులను కలిసి అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వానించింది. సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య,కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి,అక్కినేని వనజతో కూడిన ప్రతినిధి బృందం గురువారం తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి ఆహ్వానం అందజేసింది.

# 'సర్' సాఫ్ట్‌వేర్ వివరాలను ఇసిఐ దాచిపెడుతోంది

టిఎంసి నేత గోఖలే ఆరోపణ

**న్యూఢిలీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' కోసం ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్, అల్గారిథమ్‌కు సంబంధించిన వివరాలను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) వెల్లడించడం లేదని టిఎంసి నేత సాకేత్ గోఖలే ఆరోపించారు. ఆర్‌టిఐ దరఖాస్తుకు ఇసి ఇచ్చిన సమాధానాన్ని ఆయన ఇందుకు ఆధారంగా చూపారు. తాను కోరిన సమాచారం 'వాణిజ్య రహస్యాలు, ట్రేడ్ సీక్రెట్స్, మేధో సంపత్తి' వంటి అంశాలకు సంబంధించినదని, ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(డి) కింద వెల్లడించలేమని ఇసి పేర్కొన్న విషయాన్ని ఆయన వెల్లడించారు. ఏప్రిల్ 17న దాఖలు చేసిన ఆర్‌టిఐలో గోఖలే పశ్చిమ బెంగాల్‌లో 'సర్' కోసం 'ఎనోనెట్'లో ఉపయోగించిన 'లాజికల్ డిస్క్రెపెన్సీ' మాడ్యూల్ లేదా అల్గారిథమ్‌కు సంబంధించిన సాంకేతిక పత్రాలను కోరారు. సాఫ్ట్‌వేర్ రూపకల్పన, దాని పనితీరు, ఓటర్లలో అసమానతలను గుర్తించే ప్రమాణాలు, సాఫ్ట్‌వేర్ కొనుగోలు–అభివృద్ధి పత్రాలు, పరీక్షలు, ధ్రువీకరణ నివేదికలు, అధికారిక నోటింగ్లు, ఇఆర్ఒలకు ఇచ్చిన ఆదేశాల వివరాలను కూడా అడిగారు. కాగా, జులై 21న ఇచ్చిన సమాధానంలో మొదటి రెండు అంశాలకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించలేమని ఇసిఐ తెలిపింది. అయితే పశ్చిమ బెంగాల్‌లో 'సర్' కోసం ప్రత్యేకంగా ఎలాంటి సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను అభివృద్ధి చేయలేదని, ప్రత్యేకంగా ఎలాంటి కొనుగోలు లేదా అభివృద్ధి కూడా జరగలేదని స్పష్టం చేసింది. పలు 'లాజికల్ డిస్క్రెపెన్సీ' కేటగిరీల కింద గుర్తించిన ఓటర్ల సంఖ్య సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల వద్ద ఉండవచ్చని, వారి వద్ద ప్రత్యేకంగా ఆర్‌టిఐ దరఖాస్తులు దాఖలు చేయాలని గోఖలేకు సూచించింది. ఈ నేపథ్యంలో, 'సర్' కోసం ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌ను ఏ సంస్థ అభివృద్ధి చేసిందో ఇసి వెల్లడించాలని గోఖలే డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 'సర్'పై వ్యక్తం చేసిన అభ్యంతరాలపై ఇసిఐ బుధవారం స్పందిస్తూ, సంస్థల్లో నిర్ణయ ప్రక్రియ సందర్భంగా భిన్నాభిప్రాయాలు సహజమేనని వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

## రాజకీయాల్లో ఎంత అధికారాన్ని సాధించినా...

# సేవా మార్గం నుంచి ఎన్నటికీ వైదొలగం



ప్రధాని మోదీ స్పష్టీకరణ

**దేవాస్ (మధ్యప్రదేశ్) :** సేవ అనేది బిజెపి పాలనకు, విలువలకు మూల స్తంభమని, ఎంతటి రాజకీయ అధికారాన్ని సాధించినప్పటికీ తాము ఈ మార్గం నుంచి ఎప్పటికీ వైదొలగబోమని గురువారం ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. రాజకీయాలు, ఎన్నికల కన్నా దేశ నిర్మాణం, దేశ అభివృద్ధిపైనే తమ పార్టీ దృష్టి సారిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2047నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని సాకారం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. గుజరాత్‌లోని వడ్నగర్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి వరకు జరుగుతున్న 'సేవా సంకల్ప యాత్ర'లో పాల్గొన్న వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని సంభాషించారు.'రాజకీయాలు,ఎన్నికలు, పరిపాలనకు వాటి స్థానం ఉంది. కానీ దేశాన్ని నిర్మించి, భారతదేశాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మనం బయల్దేరాం' అని మోదీ అన్నారు. మోదీ 76వ పుట్టిన రోజు, ఎన్నికైన ప్రతినిధిగా ఆయన 25ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాలకు చెందిన యువత పాల్గొంటున్న ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో పాల్గొన్నవారు ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లాలో ఉన్నారు. వారణాసి, వడ్నగర్ ప్రాచీన నగరాలని, అవి ఇప్పటికీ చైతన్యవంతంగా ఉన్నాయని మోదీ తెలిపారు. వాటిలో ఒకటి తన 'జన్మస్థలం' అని, మరొకటి తన 'కర్మభూమి' అని మోదీ పేర్కొన్నారు. 'గుజరాత్ నుంచి ఢిల్లీ వరకు, సేవ అనేది మన పరిపాలనా వ్యవస్థకు, విలువలకు మూల స్తంభంగా ఉంది. పరిపాలనకు సేవ కేంద్రంగా ఉన్నప్పుడు, 'నాగరిక్ దేవోభవ' అనే సంకల్పం ప్రతీ విధానానికీ మూలంగా ఉంటుంది' అని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. రాజకీయాల్లో మనం ఎంత అధికారం సాధించినా, మన ప్రాథమిక మార్గం సేవగానే ఉంటుందనే విషయాన్ని మన ప్రవర్తన ప్రజలకు తెలియజేయాలి . మనం ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా, సేవా మార్గం నుంచి ఎన్నటికీ వైదొలగబోమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. సేవాభావంతో చేసిన పనులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ప్రజలు సేవ చేసేవారిని ఆశీర్వదిస్తారని అన్నారు. 'నా జీవితం అంతా ప్రజల ఆశీర్వాదాలతోనే నడిచింది. వారి ఆశీర్వాదాలే నాజీవితానికి గొప్ప శక్తిగా నిలిచాయి అని ప్రధాని చెప్పారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయడమే తన జీవితపు ప్రధాన మంత్రం అని ఆయన అన్నారు. 'పేదలు, మహిళలు, బాలికలు, రోగులు, గిరిజనులతో సహా సమాజంలోని వివిధ వర్గాల ప్రయోజనం కోసం తన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సేవా స్ఫూర్తియే పునాది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కి చెప్పారు. సేవా స్ఫూర్తిని దేశ విధానాలకు అన్వయించినప్పుడు దేశ ప్రగతికి సేవయే అతి పెద్ద చోదక శక్తిగా మారుతుందన్నారు.2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పాన్ని నెరవేర్చడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని, యువత ఈ లక్ష్యంతో బలంగా మమేకం కావాలని మోదీ ఆకాంక్షించారు. భారతదేశంలో ప్రయాణం, సేవ రెండూ సామాజిక విలువల్లో లోతుగా పాతుకుపోయాయని, తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో తాను స్వయంగా ఎన్నో యాత్రలకు నాయకత్వం వహించానని ప్రధానమంత్రి అన్నారు.'సేవా సంకల్ప యాత్ర'లో పాల్గొంటున్న యువతతో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడమే వారి ప్రాథమిక లక్ష్యం కావాలని మోదీ పిలుపునిచ్చారు.

# 'వాషిమ్'ను కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలి



మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటనలో రైతుల నినాదాలు

**వాషిమ్ :** మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటన రసాభాసగా మారింది. తమ ప్రాంతాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ అక్కడి రైతులు గురువారం నినాదాలు చేశారు. తక్కువ వర్షాపాతం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి గురువారం మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలోని వాషిమ్, అమరావతి జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఫడ్నవీస్ సోయాబీన్, కంది, పత్తి పంటలను తనిఖీచేసి, ప్రభావిత రైతులతో సమావేశం కానున్నారు. వాషిమ్ జిల్లా కరంజా తాలూకాలోని మస్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటన సందర్భంగా వాషిమ్ జిల్లాను కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని రైతుల బృందం నినాదాలను హోరెత్తించింది. రైతులు ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిసి రూ.50,000 పరిహారం సహా తమ డిమాండ్ల వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. బుధవారం ఫడ్నవీస్ మహారాష్ట్రలోని లాతూర్, ధరాశివ్ పర్యటించి, అక్కడి కరువు లాంటి పరిస్థితిని 'అత్యంత తీవ్రమైనది'గా అభివర్ణించారు. ఈ రెండు జిల్లాల్లో ఈ ఏడాది సాధారణ వర్షపాతంలో సుమారు 50శాతం మాత్రమే నమోదు అయ్యిందని ఫడ్నవీస్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభావిత రైతులకు 'అన్నివిధాలా సాధ్యమైనంత మేరకు సహాయాన్ని' అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## పేపర్ లీక్ కేసు నిందితుడి కుమారుడు ఆదిత్యపై..

# నీట్- యుజి 2027 పరీక్షకు హాజరుకాకుండా నిషేధం

**లాథూర్ :** జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఏ) లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ యజమాని, పేపర్ లీక్ కేసు నిందితుడైన శివరాజ్ మోటెగావ్‌కర్ కుమారుడిని రెండేళ్ల పాటు 'నీట్–యుజి' పరీక్షకు హాజరుకాకుండా నిషేధించింది.ఈ ఏడాది జరిగిన నీట్–యుజి పేపర్ లీక్ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) చేత అరెస్ట్ చేయబడిన మోటెగావ్‌కర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. సెప్టెంబరు 19న ఎన్‌టిఏ విడుదల చేసిన సమాచారం ప్రకారం...ఈ ఏడాది ఆరంభంలో నిర్వహించిన పరీక్షకు సంబంధించి అతడి కుమారుడు ఆదిత్య మోటెగావ్‌కర్ ఫలితాన్ని నిలిపివేశారు. అతడిని నీట్–యుజి 2027 పరీక్షకు హాజరయ్యేందుకు కూడా అనర్హుడిగా ప్రకటించారు. సిబిఐ కథనం ప్రకారం...పరీక్షకు ప్రశ్నాపత్రాలను రూపొందించిన ఎన్‌టిఏ ప్యానెల్‌లో సభ్యుడిగా ఉన్న పివి.కులకర్ణి నుంచి రసాయన శాస్త్ర (కెమిస్ట్రీ) ప్రశ్నా పత్రాలను కొనుగోలు చేయడానికి శివరాజ్ మోటెగావ్‌కర్ రూ.5 లక్షలు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడి కుమారుడు కులకర్ణి కోచింగ్ క్లాసులకు హాజరయ్యాడని, అక్కడే అతడికి ప్రశ్నలు అందించబడ్డాయని ఏజెన్సీ ఆరోపించింది. జూన్ 21న నీట్–యుజి పరీక్ష నిర్వహించిన అనంతరం జాతీయ పరీక్షల ఏజెన్సీ ఆదిత్య మోటెగావ్‌కర్ ఫలితాన్ని నిలిపివేసి, ఆరోపించబడిన అవకతవకలపై అతని వివరణ కోరింది. ఆయన దీనిపై స్పందిస్తూ...పరీక్ష సమయంలో తాను ఎలాంటి అక్రమ పద్ధతులను అవలంభించలేదని ఆయన ఖండించారు. మే 3వ తేదీ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి, తనకు నోటీస్ జారీ చేశారని, ఆ తర్వాత జరిగిన పున: పరీక్షలో తన ఫలితాన్ని ఎందుకు నిలిపివేశారని ఆయన ప్రశ్నించారు. జాతీయ అర్హత–కమ్–ప్రవేశపరీక్ష (అండర్‌గ్రాడ్యుయేట్ ) లేదా నీట్–యుజి వైద్య విద్యార్థుల కోసం ఎన్‌టిఏచే నిర్వహించబడుతుంది. ప్రశ్నా పత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణల నేపథ్యంలో, వైద్య కోర్సుల ప్రవేశాల కోసం మే 3న జరిగిన నీట్–యుజి పరీక్షను మే 12న ఎన్‌టిఏ రద్దు చేసింది. జూన్ 21న తిరిగి నిర్వహించారు. పత్రాల లీక్‌లు, అలాగే ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించడంలో ఇతర అక్రమ మార్గాలను ఉపయోగించడం వల్ల తలెత్తే క్రిమినల్ కేసులకు సంబంధించిన తన తుది నివేదికను సిబిఐ గత నెలలో ఢిల్లీలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ముందు సమర్పించింది.


## SREE GEERVANI COLLEGE OF EDUCATION

CHOPPADANDI(VILL&MDL),DIST KARIMNAGAGR-505415.
MOB:9848236339

**SPOT ADMISSION NOTIFICATION 2026--27**

The following unreported/cancelled of B.Ed Candidates should report on or before 29/09/2026 by 5.00 p.m otherwise their seats will be Cancelled and the same may be filled with spot admissions on 30/09/2026 at 10.00 a.m at our college campus as per guidelines of TGCHE /EDCET-2026 Convener

| S NO | RANK | HT NO | STUDENT NAME | CATEGORI | DETAILS OF ALLOTMENT | METHOD |
|---|---|---|---|---|---|---|
| 1 | 15670 | 2625001588 | MUDDAMALLA SRILEKHA | SC - 3 | REG_SC3_OU_GEN | Bio scie |
| 2 | 16963 | 2615002140 | AFIYA NUMERA | BC-B | REG_BCB_OU_GEN | Bio scie |
| 3 | 17021 | 2625001509 | SHEK ARFA MAHVEEN | BC-E | REG_BCE_OU_GEN | Bio scie |
| 4 | 28040 | 2615605030 | AZMERA RAJESHWARI | ST | REG_ST_OU_FEMALE | Bio scie |
| 5 | 1105 | 2615010114 | NAKKA MOUNIKA | BC-D | REG_OPEN_OU_FEMALE | Maths |
| 6 | 14530 | 2615007085 | PEDDI RAJESHAM | BC-B | REG_BCA_OU_GEN | Maths |
| 7 | 21590 | 2625006080 | ROUTHU PRASHANTHI | BC-D | REG_BCD_OU_GEN | Maths |
| 8 | 24938 | 2615010106 | SANGA SANDYA | BC-B | REG_BCB_OU_GEN | Phy scie |
| 9 | 6369 | 2625606309 | MOUNIKA MANDALA | BC-B | REG_OPEN_UNR_GEN | Social |
| 10 | 8369 | 2525004078 | KODIPELLI SAI | SC - 3 | REG_OPEN_UNR_GEN | Social |
| 11 | 10196 | 2615005076 | DHYAVA RADHA | SC - 2 | REG_SC2_UNR_FEMALE | Social |
| 12 | 11665 | 2625401022 | KAMMARI SOUJANYAVANI | SC - 3 | REG_OPEN_OU_GEN | Social |
| 13 | 14062 | 2614104101 | MASKE SHABDANJALI | SC - 3 | REG_OPEN_OU_GEN | Social |
| 14 | 23585 | 2625008155 | BALLA ANUSHA | BC-D | REG_BCD_OU_GEN | Social |
| 15 | 24193 | 2625001501 | MAMIDIPALLY SANGEETHA | SC- 2 | REG_SC1_OU_GEN | Social |
| 16 | 25071 | 2625004052 | ODDETI MANISHA | SC - 3 | REG_SC3_OU_GEN | Social |
| 17 | 25634 | 2615501090 | SHAIK RESHMA | BC-E | REG_BCE_OU_GEN | Social |
| 18 | 26900 | 2615010086 | ROUTHU SUPRAJA | BC-D | REG_BCC_UNR_GEN | Social |
| 19 | 27304 | 2625001155 | MEDI MOUNIKA | BC-A | REG_BCD_OU_FEMALE | Social |

*Ninteen(19) students are not reported.

*Twelve(12)students are not alotted by Edcet Convenor

*TOTAL VACANCIES =Thirty one(31)Only

sd/-
PRINCIPAL
Sree Geervani College of Education.



## ST. JOHN'S COLLEGE OF EDUCATION

Affiliated To Osmania University
OPP: GAIL, CHENGICHERLA(V), CHERLAPALLY PHASE-III
MEDIPALLY(M), MEDCHAL-MALKAJGIRI(DIST)92,TG. PH : 9866519194

LOVE WISDOM GROWTH
SERVING SINCE 1978

# B.Ed. SPOT ADMISSIONS 2026

Applications are invited from the candidates those who have not taken admission anywhere so far, and have passed degree and qualified in Ed CET-2026. Eligible candidates should attend for spot admission with all original certificates on 30/09/2026 10 AM at our college premises

The following candidates allotted by the convener TG-Ed CET 2026 have not reported so far. If he/she fails to report on or before 29/09/2026 will be treated as cancelled and seats including vacant seats will be filled in spot admissions by the qualified candidates present on 30/09/2026.

| S.NO. | RANK | HT.NO. | NAME | METHODOLOGY | CATEGORY | DETAILS OF ALLOTMENT |
|---|---|---|---|---|---|---|
| 1 | 1568 | 2624304592 | J BABU RAO | BIOLOGICAL SCIENCE | SC-3 | REG-OPEN-UNR-GEN |
| 2 | 4898 | 2614107856 | CHEEMARLA RANJITH KUMAR | BIOLOGICAL SCIENCE | SC-2 | REG-OPEN-OU-GEN-NCC |
| 3 | 8251 | 2614108825 | MADDI MOUNIKA | BIOLOGICAL SCIENCE | BC-B | REG-BCB-OU-FEMALE |
| 4 | 8461 | 2615601062 | AREPALLY ASHWINI | BIOLOGICAL SCIENCE | SC-2 | REG-SC2-OU-GEN |
| 5 | 23596 | 2624101117 | ASHWALA LAXMI | BIOLOGICAL SCIENCE | BC-A | REG-BCA-UNR-FEMALE |
| 6 | 23629 | 2614301614 | VADTHYA RAJESHWARI | BIOLOGICAL SCIENCE | ST | REG-ST-OU-GEN |
| 7 | 3497 | 2614108695 | POLLAMPALLI MOUNIKA | MATHEMATICS | BC-B | REG-BCB-OU-GEN |
| 8 | 3844 | 2624103111 | MADIPEDDI RAMAKRISHNA | MATHEMATICS | BC-A | REG-BCA-OU-GEN |
| 9 | 14592 | 2624107718 | JATOTHU RAJESHWARI | MATHEMATICS | ST | REG-ST-OU-GEN |
| 10 | 286 | 2614301035 | CHINTA FRANZ TIMON HUBERT | PHYSICAL SCIENCE | BC-C | REG-OPEN-UNR-GEN |
| 11 | 8380 | 2614305371 | GUNDALA JYOTHI | PHYSICAL SCIENCE | BC-D | REG-BCD-OU-GEN |
| 12 | 11596 | 2614107538 | DONTHIDEEPA | PHYSICAL SCIENCE | SC-2 | REG-SC2-OU-GEN |
| 13 | 1157 | 2614107901 | NAKEERTHA SHRAVYA | SOCIAL STUDIES | BC-B | REG-OPEN-OU-FEMALE |
| 14 | 4128 | 2625601744 | TIWARI DINESH KARTHIK | SOCIAL STUDIES | BC-D | REG-OPEN-OU-GEN |
| 15 | 7812 | 2624304063 | RANJANI KUMARI | SOCIAL STUDIES | OC | REG-OPEN-OU-GEN |
| 16 | 8133 | 2624201128 | CHOWAN ANURADHA | SOCIAL STUDIES | ST | REG-ST-OU-GEN |
| 17 | 17865 | 2624305067 | BODA VARAMMA | SOCIAL STUDIES | SC-2 | REG-SC-2-OU-FEMALE |
| 18 | 23168 | 2624107138 | P UMAKANTH | SOCIAL STUDIES | SC-3 | REG-SC3-OU-GEN |
| 19 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |
| 20 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |

The vacant seats may be filled by the candidates of the concerned category as per their merit in TG Ed.CET-2026 and guidelines prescribed by the convener, TG Ed.CET-2026.

# ఇరాన్ ఎవరి ముందూ మోకరిల్లే ప్రసక్తే లేదు

• ఏ శక్తీ మా దేశాన్ని నాశనం చేయలేదు • అమెరికా బలప్రయోగం మానవతాసూత్రాలకు విరుద్ధం • న్యూయార్క్ 'పత్రికాగోష్ఠి'లో పెజెష్కియన్ వెల్లడి

**న్యూయార్క్:** ఇరాన్‌ను ప్రపంచంలో ఏ శక్తీ నాశనం చేయలేదని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు.ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన మరునాడు న్యూయార్క్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎవరి ముందూ ఇరాన్ మోకరిల్లే ప్రసక్తే లేదని అన్నారు. ఒక దేశాన్ని నాశనం చేయడాన్ని గురించి అమెరికా పదే పదే మాట్లాడుతోందని, ఇవన్నీ మానవతా సూత్రాలకు విరుద్ధమని హెచ్చరించారు.ఇరాన్‌కు గొప్ప చారిత్రక మూలాలు ఉన్నాయని, ప్రపంచంలో ఏ శక్తీ ఇరాన్‌ను నాశనం చేయలేదని అన్నారు.ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేయాలా? లేక ఒక గొప్ప దేశంగా ఎదిగేందుకు అవకాశం ఇవ్వాలా? అనే విషయంలో తాను ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదని ఐక్యరాజ్యసమితి సర్వసభ సమావేశంలో ట్రంప్ హెచ్చరిక ధోరణి ప్రసంగం చేశారు. దీనికి సమాధానంగా పెజెష్కియన్ పాత్రికేయులవద్ద పైవిధంగా స్పందించారు.ఒక ఒప్పందం కుదిరితే ఇరాన్ పశ్చిమాసియాలో లేదా ప్రపంచంలోనే ఒక అత్యుత్తమమైన దేశంగా ఎదిగేందుకు వీలు కలుగుతుందని, లేకపోతే సర్వనాశనం చేస్తామని ట్రంప్ అన్నారు. దీనిని ప్రస్తావించకుండా పెజెష్కియన్ స్పందించారు. ప్రపంచంలో అమెరికా బలప్రయోగ విధానం అనుసరస్తోందని,బెదిరింపులకు దిగుతోందని విమర్శించారు. ఈ విధమైన బెదిరింపులు అంతర్జాతీయ సూత్రాలకు, చట్టాలకు పూర్తి విరుద్ధమన్నారు.వెనిజులా, క్యూబా, గ్రీన్‌లాండ్ తదితర దేశాల విషయంలో అమెరికా అనుసరిస్తున్న బెదిరింపు ధోరణులను ఆయన ప్రస్తావించారు. ఇంతబహిరంగంగా గతంలో ఎవ్వరూ దారుణ చర్యలకు ఒడిగట్టలేదని, ఇవన్నీ మానవతా సూత్రాలకు విరుద్ధమని అన్నారు. ఇరాన్ ఎన్ని ఒత్తిడులు ఎదుర్కొన్నప్పటికీ, ఐక్యంగా నిలబడ్డారని,క్షేత్రస్థాయిలో దేశాన్ని కాపాడుకుంటున్నారన్నారు.

**ఉగ్రవాదులంకాదు.. ఉగ్రవాద బాధితులం**

''మేం ఉగ్రవాదులం కాదు, అమెరికా ఉగ్రవాద బాధితులం'' అని మసూద్ పెజెష్కియన్ అన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ సెషన్‌లో కేటాయించిన సమయం ప్రకారం బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ,అమెరికా ఉగ్రవాదానికి ఇరాన్ బలైపోతోందన్నారు.ఇరాన్ ప్రజలు అమెరికా ఉగ్రవాదానికి బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇరాన్ తనను తాను కాపాడుకోవడాన్ని ఆపదని, అదేసమయంలో శాంతికోసం చర్చలు జరపడానికి సిగ్గుపడబోదని అన్నారు. ఈ



అంతర్జాతీయ వేదికపై ఇరాన్ ఎదుర్కొంటున్న బాధలను తెలియజేయడానికే ఇక్కడకు వచ్చామన్నారు.ఒకవైపు యుద్ధం జరుగుతున్న తరుణంలో శత్రుదేశ నగరం న్యూయార్క్‌లో కాలుమోపి అంతర్జాతీయ వేదికపై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ చేసిన ప్రసంగం ఆ దేశ ప్రజల జేజేలు అందుకుంది. గడచిన ఫిబ్రవరినెలలో అమెరికా దాడుల్లో మరణించిన ఇరాన్ సర్వాధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీతోపాటు మినాబ్‌లో మరణించిన 160 మందికిపైగా పిల్లలకు సంబంధించిన పెద్ద పెద్ద ఫొటోలను ఆయన జనరల్ అసెంబ్లీ సమావేశంలో అందరి ఎదుటా ప్రదర్శించారు.''మమ్మల్ని మేం రక్షించుకుంటున్నాం అంతే, మేం ఎవ్వరిమీదా యుద్ధం చేయడం లేదు, మేం ఉగ్రవాదులం కాదు,అమాయకులైన ప్రజలను లక్ష్యంగా చేసుకుని పిరికిపందల్లా దాడులు చేస్తున్నారు దురాక్రమణదారులు,మేం మాకున్న సంపూర్ణ బలాన్ని ఉపయోగించి మమ్మల్ని మేం కాపాడుకుంటున్నాం,ఇప్పటికీ వారు మా మీద దాడులు చేసినా సరే, మేం వారి ముందు మోకరిల్లే ప్రసక్తే లేదు, మా మర్యాద,మా సార్వభౌమాధికారం,మా ప్రాదేశిక సమగ్రతలను మేం కాపాడుకుంటాం'' అని చెప్పారు. మమ్మల్ని లొంగదీయాలని ప్రయత్నిస్తే సాధ్యంకాదని శత్రువులు అర్థం చేసుకోవాలి,కానీ ఇప్పటికీ మేం చర్చలకు సిద్ధంగా ఉన్నాం'' అని ప్రకటించారు. అదేసమయంలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌తో న్యూయార్క్‌లోనే ముఖాముఖీ చర్చలకు డోనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు.పెజెష్కియన్ ప్రసంగంపై ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ భాఘెర్ ఘాలిబాఫ్ స్పందిస్తూ, న్యూయార్క్‌లో అంతర్జాతీయ వేదికపై పెజెష్కియన్ 3000 సంవత్సరాల క్రితంనాటి ఇరాన్ నాగరికతను ప్రతిబింబించారని ప్రశంసించారు.ఎంతో ధైర్యం,సాహసంతో,స్థిరంగా నిలబడి శత్రుకేంద్రంలో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఆత్మాభిమానాన్ని,శక్తిసామర్థ్యాలను చాటి చెప్పారన్నారు.

## అఫ్ఘానిస్థాన్‌లో పాక్ దాడులు

నలుగురు మృతి

**కాబూల్:**అఫ్ఘానిస్థాన్‌లోని పది ప్రాంతాలపై పాకిస్థాన్ దళాలు గురువారం తెల్లవారకముందుగానే దాడులు చేశాయి. ఈ దాడుల్లో నలుగురు ఆఫ్ఘానిస్థాన్ పౌరులు మరణించారని ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ చెప్పారు.పాకిస్థాన్ దళాలకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. సరిహద్దుల నుండి తమ దేశంలోకి డ్రోన్ దాడులు జరిగాయని పాకిస్థాన్ ఆరోపించిన తర్వాత ఈ ప్రతీకార దాడులు జరిగాయి.కాందహార్,పక్టియా,ఖోస్ట్ రాష్ట్రాలోని పది ప్రాంతాలలో డ్రోన్లు దాచి ఉంచిన కేంద్రాలపై ఈ దాడులు చేసినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఇటీవలి నెలల్లో పాకిస్థాన్–అఫ్ఘానిస్థాన్ మధ్య పరస్పర దాడులు మితిమీరాయి. ఇది క్రమంగా శత్రుత్వంగా మారుతోంది. తెహ్రిక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాదులకు అఫ్ఘానిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తూ తరుచు ఈ దాడులు చేస్తోంది.ఐతే సరిహద్దుల్లోంచి పాకిస్థాన్‌లోకి ఉగ్రవాదుల చొరబాట్లను అడ్డుకున్న తర్వాత తమ దేశంలోకి ఎనిమిది డ్రోన్లతో దాడులు జరిగాయని,దానికి ప్రతీకారంగా పది ప్రాంతాలపై దాడులు చేశామని పాకిస్థాన్ పేర్కొంది.

## వెనిజులా ఎన్నికలకు డెల్సీ హామీ

**న్యూయార్క్:**వెనిజులాలో స్వేచ్ఛగా పూర్తిస్థాయి ప్రజాస్వామ్యబద్ధ ఎన్నికలు నిర్వహిస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ హామీ ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆమె మొదటిసారి మాట్లాడుతూ, దేశంలో ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఐతే ఒక తేదీ లేదా నెలను ఆమె ప్రకటించలేదు. దేశంలో ఇతర ప్రభుత్వ సంస్థలు ఎన్నికల నిర్వహణకు పూర్తి సహకారం ఇస్తాయన్నారు. దేశ పరివర్తనకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ఎన్నికలు నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు.వెనిజులాలో ఎన్నికలు జరపాలని న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి కార్యాలయం వెలుపల మంగళవారం ఆమెకు నిరసన ప్రదర్శన ఎదురైంది. వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు అవకాశం ఇవ్వాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. చమురు వద్దు,కొత్త ముఖం,పాత పాలన'' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెనిజులా జాతీయ జెండాలను ప్రదర్శకులు ప్రదర్శించారు.అమెరికా ప్రభుత్వం వల్లనే మనదేశం స్వేచ్ఛకు దూరమైందని కారకస్ నుండి వలస వచ్చిన 34 ఏళ్ళ సోషల్ మీడియా మేనేజర్ మిగెల్ ఎడ్వర్డో మార్టినెజ్ విమర్శించారు.

## అబ్రహాం లింకన్ నౌకలో సైనికుల ఆత్మాహత్యా యత్నాలు




**దుబాయ్:**పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా అమెరికా మోహరించిన ప్రతిష్ఠాత్మకమైన అబ్రహాం లింకన్ యుద్ధ నౌకలో ఉన్న సైనికులు విసుగెత్తిపోయి గత్యంతరం లేక ఇప్పటివరకూ ఎనిమిదిసార్లు ఆత్మాహత్యా ప్రయత్నాలు చేశారు. ట్రంప్ ప్రభుత్వం ఈ విషయాన్ని అధికారికంగా అంగీకరించిందని కాంగ్రెస్ సభ్యుడు ఒకరు గురువారం ప్రకటించారు.గత ఏడాదిలో ఈ విమాన వాహక నౌకను మధ్యధరా సముద్రంలో మోహరించారు.అనేకమంది అమెరికా సైనికులు నెలల తరబడి ఈ నౌకలో ఉండపోయారు. దీనివల్ల వారి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. వారు ఇళ్ళకు వెళ్ళి చికిత్స పొందాలని గాఢంగా కోరుకుంటున్నారు.వారికి సరైన ఆహార సరఫరా కూడా కొరవడింది. ఇంటి మీద బెంగ పెరిగింది. మరోవైపు తీవ్రమైన యుద్ధ ఒత్తిడి,ప్రాణహాని పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఈ దశలో వారు సెలవులు లేక,ప్రత్యామ్నాయ మార్గాలు లేక ఆత్మహత్యలకు ప్రయత్నం చేశారు. ఈ వార్తలన్నీ అంతర్జాతీయ మీడియాలో ప్రముఖంగా బయటకు వచ్చాయి. కానీ దీనిపై ట్రంప్ సరిగ్గా స్పందించలేదు.అబ్రహాం లింకన్ నౌకలో జరిగిన పరిస్థితులపై ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీకి చెందిన సభ్యుడు కిరిస్టెన్ గిల్లిబ్రాండ్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తాత్కాలిక నావికాదళ కార్యదర్శి హాంగ్ కావో పంపిన ఒక లేఖ ద్వారా సైనికులు ఆత్మహత్యలకు ప్రయత్నం చేశారన్న విషయాలు వెలుగుచూశాయి. ఈ లేఖను ఎ.ఎఫ్.పి స్వయంగా పరిశీలించింది. ఇవి కేవలం ఆత్మహత్యలకు ప్రయత్నాలే తప్ప నౌకలో ఆత్మహత్యలు జరగలేదని కూడా ఆ లేఖ ధృవీకరించింది.ఆగస్టునెలలో ఎయిర్ వింగ్‌కు చెందిన ఒక నావికులు సముద్రంలోకి దూకాడు. కానీ వెంటనే హెలికాప్టర్ ద్వారా అతడి ప్రాణాలు కాపాడారు.సముద్రంలోంచి బయటకు తీసుకువెళ్ళారు. మార్చినెలలో కూడా మరో నావికులు సముద్రంలో దూకాడు. అతడి సహచరులు బయటకు తీసుకువచ్చి స్వస్థలానికి పంపించారు. లింకన్ ఓ డ దక్షిణ చైనా సముద్రంలో విధులు నిర్వహించడానికి 2025లో కాలిఫోర్నియా నుండి బయలుదేరింది. ఫిబ్రవరి చివరిలో ఇరాన్‌పై దాడులు ప్రారంభించడానికి ముందుగానే ఈ నౌకను పశ్చిమాసియాకు తరలించారు.286 రోజులు సముద్ర ప్రయాణం తర్వాత చివరకు ఆ నౌక థాయ్‌లాండ్‌లో ఆగింది. నౌకలో సైనికుల మానసిక అనారోగ్యం,అస్వస్థత,అపరిశుభ్రతల గురించిన వార్తలను ట్రంప్ తేలిగ్గా కొట్టిపారేశారు.రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ కూడా ఇవన్నీ తప్పుడు వార్తలని అన్నారు.

## మీడియాపై నిషేధాన్ని తిరస్కరించిన కోర్టు

వైట్‌హౌస్‌లో ప్రవేశానికి జడ్జి ఆదేశం

**వాషింగ్టన్:**వైట్‌హౌస్‌లోకి అడుగుపెట్టకుండా సిఎన్ఎన్,ఎంఎస్ నౌ,పొలిటికో టీవీ నెట్‌వర్క్ పూల్‌పై నిషేధం విధిస్తూ ట్రంప్ సెప్టెంబరు 22వ తేదీన జారీ చేసిన ఉత్తర్వును అమెరికా న్యాయమూర్తి తిరస్కరించారు. తక్షణం ఈ ఉత్తర్వులను రద్దుచేసి మీడియాను వైట్‌హౌస్‌లోకి 14 రోజులపాటు అనుమతించేందుకు తాత్కాలిక ఉత్తర్వు ఇచ్చారు. దీంతో ట్రంప్‌కు న్యాయస్థానం ద్వారా మరో ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ తీసుకున్న అనేక దూకుడు చర్యలను అమెరికా సుప్రీంకోర్టు సహా అనేక జిల్లా, రాష్ట్రస్థాయీ న్యాయస్థానాలు తిరస్కరిస్తూనే ఉన్నాయి. ఈ పరంపరలో భాగంగా మీడియా పూల్‌పై ట్రంప్ విధించిన నిషేధం చెల్లదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.''ట్రంప్ చర్య మీడియా సంస్థలకున్న రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలను నెరవేర్చకుండా వారికున్న సముచితమైన హక్కులను ఉల్లంఘించే అవకాశం ఉంది, వెంటనే ఆ మూడు వార్తాసంస్థలను వైట్‌హౌస్‌లోకి ప్రవేశ పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలి'' అని కొలంబియా జిల్లా కోర్టు న్యాయమూర్తి తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. తన వార్తలను వక్రీకరిస్తున్నా



రని, అసత్య ప్రచారం చేస్తున్నారని ట్రంప్ ఈ మీడియా పూల్‌పై మండిపడ్డారు. ఈ మూడు టీవీలకు సంబంధించిన నెట్‌వర్క్ పూల్‌పై నిషేధం విధించే చట్టబద్ధమైన హక్కులు తనకు ఉన్నాయని ట్రంప్ వాదించారు. ఆయన నిషేధం విధించిన కొద్ది సేపటికే వైట్‌హౌస్‌కు చెందిన ''ట్రంప్ టీవీ–24/7'' తన ప్రసారాలు ప్రారంభించింది. పొలిటికో,సిఎన్ఎన్,ఎంఎస్ నౌలకు చెందిన పాత్రికేయులకున్న గుర్తింపు కార్డులను లాక్కుని వారిని లోనికి రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో ఈ నెట్‌వర్క్ పూల్‌లో ఉన్న టీవీ సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కొలంబియా కోర్టు పైవిధంగా స్పందించింది.ట్రంప్ నిషేధం విధించిన వెంటనే ఇతర మీడియా సంస్థలు కూడా తోటి సంస్థలకు తమ సంఘీభావం ప్రకటించాయి. ఫాక్స్‌న్యూస్, సిబిఎస్ మీడియా, ఎన్‌బిసి, ఎబిసి, సిఎన్ఎన్ ఒక ఉమ్మడి ప్రకటనలో ట్రంప్ వైఖరిని ఖండించాయి. గతంలో ఇతర ప్రధాన స్రవంతి మీడియాతో కూడా ట్రంప్ ఇదేవిధంగా ఘర్షణాత్మక వైఖరి అనుసరించారు. బిబిసితో కోర్టుకేసు ఇప్పటికీ విచారణలో ఉంది. సిబిఎస్,న్యూయార్క్ టైమ్స్,ఫాక్స్‌న్యూస్ సహా 49 మీడియా సంస్థలు కూడా పొలిటికో,సిఎన్ఎన్,ఎంఎస్ నౌల వ్యాజ్యానికి మద్దతు ఇచ్చాయి.ఒక న్యాయపరమైన పత్రాన్ని కోర్టులో దాఖలు చేశాయి.ట్రంప్ తరచు మీడియా సంస్థలను విమర్శిస్తారు. వాల్‌స్ట్రీట్ జర్నల్,ద న్యూయార్క్ టైమ్స్,బిబిసిలతో కూడా ఆయన గతంలో ఘర్షణలకు దిగారు.

## ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

పాటు ఆయా సంబంధిత జిల్లాల కలెక్టర్‌లను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు(కెసిఆర్), ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులతో పాటు మాజీ మంత్రులు కె.టి.రామారావు(కెటిఆర్), టి.హరీశ్ రావు, జి.జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, పలువురు ముఖ్య నాయకులకు చెందిన భూ వ్యవహారాలపై ఈ కమిటీ ప్రధానంగా విచారణ జరపనుంది. ఎర్రవల్లి, సిరివెంకటాపూర్ భూములు, భూములు, రంగనాయకసాగర్ సమీపంలోని స్థలాలు, జన్వాడ్‌లో కెటిఆర్ కుటుంబ సభ్యులు, అనుచరులు కొనుగోలు చేసిన భూములపై ఆరా తీయనున్నారు. అలాగే అజీజ్ నగర్‌లో హరీశ్ రావు భూములు, వట్టినాగులపల్లిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి భూములు, శంకరాహిల్స్ కొనుగోళ్లపై కూడా పరిశీలన జరగనుంది. దీంతో పాటు మల్లన్నసాగర్ భూసేకరణ ఆరోపణలు, అసైన్డ్ భూముల ఆక్రమణలు, ధరణి మాడ్యూల్ దుర్వినియోగం, భూదాన్ భూముల కొనుగోళ్లు, జీరా భూముల్లో ఎల్విన్ స్టీఫెన్సన్ లీజ్ భూముల రెగ్యులరైజేషన్ వ్యవహారాలపై విచారణ చేపట్టనున్నారు. అంతేకాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ భూముల కేటాయింపులు, మహబూబ్ నగర్ జిల్లా గుండేడ్‌లోని పలు సంస్థల వ్యవహారాలు, మిడ్ మానేర్ రిజర్వాయర్ పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల కేటాయింపులలో జరిగిన అక్రమాలపై కమిటీ విచారించనుంది. విచారణకు సంబంధించి ఏ శాఖ నుంచైనా అవసరమైన రికార్డులు, పత్రాలు, డేటాను సేకరించే సంపూర్ణ అధికారాలను కమిటీకి ప్రభుత్వం కల్పించింది. విచారణను వేగవంతం చేసి నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

## దెబ్బతీసిన జ్ఞానేశ్

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఢిల్లీ కార్యదర్శి రవి రాయ్ హాజరయ్యారు.భారత ఎన్నికల సంఘం పనితీరుపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనంలో వెల్లడైన అంశాలపై వామపక్ష పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఏకపక్ష ఎస్ఐఆర్, ఫారం–6లో మార్పులు, నియమ నిబంధనలను మార్చేయడంపై ప్రతిపక్ష పార్టీలు పదేపదే లేవనెత్తిన ఆందోళనలను ఆ కథనం సమర్థించాయని వామపక్ష నేతలు పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు స్వయంగా పలు నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ ఆందోళనలను పట్టించుకోలేదని, ఇసిఐ ఒక స్వతంత్ర సంస్థగా కాకుండా బిజెపి చేతిలో కీలుబొమ్మగా పనిచేస్తోందన్నది స్పష్టమైందని అన్నారు. ఇసిఐ ఒక సాధారణ సంస్థ కాదని, భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్య విశ్వసనీయత దాని స్వాతంత్ర్యం, నిష్పాక్షికత, న్యాయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

**ఎన్నికల కమిషనర్‌ల ఎంపిక పద్ధతిని మార్చాలి**

సిఇసి పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఓటర్ల జాబితా నుండి అన్యాయంగా మినహాయించబడిన వారందరి ఓటు హక్కులను పునరుద్ధరించాలని ఐదు వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు డి.రాజా(సిపిఐ), ఎం.ఎ.బేబీ(సిపిఐ(ఎం)), దీపాంకర్ భట్టాచార్య( సిపిఐ(ఎంఎల్) లిబరేషన్), జి.దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్), మనోజ్ భట్టాచార్య (ఆర్ఎస్‌పి)ల పేరుతో ప్రకటన విడుదల చేశారు. ఇసిఐ స్వతంత్ర, ప్రజాస్వామ్యయుత పనితీరును పునరుద్ధరించాలని, ఎన్నికల కమిషనర్ల నియామకానికి ఉన్న ప్రస్తుత వ్యవస్థను తొలగించి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన సుప్రీంకోర్టు ప్రతిపాదించిన ఎంపిక కమిటీ ఆధారిత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

## 48 గంటల గడువు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని ఆయన విమర్శించారు. 'జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయకపోతే దేశవ్యాప్తంగా నిరసనలు ప్రారంభిస్తాం. ఆ తర్వాత ఢిల్లీలో ఆందోళన చేపడతాం. సిఇసి రాజీనామా చేయకపోతే జంతర్ మంతర్ 2.0 తప్పకుండా జరుగుతుంది' అని దీప్కే స్పష్టం చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని భావిస్తే ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో పాల్గొనకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల ఫలితాలు తారుమారవుతున్నాయని మీకు తెలుసంటే, మీరు వాటిలో పాల్గొనకూడదు. దీనిపై మీరు ఒక వైఖరి ఎంచుకోవాలి. ఒక నిర్ణయం తీసుకోవాలి' అని ప్రతిపక్ష పార్టీల నేతలను కోరారు. జ్ఞానేశ్ కుమార్‌ను భారత ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పుగా దీప్కే అభివర్ణించారు. ఎవరికి ఓటు వేసే హక్కు ఉండాలో ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తోందని ఆయన విమర్శించారు. 'మన ఓటు హక్కును రద్దు చేయడానికి జ్ఞానేశ్ ఎవరు?' అని ప్రశ్నిస్తూ, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్'కు సంబంధించిన అంశాలపై ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పదేపదే ప్రశ్నలు లేవనెత్తినట్లు 'ది ఇండియన్ ఎక్స్ప్రెస్' వెల్లడించిన మరుసటి రోజే సిజెపి స్పందిస్తూ, ఈ వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్తంగా 'సర్' అమలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల పర్యవేక్షణలోనే సాగుతోంది. అయితే గత పది నెలల్లో తమకు తెలియకుండా తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాలపై సంధు, జోషి కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఆ పత్రిక కథనం పేర్కొంది. ఒకే రోజు నాలుగుసార్లు వారు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు కూడా తెలిపింది.

## ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని కోరారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద భగత్‌సింగ్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.ధర్మేంద్ర మాట్లాడుతూ భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న జన్మించారని తెలిపారు. తన రచనలు, జైలు లేఖలు, రాజకీయ ఆలోచనల ద్వారా భగత్‌సింగ్ యువతను సామాజిక మార్పుపై ఆలోచించేలా చేశారని పేర్కొన్నారు. భగత్‌సింగ్ పేరును కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా ఆయన జీవితాన్ని, రచనలను, ఆలోచనలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత చరిత్రను తెలుసుకుని, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేలా జయంతి కార్యక్రమాలను నిర్వహించాని కోరారు. శ్రీమాన్, నేర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లా, మండలం, పట్టణం, విద్యాసంస్థల్లో విద్యార్థులు, యువత భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రపై చర్చలు, పుస్తక ప్రదర్శనలు, విద్యార్థి సమావేశాలు, యువజన సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, విద్యను కొనసాగించడం, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవడం, సామాజిక అసమానతలపై అవగాహన పెంచుకోవడం వంటి అంశాలను జయంతి కార్యక్రమాల్లో చర్చించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. సత్య ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుషేక్ మహమూద్, సల్మాన్ బేగ్, రాష్ట్ర సమితి సభ్యులు కళ్యాణ్, రాజ్‌కుమార్, అక్రమ్, అరుణ్, భాను, బి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, పురపాలక సంస్థలు, డిటిసిపి లేదా ఇతర పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు పొందిన ఆస్తులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఎ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అనుమతి పొందిన అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరిగా దరఖాస్తుదారులు సమర్పించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో తలెత్తే సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రిజిస్ట్రార్, హెచ్ఎండిఎ లేదా పురపాలక సంస్థ లేదా గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. ఈ ఆదేశాలను తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు వీలుగా అన్ని జిల్లా కలెక్టర్లు, డిటిసిపి, హెచ్ఎండిఎ అధికారులకు రెవెన్యూ శాఖ ఆదేశాలు పంపింది. 22ఎ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇప్పటికే అమలులోకి వచ్చిన నిర్ణయాలే నిదర్శనమని మంత్రి తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని దాదాపు 64 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జి.ఓ 118కు అనుగుణంగా మెమో జారీ చేయడం, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను జి.ఓ 76 ద్వారా పరిష్కరించే దిశగా కీలక నిర్ణయం తీసుకోవడం వీటిలో ప్రధానమైనవని మంత్రి చెప్పారు. భూమి, ఇల్లు వంటి అంశాల్లో ప్రజలు సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. 22ఎలోని అన్ని భూములను ఒకే గాటన కట్టకుండా, భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హమైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపశమనం కలిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఈ నిర్ణయంతో తెలంగాణలోని వేలాది మంది ఆస్తిదారులు, ప్లాట్లు, ఫ్లాట్ల కొనుగోలుదారులకు పెద్ద ఎత్తున ఊరట లభించనుంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పలు నివాస కాలనీల ప్రజలకు ఈ నిర్ణయం లబ్ధి చేకూర్చనుంది. చాలా కాలంగా స్తంభించిపోయిన రియల్ ఎస్టేట్ లావాదేవీలకు మళ్లీ చలనం వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బాధితులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకోవడం ద్వారా తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది.

## అప్రూవర్‌గా మారాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దేశానికి వారు చేసిన నష్టాలపైమోదీ, షా విచారణను ఎదుర్కొంటారని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన రాహుల్, 'సిఇసి చేసిన పని భారత దేశానికి వ్యతిరేకంగా చేసిన చర్య' అని పేర్కొన్నారు. 'ఇది రాజ్యాంగంపై, దేశ న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన బాధ్యత మీపై ఉంది. దీనిని రుజువు చేయడానికి మా వద్ద తగినంత సమాచారం ఉంది. దీనికి పరిణామాలు తప్పవు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే మేము చూస్తూ మౌనంగా కూర్చోం. దీనికి బాధ్యులైన వారికి శిక్ష పడుతుంది' అని రాహుల్ అన్నారు. ఇప్పుడు జరుగుతున్న వ్యవహారంపై ప్రధాని మోదీ, హోంమంత్రి షా ఇద్దరిపైనా విచారణ జరుగుతుందని, ఈ కుట్రలో వారే అగ్రస్థానంలో ఉన్నారని రాహుల్ విమర్శించారు. వారు ఈ దేశానికి చేసిన ద్రోహంపై విచారణ జరుగుతుందని రాహుల్ అన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ధ్వంసం చేసినందుకు వారు 'దేశద్రోహులు' అవుతారని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ, అమిత్ షా మాట్లాడిన తీరును ప్రజలు గమనించాలని కోరిన రాహుల్, కొన్ని వీడియోలను విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఆ వీడియోల్లో అమిత్ షా బిజెపి మరో 30 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని చెప్పడం, ప్రధాని మోదీ 'అబ్ కీ బార్ 400 పార్' అనే నినాదం చేయడం వినిపించాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో పనిచేసే ఏ రాజకీయ నాయకుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని రాహుల్ అన్నారు భారతదేశంలో ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడే వ్యతిరేకత ఒక ప్రాథమిక రాజకీయ శక్తి గా మారుతుందని, అది ప్రభుత్వాలను, నాయకులను ఎదుర్కొంటుందని రాహుల్ అన్నారు. బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం సాధించినప్పటికీ, ఏడాది, రెండేళ్లలో ఇలాంటి వ్యతిరేకత కారణంగానే ఇందిరా గాంధీపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడిందని రాహుల్ చెప్పారు. 'ప్రతి నాయకుడి విషయంలోనూ ఇది జరిగింది. కానీ మోదీ, షా, బిజెపి విషయంలో ఇది జరగడం లేదు. ఇప్పుడు దానికి సమాధానం ఏమిటో మనకు తెలుసు' అని అన్నారు. ఒక వ్యక్తికి ఉన్న ప్రజాదరణను, ఒక ప్రభుత్వం పనితీరును మనం అర్థం చేసుకోగలమని, కానీ, ప్రజా వ్యతిరేకత పూర్తిగా అదృశ్యం కాదని అన్నారు. సద్దాం హుస్సేన్ పాలించిన ఇరాక్‌లో, ఉత్తర కొరియాలో కూడా సంపూర్ణ మద్దతు అనేది ఉండదని వ్యాఖ్యానించారు. ఓటు మన ప్రజాస్వామ్యానికి పునాదని రాహుల్ అన్నారు. ఎన్నికల సంఘం రక్షించే ఓటు రాజ్యాంగాన్ని కూడా రక్షిస్తుందని పేర్కొన్నారు. ఓటును ధ్వంసం చేసి ఉంటే మన రాజ్యాంగం కూడా ధ్వంసమైనట్టేనని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం ధ్వంసమైతే చట్టాలు చట్టబద్ధతను కోల్పోతాయని, సంస్థలు అర్థరహితంగా మారతాయని ఆయన అన్నారు. ఓటును రక్షించే సంస్థ ఎన్నికల సంఘమేనని, అక్కడి నుంచే మిగతా వ్యవస్థలన్నీ ఉద్భవిస్తాయని రాహుల్ అన్నారు. ఓటు ధ్వంసమైతే రాజ్యాంగం పనిచేయదని, చట్టాలు ధ్వంసమవుతాయని, సంస్థలకు అర్థం ఉండదని పేర్కొన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని తాను వంద శాతం నమ్ముతున్నానని రాహుల్ అన్నారు. 'ఓటు చోరీ నుంచి చట్టం చోరీ వస్తుంది. దాని నుంచి సంస్థల చోరీ జరుగుతుంది' అని మండిపడ్డారు.

## చైనా–అమెరికా కృషి

(మొదటి పేజీ తరువాయి)

వెళ్ళేమార్గంలో కారు మార్గానికి ఇరువైపులా అమెరికాలో ఉన్న చైనీయులు, అమెరికన్లు ఇరు దేశాల జెండాలు ఊపుతూ ఆయనకు స్వాగతం పలికారు.ఒక లిఖితపూర్వక సందేశంలో జీ జిన్‌పింగ్ అమెరికా ప్రజలకు తన శుభాకాంక్షలను తెలియజేశారు.ఉమ్మడి కృషి ద్వారా తన అమెరికా పర్యటన ఖచ్చితంగా సత్ఫలితాలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరుదేశాల శ్రేయస్సును పెంపొందించడమే కాకుండా ప్రపంచశాంతికి కొత్త ఆశలు కల్పిస్తుందన్నారు.ఇరుదేశాలూ చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్నాయని, వారి పరస్పర ప్రయోజనాలు గాఢంగా ముడిపడి ఉన్నాయన్నారు.అమెరికా–చైనా ప్రత్యర్థులు కాదని,ఈ రెండు దేశాలు భాగస్వామ్యులని, యావత్ ప్రపంచ శ్రేయస్సును ముందుకు నడిపిస్తాయని వ్యాఖ్యానించారు.చైనా జాతి గొప్ప పునరుజ్జీవనం,అమెరికాను గొప్పగా తీర్చిదిద్దడం ఈ రెండూ విషయాలు ఏకకాలంలో సాధ్యమవుతాయన్నారు.ఈ రెండు దేశాలు పరస్పర విజయాలు సాధించడంలో ఒకదానికొకటి సహాయం చేసుకుంటూ ప్రపంచ శ్రేయస్సును ముందుకు నడిపిస్తాయన్నారు.వ్యూహాత్మకమైన స్థిరత్వంతో కూడిన నిర్మాణాత్మక సంబంధాలు సాధించే విషయంపై మే నెలలో ట్రంప్ చైనా పర్యటన సందర్భంగా చేసిన ప్రతిపాదనను తాను కూడా అంగీకరించానన్నారు. ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా నిలిచిందన్నారు.రెండు దేశాలూ పరస్పర సహకారాన్ని లక్ష్యంగా చేసుకుని ఒకేదిశగా ముందుకు ప్రయాణం చెయ్యాలని ప్రతిపాదించారు.ఇరుదేశాలు పరిమిత పోటీతో ఉండాలని,విభేదాలను సర్దుబాటు చేసుకోగలస్థాయిలో వ్యవహరించాలని,శాంతి వాగ్దానాలతో ఇరు దేశాలమధ్యా స్థిరమైన సంబంధాలను ప్రోత్సహించాలని జిన్‌పింగ్ అన్నారు.'ఇరుదేశఋలమధ్యా నిర్మాణాత్మక సంబంధాలు నిరంతరం సుసంపన్నం కావాలని ఆశించారు.అమెరికాలో అన్నివర్గాల ప్రజలతో విస్తృతంగా మమేకమై స్నేహాన్ని బలోపేతంచేయడానికి తాను ఆసక్తిగా ఉన్నానన్నారు. 'ప్రపంచం అభివృద్ధి చెందుతోంది,కాలం మారుతోంది,కానీ చైనా–అమెరికా మధ్య శాంతియుత సహజీవన చారిత్రక తర్కం మారలేదు,ఇరుదేశాలమధ్యా స్నేహపూర్వక మార్పిడికి సంబంధించిన సద్భావనలో మార్పులేదు,ఈ రెండు దేశాలపట్లా అంతర్జాతీయ దేశాలకు ఉన్న సాధారణ అంచనాలు కూడా మారలేదు'' అని జిన్‌పింగ్ ఉద్ఘాటించారు.ఆ తర్వాత ట్రంప్ జిన్‌పింగ్ దంపతులకు,వారి పరివారానికి బ్రహ్మాండమైన విందు ఏర్పాటు చేశారు.

**జనవరి 10 వరకూ సుంకాల తగ్గింపు**
**తొలిసారి కృత్రిమ మేధపై చర్చ**

అమెరికా–చైనా మధ్య నవంబరునెలతో ముగిసిపోయే వాణిజ్య ఒప్పందాన్ని జనవరి పదో తేదీ వరకూ పొడిగించుకున్నట్లు అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు.ఎక్కువకాలంపాటు తక్కువ సుంకాలతో వాణిజ్యం చేసేందుకు ఈ ఒప్పందాన్ని పొడిగించామన్నారు. అదేవిధంగా అరుదైన ఖనిజాలను పొందడానికి కూడా అమెరికా తన ప్రయోజనాలను చూసుకుంది.గడచిన అక్టోబరులో ట్రంప్ దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా చైనాతో సుంకాలను ఏడాదిపాటు తక్కువస్థాయిలో కొనసాగించేందుకు అంగీకరించారు. ఈ ఒప్పందం ఈ నవంబరుతో ముగియనున్నదశలో ఈ పొడిగింపునకు రెండు దేశాలూ అంగీకరించాయి.అదేవిధంగా కృత్రిమ మేధపై మొదటిసారి ఈ రెండు దేశాలు చర్చలు పూర్తి చేసినట్లు చైనా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి హే యాడాంగ్ గురువారం చెప్పారు.పరస్పర గౌరవం,శాంతియుత సహజీవనం,పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికపై ఇరు దేశాలకు ఆందోళన కలిగించే అంశాలపై లోతైన,నిర్మాణాత్మక చర్చలు జరిగినట్లు చెప్పారు.

# మారథాన్‌లో ‘సీమ’కు చరిత్రాత్మక కాంస్యం

## మిక్స్‌డ్ రిలేలో రజతం



ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. ఐదో రోజు షూటర్లు వెండి వెలుగులు విరజిమ్మగా.. అథ్లెట్లు కూడా పోడియంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. పది వేల మీటర్ల పరుగులో సీమా కుమారి కంచు మోత మోగించింది. సీమ కాంస్యం అందుకున్న ఇరవై నిమిషాల్లోనే మిక్స్‌డ్ రీలే(4x400 మీటర్ల) ఫైనల్లో భారత బృందం రజతం ఒడిసిపట్టింది. ఫలితంగా భారత్ ఖాతాలో 17 పతకాలు చేరాయి. జపాన్‌లోని నగోయలో జరుగుతున్న పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పతక పోరులో దూసుకెళ్తున్నారు. మిక్స్‌డ్ రిలే విభాగంలో. మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో పూవమ్మ రాజు, విశాల్ థెన్నరసు, విథ్యా రామరాజు, మను టీఎస్లు రెండో స్థానంతో రజతం గెలుపొందారు. గురువారం ఫైనల్లో.. విథ్యా, విశాల్ చిరుతలా పరుగెత్తారు. వీరి కృషి ఫలితంగా ఈ టోర్నీలో తమ రికార్డును కాపాడుకుంది మిక్స్‌డ్ రీలే బృందం. ఇదివరకు 2018లో స్వర్ణం, 2022 ఎడిషన్లో భారత టీమ్ రజతం గెలుపొందింది. అంతకుముందు.. మహిళల 10 వేల మీటర్ల పరుగులో సీమా కుమారి సత్తా చాటింది. ఈ మారథాన్ రేసులో 16 ఏళ్లుగా పతకం కోసం నిరీక్షిస్తున్న భారత్‌ను సంబురాల్లో ముంచెత్తింది. ఫైనల్లో 32:50:05 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని కాంస్య పతకాన్ని ముద్దాడిందీ హిమాచల్ ప్రదేశ్ అథ్లెట్. ఆమె మూడో స్థానానికి పరిమితమవ్వగా.. విన్ఫ్రెడ్ యవీ(బహ్రెయిన్) పసిడి, నొజొమి(జపాన్) వెండి పతకాలు సాధించారు. కామన్వెల్త్ క్రీడల్లో విఫలమైన భారత చిరుత గురిందెర్వీర్ సింగ్ ఈసారి అంచనాలు అందుకున్నాడు. పురుషుల 100 మీటర్ల పరుగులో అతడితో పాటు ఇండియన్ బోల్ట్ అనిమేశ్ కుజుర్ సెమీస్‌కు దూసుకెళ్లాడు. పురుషుల కబడ్డీలో భారత జట్టు దర్జాగా సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో తో చైనీస్ తైపీని ఇండియా చిత్తు చేసింది.

## పతకాల వేటలో దూసుకెళ్తున్న భారత్

## ఐదో రోజు ఏకంగా 5 పతకాలు

జపాన్‌లోని నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నారు. ఆసియా క్రీడల ఐదో రోజు గురువారం భారత్ మొత్తం 5 పతకాలను సొంతం చేసుకుంది. దీంతో ఇప్పటివరకు భారత్ సాధించిన మొత్తం పతకాల సంఖ్య 17కు చేరింది. అథ్లెటిక్స్, వుషు, రోయింగ్, షూటింగ్ విభాగాల్లో మన అథ్లెట్లు సత్తా చాటగా..పురుషుల కబడ్డీ, హాకీ జట్లు ఘన విజయాలతో ముందుకు సాగుతున్నాయి. ఐదో రోజు ఇండియాకు మిక్స్డ్ 4x400 మీటర్ల రిలేలో అద్భుతమైన ప్రదర్శనతో రజత పతకం లభించింది. వుషు పోటీలలో పతకం సాధిస్తుందని భావించిన రోషిబినా దేవి నాఒరెమ్ రజత పతకంతో మెరిసింది. రోయింగ్‌లో పతకాల వేటను కొనసాగిస్తూ పురుషుల డబుల్ స్కల్స్ విభాగంలో సత్నామ్ సింగ్, సల్మాన్ ఖాన్ల జోడీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వీటితో పాటు అథ్లెటిక్స్ 10,000 మీటర్ల రేసులో సీమా, మికస్డ్ స్కీట్ ఈవెంట్లో అనంత్జీత్ సింగ్ నరుకాపరినాజ్ ధాలివాల్ జోడీ భారత్కు కాంస్య పతకాలను అందించారు. ఇతర టీమ్ ఈవెంట్లలోనూ భారత్ కు శుభపరిణామాలు ఎదురయ్యాయి. పురుషుల హాకీ పూల్ మ్యాచ్లో భారత్ 8–2 తేడాతో దక్షిణ కొరియాను చిత్తు చేసి ఘన విజయం సాధించింది. మరోవైపు భారత పురుషుల కబడ్డీ జట్టు అద్భుతమైన ఆటతీరుతో సెమీఫైనల్‌కు అర్హత సాధించి పతకాన్ని ఖాయం చేసుకుంది.





### దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్

## కొరియాపై భారత్ విక్టరీ

ఆసియా క్రీడల హాకీ ఈవెంట్లో ఇండియా దుమ్మురేపుతోంది. పూల్ ఏ నుంచి భారత జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. టోక్యోలో గురువారం దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా 8–2 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత స్ట్రయికర్ దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దిల్‌ప్రీత్‌తో పాటు అభిషేక్, శిలానంద్ లక్రా, సుఖ్జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, రాజిందర్ సింగ్ కూడా గోల్స్ చేశారు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే తొలిసారి దక్షిణ కొరియాపై ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ విక్టరీతో ప్రస్తుతం పూల్ ఏ స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు జపాన్‌తో భారత్ తలపడనున్నది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## హోర్ముజ్ జలసంధి ఎందుకు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది?

☞ 2026లో నాబ్‌ఫిడ్ ఏ రంగానికి సంబంధించిన సంస్థగా వార్తల్లో నిలిచింది?
మౌలిక సదుపాయాల దీర్ఘకాలిక ఆర్థిక సమీకరణకు సంబంధించిన అభివృద్ధి ఆర్థిక సంస్థ

☞ నాబ్‌ఫిడ్ పూర్తి రూపం ఏమిటి?
నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్.

☞ పిఎం ఇ–బస్ సేవ పథకం ప్రధాన లక్ష్యం ఏమిటి?
పట్టణ ప్రజా రవాణాను మెరుగుపరచడానికి 10,000 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం.

☞ పిఎం ఇ–బస్ సేవను ఏ కేంద్ర మంత్రిత్వ శాఖ అమలు చేస్తోంది?
గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.

☞ పిఎం ఇ–బస్ సేవలో 2026 ఆగస్టు నాటికి ఎన్ని బస్సులు పనిచేస్తున్నట్లు నమోదైంది?
500కు పైగా.

☞ 2026 బ్రిక్స్ న్యూఢిల్లీ ప్రకటనలో స్థానిక కరెన్సీల వినియోగానికి ఎందుకు ప్రాధాన్యం ఇచ్చారు?
సరిహద్దు దాటి జరిగే వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థలను బలోపేతం చేయడానికి.

☞ బ్రిక్స్ విస్తరణలో 2026 నాటికి చేరిన ముఖ్య దేశాల్లో ఇరాన్తో పాటు ఏ దేశాలు ఉన్నాయి?
ఇండోనేషియా, ఈజిప్ట్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు.

☞ 2026 బ్రిక్స్ సమావేశంలో భారత్ ఏ ప్రపంచ సమస్యకు సంబంధించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ప్రతిపాదించింది?
అంటువ్యాధుల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ప్రతిపాదించింది.

☞ సింధు నదీ జలాల ఒడంబడికకు సంబంధించి భారత్ ఏ వైఖరి తీసుకుంది?
అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాన్ని భారత్ తిరస్కరించింది.

☞ సింధు నదీ జలాల ఒడంబడిక ఏ రెండు దేశాల మధ్య ఉంది?
భారత్, పాకిస్థాన్.

☞ సింధు జలాల ఒడంబడిక 1960లో ఏ సంస్థ మధ్యవర్తిత్వంతో కుదిరింది?
ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో.

☞ 2026లో బ్రిక్స్ దేశాలు ఐక్యరాజ్యసమితి సంస్కరణల్లో ఏ అంశాన్ని కోరాయి?
అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించాలని కోరాయి.

☞ 2026లో ప్రపంచ వాణిజ్యంలో ఆందోళన కలిగిస్తున్న అంశాలు ఏవి?
సుంకాలు, వాణిజ్య రక్షణవాదం, సరఫరా గొలుసుల అంతరాయం.

☞ 2026లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న ప్రధాన భౌగోళిక రాజకీయ అంశాలు ఏమిటి?
పశ్చిమ ఆసియా ఘర్షణలు మరియు ఇంధన సరఫరా అంతరాయాలు.



☞ హోర్ముజ్ జలసంధి ఎందుకు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది?
ప్రపంచ చమురు, సహజవాయువు సముద్ర రవాణాలో ఇది కీలక మార్గం.

☞ బాబ్ ఎల్ మాండెబ్ జలసంధి ఏ సముద్ర మార్గానికి కీలకం?
ఎర్ర సముద్రం–అడెన్ గల్ఫ్ సముద్ర మార్గానికి.

☞ 2026లో బ్రిక్స్ అధ్యక్ష పదవిని భారత్ ఏ దేశానికి అప్పగించింది?
చైనాకు.

☞ బ్రిక్స్‌లో భారత్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం ఎందుకు ఉంది?
గ్లోబల్ సౌత్ నాయకత్వం, బహుళధ్రువ ప్రపంచ వ్యవస్థ, వాణిజ్య వైవిధ్యీకరణ, ఆర్థిక సహకారానికి వేదికగా ఇది ఉపయోగపడుతుంది.

☞ 2026లో ఐక్యరాజ్యసమితి ఏ కొత్త ప్రపంచ పట రూపకల్పనపై తీర్మానం ఆమోదించింది?
ఈక్వల్ ఎర్త్ మ్యాప్.

☞ మెర్కేటర్ ప్రొజెక్ట్‌పై ఈక్వల్ ఎర్త్ మ్యాప్‌కు ఉన్న ప్రధాన ప్రయోజనం ఏమిటి?
ఖండాల విస్తీర్ణాన్ని మరింత వాస్తవికంగా చూపిస్తుంది, ముఖ్యంగా ఆఫ్రికా పరిమాణాన్ని.

☞ 2026లో ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో ఆగస్టు నెలకు ఉన్న ప్రత్యేకత ఏమిటి?
ఆగస్టు 2026 ప్రపంచంలో అత్యంత ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచింది.

☞ 2026 ఆగస్టులో ప్రపంచ ఉష్ణోగ్రత పారిశ్రామిక పూర్వ స్థాయితో పోలిస్తే సుమారుగా ఎంత పెరిగింది?
సుమారు 1.65 డిగ్రీల సెల్సియస్.

☞ వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న ప్రధాన ప్రమాదాల్లో ప్రధానమైనవి ఏవి?
తీవ్ర ఉష్ణోగ్రతలు, అడవి మంటలు, నీటి కొరత, పంట నష్టం, వలసలు.

☞ 2026లో హిమాలయాల్లో వార్తల్లో నిలిచిన ప్రత్యేక హిమనదీ నిర్మాణాలు ఏమిటి?
హ్యాంగింగ్ గ్లేసియర్స్ లేదా వేలాడే హిమనదాలు.

☞ హ్యాంగింగ్ గ్లేసియర్ అంటే ఏమిటి?
ప్రధాన లోయ హిమనదికి పైభాగంలో లేదా నిటారైన పర్వత వాలుపై వేలాడుతున్న హిమనదీ అవశేషం.

☞ 2026లో షార్ప్‌టెయిల్ శాంపైర్ ఏ అంశానికి సంబంధించి వార్తల్లో నిలిచింది?
పక్షి జాతి, వలస పక్షుల జీవావరణం, జీవవైవిధ్య పరిశీలనకు సంబంధించి.

☞ షార్ప్‌టెయిల్ శాంపైర్ ప్రధానంగా ఏ రకమైన పక్షి?
వలస తీరప్రాంత పక్షి.

☞ అనాక్ క్రకటావా ఏ దేశంలో ఉంది?
ఇండోనేషియాలో.

☞ అనాక్ క్రకటావా ఏ అగ్నిపర్వత వ్యవస్థలో భాగం?
క్రకటావా అగ్నిపర్వత వ్యవస్థలో.

# రేకొండ రైతుల భూములకు పట్టాలు ఇప్పించాలి

### రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి మాజీఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, రేకొండ గ్రామంలోని సర్వే నం.927, ఇతర సర్వే నంబర్లలోని భూములు సాగుచేసుకొని జీవిస్తున్న రైతులకు ఆ భూముల పట్టాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో ఖాస్తులో ఉండి సాగు చేసుకొని జీవిస్తున్న రైతుల భూములకు పట్టాలు ఇచ్చి భూ సమస్యలు పరిష్కారం చేసి రైతులకు న్యాయం చేయాలని గురువారం హైదారాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రేకొండ రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రేకొండలో కొంత మంది రైతులు మరియు వారి కుటుంబాలు సుమారు 60 సంవత్సరాలుగా ఈ భూములను స్వాధీనంలో ఉంచుకొని వినియోగించుకుంటున్నారని,ఈ సుదీర్ఘ కాలంలో వారు తమ శ్రమతో భూములను చదును చేసి, అభివృద్ధి చేసి, సాగుకు అనుకూలంగా మార్చుకొని, వివిధ పంటలను సాగు చేస్తూ వచ్చే ఆదాయమే వారి కుటుంబాల జీవనోపాధికి ప్రధాన ఆధారంగా ఉందని, ఈ భూములు కేవలం ఆస్తి మాత్రమే కాకుండా, అనేక కుటుంబాల జీవనాధారంగా మారాయనీ, తరతరాలుగా వారి కుటుంబాలు ఈ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని మంత్రికి వివరించారు. గతేడాది రెవెన్యూ అధికారుల నివేదికలో మొత్తం 103.03 ఎకరాల భూమి లబ్ధిదారుల అనుభవంలో ఉన్నట్లు తేల్చారని,నివేదికలో సంబంధిత లబ్ధిదారుల ప్రస్తుత స్వాధీనం,అనుభవానికి సంబంధించిన వివరాలు కూడా నమోదు కాబడ్డాయని అన్నారు. ప్రత్యేకంగా సర్వే నం.927లో కాలువ నిర్మాణానికి 2.09 ఎకరాల భూమి సేకరణకు నోటిఫై చేయబడినట్లు, కాలువ భాగాన్ని మినహాయించిన అనంతరం 2.04 ఎకరాల భూమి స్వాధీనంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అదేవిధంగా 2.09 ఎకరాల భూమికి సంబంధించి అవార్డు జారీ లేదా పరిహారం చెల్లింపుకు రికార్డు లేదని అధికారులు తెలిపారన్నారు. భూముల కేటాయింపు, అసైన్‌మెంట్ ప్రక్రియను తుది నిర్ణయానికి తీసుకువెళ్లే ముందు,ప్రస్తుత రైతుల దీర్ఘకాలిక స్వాధీనం, సాగు, భూముల అభివృద్ధి, వారి కుటుంబాల జీవనాధారంపై ఆధారపడటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, చట్టాలు, నిబంధనలు మరియు అర్హతా ప్రమాణాలకు లోబడి, నిజమైన ప్రస్తుత సాగుదారులకు సాగుకు అనుకూలమైన భూమిని కేటాయించే,అసైన్ చేయాలని, నామమాత్రమైన మరియు సహేతుకమైన ధరపై భూమిని కేటాయించాలని, సర్వే నం.927కు సంబంధించి కాలువ కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ, కాలువ ఆక్రమించిన వాస్తవ విస్తీర్ణం, అవార్డు జారీ, పరిహారం చెల్లింపు రికార్డులు మరియు మిగిలిన సాగుభూమి విస్తీర్ణాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు. ప్రస్తుత సీలింగ్ కేసులను కూడా పునఃపరిశీలించి, అవసరమైతే సంబంధిత డిక్లరెంట్‌కు సంబంధించిన సీలింగ్ కేసును తిరిగి తెరిచి, డిక్లరెంట్ యొక్క వాస్తవ మిగులు భూమి ఎంత ఉందో నిర్ణయించాలని, సీలింగ్ డిక్లరేషన్ దాఖలు చేయడానికి ముందే డిక్లరెంట్ మరియు వారి కుటుంబ సభ్యులు కోర్టు డిక్రీలు, రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజులు, సదాబైనామాలు మరియు ఇతర చట్టబద్ధమైన లావాదేవీల ద్వారా విక్రయించిన లేదా బదలాయించిన భూములను, పొరపాటున సీలింగ్ డిక్లరేషన్‌లో చేర్చినట్లయితే, వాటిని పరిశీలించి, చట్టపరంగా విక్రయించబడిన లేదా బదలాయించబడిన భూములను మినహాయించి, డిక్లరెంట్‌కు వాస్తవంగా ఉన్న మిగులు భూమిని తిరిగి నిర్ణయించాలని,దీర్ఘకాలంగా సాగు చేసుకొని జీవిస్తున్న రైతులకు ఆ భూములను నామమాత్రపు రేటుకు కేటాయించి,అసైన్ చేసే విధంగా తగిన ఆదేశాలు జారీ చేసి, వారికి పట్టాలు ఇచ్చేందుకు సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని చాడ వెంకట్‌రెడ్డి మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు చాడ శ్రీధర్‌రెడ్డి, పరిపాటి వెంకటరెడ్డి, బావు రవీందర్, సుధాకర్, రాగులు సంపత్ రెడ్డి, మిరియాల కనకారెడ్డి, చాడ సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం



### పారదర్శకంగా ఇండ్ల ఎంపిక ప్రక్రియ

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతన్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల పరిధిలో ఇండ్లులేని నిరుపేదలకు లాటరీ పద్దతిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించే ప్రక్రియ గురువారం పాల్వంచ, కొత్తగూడెంలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై కూనంనేని మాట్లాడుతూ జి2 నిర్మాణ విధానంలో గతంలో కొందరిని లాటరీ పద్దతిలో ఎంపిక జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు అర్హులైన వారందరికీ పారదర్శకంగా ప్రజా స్వామ్య పద్ధతిలో లాటరీతీసి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ లాటరీ విధానంలో సామాజిక న్యాయానికి పెద్ద పీఠ వేశామని, మరికొన్ని ఓపెన్ కేటగిరీలో లబ్దిదారులకు అందించామన్నారు. గూడులేని నిరుపేదల కుటుంబాల వారికి అండగా నిలవడమే బాధ్యతగా పనిచేస్తున్నామని, లాటరీలో ఇండ్లు రానివారికి ఇందరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యుటి మేయర్ సిరిపురపు లలితకుమారి ప్రజా ప్రతినిధులు వీరబాబు, కొత్వాల శ్రీనివాస్‌రావు, మండే వీరహన్మంతరావు కమీషనర్ సుజాత, డిప్యుటీ కమీషనర్ విజాయనంద్, తహసీల్దార్ ప్రసాద్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ హక్కులకు పోరాటాలు



### ఎస్‌టియు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గన్నోజు ప్రసాద్

### ఎస్‌టియు 80 వసంతాల వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఉపాధ్యాయ హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టియు పోరాటాలు చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు గన్నోజు ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం వీరభవన్ ఆవరణలో ఎస్‌టియు 80 వసంతాల వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంంగా గన్నోజు ప్రసాద్, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్ సారధి రెడ్డితో కలిసి మాట్లాడుతూ స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్‌టియు) 80 వసంతాల ఉత్సవా లు హైదరాబాద్‌లోని నాగోల్‌లోని శుభం గార్డెన్స్ లో ఈనెల 27 ఆదివారం జరగనున్నాయని తెలిపారు. వసంతాల ఉత్సవాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం 80 ఏళ్లుగా ఎస్‌టియు తన వంతు పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా నాయకులు నీలం వెంకటేశ్వర్లు, సంకపల్లి శ్రీనివాసరెడ్డి, గుర్రపు సత్యనారాయణ, శ్రీనివాస వర్మ, పాండురంగ చారి, కేదాస్ రమేష్, అజ్మీర వేణు, తండా సందీప్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు కాదు..ఉచిత విద్య అందించాలి

### సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రభుత్వాలు ఉచిత పథకాలకే పరిమితం కాకుండా విద్యార్థుల భవిష్యతును దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి సయ్యద్ జలాలుద్దీన్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు విద్యను వ్యాపారంగా మార్చకుండా, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో కాషాయాకరణ ప్రోత్సహించే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక పీజుల వసూళ్లను నియంత్రించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం మరింత ఐక్యంగా ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నవంబర్ 16,17 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలో జరిగే ఎఐఎస్ఎఫ్ సంగారెడ్డికి జిల్లా మహాసభలు విజయవంతం చేసేందుకు ఎఐఎస్ఎఫ్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు అనంద్, రెహామాన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తురెడ్డి, విద్యార్థి నాయకులు అశోక్, ప్రశాంత్, అజమ్, నర్సింలు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.




# ‘సర్’ ప్రక్రియతో ఓటు హక్కు కోల్పోకుండా చూడాలి

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సర్ ప్రక్రియ కారణంగా గతంలో ఉన్న ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొందని, తమ ఓటు జాబితా నుంచి తొలగిపోతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి బూత్‌స్థాయి అధికారులు తగిన సూచనలు, మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతూ గురువారం సిపిఐ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 2.50లక్షల మంది ప్రజలు సర్ ప్రక్రియ కారణంగా గతంలో ఉన్న ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఏళ్లుగా ఓటు వేస్తున్న పౌరులను పాత రికార్డులు, మ్యాపింగ్ వివరాలు, ఇతర పత్రాల పేరుతో వివరణలు కోరడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారినవారి వివరాలు వంటి అంశాలను సరిచేయడం వంటి ప్రక్రియలో నిజమైన ఓటర్లు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ రద్దీకి ప్రత్యేక రైళ్లు

**సికింద్రాబాద్ కాకినాడ మధ్య 8 ట్రిప్పులు.. మరో రెండు ప్రత్యేక రైళ్ల పొడిగింపు**



ప్రజాపక్షం/హైదరాబాద్: పండుగల సేవల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్ కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనుండటంతోపాటు, జల్నా యలహంక మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను కూడా పొడిగించింది. సికింద్రాబాద్ కాకినాడ టౌన్ మధ్య 07039 నంబర్ ప్రత్యేక రైలు అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి బుధవారం నడుస్తుంది. సికింద్రాబాద్‌లో రాత్రి 7.10 గంటలకు బయలుదేరే మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07040 నంబర్ రైలు అక్టోబర్ 8 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి గురువారం రాత్రి 9 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రెండు రైళ్లు మొత్తం 8 ట్రిప్పుల సర్వీసులు అందించనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లు ఇరువైపులా చర్లపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతాయి. రైళ్లలో 2ఎసి, 3ఎసి, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయి. ఇదిలా ఉండగా జల్నా యలహంక మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను కూడా పొడిగించారు. 07601 నంబర్ జల్నా యలహంక రైలు అక్టోబర్ 4 నుంచి 25 వరకు ప్రతి ఆదివారం, 07602 నంబర్ యలహంక జల్నా రైలు అక్టోబర్ 5 నుంచి 26 వరకు ప్రతి సోమవారం నడుస్తాయి. ఈ రెండు రైళ్లకు అదనంగా 4 చొప్పున సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ రైళ్లు పర్భనీ, సెలూ, పర్లి, పూర్ణ, నాందేడ్, ముద్ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, బొల్లారం, సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, యాద్గిర్, రాయచూర్, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపూర్ తదితర స్టేషన్లలో ఇరువైపులా ఆగుతాయి. వీటిలో 3ఎసి, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ తెలిపారు.

# ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తాం

**మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి**



ప్రజాపక్షం/వనపర్తి : దేశ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్న పరిస్థితిలో ఉమ్మడి పాలమూరు రైతులు వానాకాలంలో వేసిన పంటలను ఎలాగైనా కాపాడుకోవాలనే దృఢ సంకల్పంతో కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడి జూరాలకు నీటిని విడుదల చేయించడం జరిగిందని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం వనపర్తి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సహచర మంత్రి రాష్ట్ర పశు సంవర్థక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇరిగేషన్ అధికారులతో కృష్ణానది పై సాగు నీరు, తాగునీరు ఇబ్బందులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కృష్ణానది జలాలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో వాన కాలం పంట పండించుకోవడానికి, తాగునీటికి 18.19 టి.ఎం.సి నీళ్లు అవసరం అవుతాయని, కానీ ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రాజెక్టుల్లో సరిపడ జలాలు లేవని, ప్రస్తుతం జూరాలలో ఉన్న 7 టిఎంసిలు ప్రస్తుతం కర్ణాటక నుంచి విడుదల చేస్తున్న జలాలు, ఇతర వరదలతో కలుపుకున్నా ఉన్న నీటిని జాగ్రత్తగా అవసరానికి అనుగుణంగా వాడుకుంటే వానకాలం పంటతో పాటు తాగు నీటి అవసరాలు తీర్చుకోవచ్చని అధికారులకు సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో జమ్మూ, సిల్టింగ్ తొలగించడానికి ఇతర నిర్మాణాల ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. వాన కాలంలో రైతులు వేసిన పంటలను కాపాడు కోవడానికి ముందుగానే కర్ణాటక ముఖ్యమంత్రికి నీటి విడుదలపై ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని కానీ అసెంబ్లీ కారణంగా రెండు రోజులు ఆలస్యం అయ్యిందని, అంతలోపే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయని చెప్పారు. కర్ణాటక నుంచి కృష్ణజలాలను జూరాలకు విడుదల చేసేలా జిల్లా మంత్రులు రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించిన వెంటనే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో మాట్లాడగా ఉమ్మడి జిల్లా శాసనసభ్యులు కర్ణాటక వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి తో నీటి విడుదలపై మాట్లాడగా వెంటనే అధికారులతో చెప్పి నీటిని విడుదల చేయడం జరిగింది అన్నారు. వానకాలం పంటను కాపాడుకోవడానికి నవంబర్ 27 వరకు వారాబంధి విధానంలో నీటిని విడుదల చేస్తేనే పంటను కాపాడుకోవచ్చు. కాబట్టి రైతులు సహకరించి వారాబంధి విధానాన్ని పకడ్బందీగా అమలు చేసే సహకరించాలని సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, సాగునీటి రంగానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కోరిన వెంటనే రాష్ట్రానికి నీరు విడుదల చేసేందుకు అంగీకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి మాట్లాడుతూ అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడి నీటిని విడుదల చేసేనందుకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఉన్న వానకాలం పంటను కాపాడుకుంటూనే తాగునీటికి ఇబ్బందులు రాకుండా నీటిని జాగ్రత్తగా వాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. జూరాలలో నీళ్లు ఉన్నప్పటికీని సాగునీటి విడుదల చేయడం లేదని రైతులు అపోహ పడుతున్నారని, వాస్తవ పరిస్థితులను రైతులకు తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వనపర్తి తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు వేసిన పంటలు ఒక ఎకరం కూడా ఎండిపోకూడదని లక్ష్యంతో కర్ణాటక ముఖ్యమంత్రికి ఉమ్మడి జిల్లా శాసనసభ్యుల బృందం మాట్లాడి కృష్ణా నీటిని జూరాలకు విడుదల చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటిని, కర్ణాటక నుండి వచ్చే నీటిని చాలా జాగ్రత్తగా అవసరమైన చోటు మాత్రమే వాడుకునే విధంగా ఇరిగేషన్ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు జూరాల వద్ద రాద్ధాంతం చేయక రెండు రోజులు ముందే కర్ణాటక ముఖ్యమంత్రికి జూరాల కు నీటి విడుదలపై ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని అందులో భాగంగానే కర్ణాటక వెళ్లి ముఖ్యమంత్రితో మాట్లాడి కృష్ణ జలాలను జూరాలకు విడుదల చేయించడం జరిగిందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భీమ్యానాయక్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీత్ రెడ్డి, గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ రహీముద్దీన్, ఎస్ఈ చంద్రశేఖర్, వనపర్తి మున్సిపల్ ఛైర్ పర్సన్ మాధవి, వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన శ్రీనివాస్ గౌడ్, ఘన్పూర్ మార్కెట్ చైర్మన్ నవనీత, ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపుల విషయంలో రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌ను సవరించాలి

**బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్**



ప్రజాపక్షం/హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల విషయంలో రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌ను సవరించాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్ట్‌కు వెళ్లే అధికారం ఎవరికైనా ఉంటుందని, ఈ విషయాన్ని తప్పు పట్టలేమని, కానీ అసెంబ్లీ స్పీకర్ రెండున్నర సంవత్సరాలు పాటు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేసిన విధానాన్ని మాత్రం తప్పు పట్టక తప్పదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 10వ షెడ్యూల్‌లో ఉన్న లోసుగులను అడ్డం పెట్టుకుని ప్రజా ప్రతినిధులు ఆ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఒక రాజకీయ పార్టీ నుంచి గెలిచి,ఆ తర్వాత మరో రాజకీయ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, 10వ షెడ్యూల్‌లో చర్యలపై నిర్ణీత గడువు విధించకపోవడంతో ఇష్టారీతిన అసెంబ్లీ స్పీకర్స్ సమయం తీసుకుంటున్నారని వివరించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో అసెంబ్లీ స్పీకర్ చాలా సమయం తీసుకున్నారని, ఈ అంశంపై దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు కాలం వృథా అయిందని, 10వ షెడ్యూల్‌లో నిర్ణీత గడువు కాలం పొందుపర్చి ఉంటే, ఇంత సమయం పట్టేది కాదని తక్షణమే చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండేదని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు.

## మాజీ సైనికుడి ఇంట్లో 14 మద్యం బాటిళ్లు స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఘట్‌కేసర్‌లోని లక్ష్మీ నగర్ ప్రాంతంలో మాజీ సైనిక ఉద్యోగి బైరు వెంకటేశ్వర్లు ఇంటిపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కోటా కింద వచ్చిన మద్యం బాటిళ్లను ఇతరులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు ఈ దాడి నిర్వహించినట్లు తెలిసింది. ట్రైనీ ఎఇఎస్ ముస్తఫా సిద్ధిక్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేశ్వర్లు ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 14 మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పాటు వెంకటేశ్వర్లును ఘట్‌కేసర్ ఎక్సైజ్ సిఐ ప్రసాద్‌కు అప్పగించారు. ఘటనపై ఎక్సైజ్ అధికారులు తదుపరి చర్యలు చేపడుతున్నారు.

## నేడు వరంగల్ ఐఒడిసిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర మంత్రి దానసరి అనసూయ సీతక్క నేడు సమీక్ష నిర్వహించనున్నారు. ఈ ప్రాంతీయ సమీక్షా సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు వరంగల్ ఐఓడిసిలో జరగనుంది. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు 'అక్టోబర్ 2026 నుండి జూన్ 2027' వరకు గ్రామస్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు నివారణ చర్యలు, తగిన కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. దీంతో పాటు గ్రామ పంచాయతీ భవనాలు, విఓ భవనాలు, అంగన్‌వాడి భవనాలు తదితర నిర్మాణ పనుల పురోగతి, వాటి ప్రస్తుత స్థితి, మిగిలిన పనులను త్వరితిగతిన పూర్తి చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించనున్నారు. హ్యామ్ రహదారుల నిర్మాణ పనుల పురోగతితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరా పరిస్థితి, పెండింగ్ పనులు, భవిష్యత్ ప్రణాళికలపై కూడా మంత్రి విస్తృతంగా చర్చించనున్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఈఎన్‌సిలు, ఇంజనీరింగ్ అధికారులు, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, జెడిపి సిఈఓలు, డిఆర్‌డిఓలు, డిపిఓలు, ఈఈలు తదితర రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొననున్నారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు తమ శాఖల వారీగా తాజా గణాంకాలు, పురోగతి నివేదికలు, పెండింగ్ పనుల పూర్తికి సంబంధించిన కార్యాచరణ నివేదికలతో సిద్ధంగా రావాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్ ఆదేశించారు.

## ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల్లో నెల రోజుల్లో ఫైర్ సేఫ్టీ ఆడిట్ పూర్తి చేయాలి

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో నెల రోజుల్లో ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్లను పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆడిట్లలో గుర్తించే లోపాలను కేవలం నివేదికలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితిలోపు వాటిని సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు. హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీకి సంబంధించి అన్ని అంశాలను కవర్ చేసేలా సమగ్ర గైడ్‌లైన్స్, స్టాండర్డ్ చెక్‌లిస్ట్‌తో ప్రత్యేక జీవో జారీకి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలో నిబంధనల ప్రకారం ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను అమలు జరిగేలా సమన్వయంతో పర్యవేక్షించాలని సూచించారు. ప్రైవేట్ హాస్పిటళ్లలో రోగుల భద్రతకు సంబంధించిన ప్రమాణాల అమలులో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, స్ట్రక్చరల్ సేఫ్టీపై మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరా రాజనర్సింహ మాట్లాడుతూ ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీకి సంబంధించిన అంశాలపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆడిట్ నిర్వహించాలని, భవనాల నిర్మాణ పటిష్టతకు సంబంధించి సంవత్సరానికి ఒకసారి స్ట్రక్చరల్ ఆడిట్ నిర్వహించే విధంగా విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. ఆడిట్‌లో గుర్తించిన లోపాల తీవ్రతను బట్టి వాటిని అత్యవసర, తక్షణ, సాధారణ కేటగిరీలుగా విభజించి పరిష్కరించాలన్నారు. ప్రాణాపాయానికి దారితీసే లోపాలను ఎలాంటి జాప్యం లేకుండా సరిదిద్దాలన్నారు. హాస్పిటల్లోని ప్రాంతాలను సెన్సిటివ్, నాన్‌సెన్సిటివ్ జోన్లుగా విభజించి ఫైర్ సేఫ్టీ ప్రోటోకాల్స్‌ను అమలు చేయాలని సూచించారు. ఐసియులు, ఆపరేషన్ థియేటర్లు, ఎస్‌ఎన్‌సియూ, ఎన్ఐసియూలు, రేడియాలజీడ్ దయాగ్నసిస్ విభాగాలు, డయాలసిస్ జోన్లు, ఎమర్జెన్సీ విభాగాలు, క్రిటికల్ కేర్ ప్రాంతాలను సెన్సిటివ్ జోన్లుగా గుర్తించి ప్రత్యేక భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో ఉన్న రోగులను అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక ఎమర్జెన్సీ ఎవాక్యుయేషన్ ప్లాన్ సిద్ధంగా ఉండాలన్నారు. హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ పరికరాల నిర్వహణ నిమ్మితం ప్రత్యేక బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

**జిల్లా స్థాయిలోమల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీలు..**

ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, స్ట్రక్చరల్ సేఫ్టీ అంశాలపై జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ కమిటీలో ఆరోగ్యశాఖ, విద్యుత్ , ఫైర్‌సేఫ్టీ, ఆర్ అండ్ బి శాఖలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులను కమిటీ సభ్యులుగా చేర్చాలని సూచించారు. జిల్లా స్థాయిలో డిఎంహెచ్‌ఓ, ఎస్ఈ, డిఎఫ్ఓ తదితర సంబంధిత అధికారులు ఈ కమిటీలో భాగస్వాములై హాస్పిటళ్లను క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఆడిట్లు, తనిఖీలను పర్యవేక్షించేందుకు ఆరోగ్యశాఖ మంత్రి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీకి సంబంధించిన పరిస్థితి, ఆడిట్ల పురోగతి, గుర్తించిన లోపాలు, వాటి పరిష్కారం, అత్యవసర అవసరాలకు సంబంధించిన నివేదికలను ఈ కమిటీ సమీక్షించేలా వ్యవస్థను రూపొందించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టియన జెడ్ చొంగ్తు, అగ్నిమాపక డిజి విక్రమ్ సింగ్ మాన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేశ్ పాటిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## థర్మల్ పవర్ ప్లాంట్ల పేరుతో బిఆర్‌ఎస్ అవినీతి

**ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి**




ప్రజాపక్షం/హైదరాబాద్: గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పవర్ ప్లాంట్ల పేరుతో అవినీతికి పాల్పడి, ఇప్పుడు అదే ప్లాంట్ల వద్దకు వెళ్లి గగ్గోలు పెడుతున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గు సరఫరాకు గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చామని తెలిపారు. విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్లు దండుకున్నారని, సింగరేణిలో కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ హయాంలో 18 గనులు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పెంచడంతో పాటు కొత్త గనులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సింగరేణి బొగ్గులో దాదాపు 90 శాతం తెలంగాణ అవసరాలకే వినియోగిస్తున్నామని, సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల్లో 36 లక్షల టన్నులు రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఉపయోగిస్తున్నామని చామల తెలిపారు. బిఆర్‌ఎస్ హయాంలో సింగరేణికి రూ.35 వేల కోట్ల బకాయిలు పెట్టారని, కాళేశ్వరానికి రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ప్రయోజనం దక్కలేదని విమర్శించారు.బిఆర్‌ఎస్ చేసిన అప్పులకు ప్రతి నెలా సుమారు రూ.8 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని, 10ఏళ్ల పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని చామల ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని కూడా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఉచిత విద్యుత్ పథకం కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్నారు.కెటిఆర్ ఏం చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చామల అన్నారు. కెటిఆర్ సిఎం కావాలనే కలలు కంటున్నారని, ప్రజలు కాంగ్రెస్‌కు ఐదేళ్ల పాలనా బాధ్యత ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు భయపడదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులను గౌరవిస్తామని, అయితే పార్టీ ఫిరాయింపుల విషయంలో అన్ని పార్టీల గత చరిత్రను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

## దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవిపై 'సుప్రీం' తీర్పు రాజ్యాంగ నైతికతకు, ప్రజాస్వామ్యానికి విజయం

**కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

ప్రజాపక్షం/హైదరాబాద్:ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతం రావు, వేముల అశోక్ స్వాగతించారు. చారిత్రాత్మక తీర్పు రాజ్యాంగ నైతికతకు, ప్రజాస్వామ్యానికి లభించిన విజయమని అభివర్ణించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలకు సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన గట్టి చెంపపెట్టు అని అన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి పక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని మంత్రులను చేసి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే, నేడు అధికార కాంగ్రెస్ అదే బాటలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని ఎంపిగా పోటీ చేయించిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైందని, అవకాశవాద, స్వార్థ రాజకీయాలకు నిలయమైన ఆ రెండు పార్టీలకు ఖైరతాబాద్ ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పి, బిజెపికి ఘనవిజయం కట్టబెట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి మారడం నైతికతకే మచ్చ బండి సంజయ్ అన్నారు. 'ఆయారామ్, గయారామ్' సంస్కృతిని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లకు ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ చేసే అర్హతే లేదన్నారు. ప్రజలంతా ఏకమై ఫిరాయింపు రాజకీయాలకు చరమగీతం పాడాలన్నారు. బిజెపి చేసిన సుదీర్ఘ రాజీలేని న్యాయపోరాటం వల్లే ఈ చారిత్రక విజయం సాధ్యమైందని రాంచందర్ రావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. చేతిలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని 'సంవిధాన్ బచావో' అని డ్రామాలు ఆడే రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డిలు ఈ తీర్పుతోనైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. దానం నాగేంద్ప తీర్పు వెలువడిన నేపథ్యంలో, కాంగ్రెస్‌లో చేరిన మిగతా 9 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కూడా స్పీకర్ తక్షణమే అనర్హత వేటు వేసి రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలని డాక్టర్ ఎన్. గౌతం రావు, వేముల అశోక్ డిమాండ్ చేశారు. రాబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటు రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు బిజెపి సిద్ధంగా ఉందన్నారు.

## రేవంత్‌రెడ్డికి నేడు 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు ప్రదానం

**బెస్ట్ పబ్లిక్ సర్వెంట్–2026గా సిఎం ఎంపిక**
**కేరళలోని నిలంబూర్‌లో అవార్డు ప్రధానోత్సవం**

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్–2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దివంగత కాంగ్రెస్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, బిసిలు, సామాన్య ప్రజల సంక్షేమానికి సిఎం చేపట్టిన కార్యక్రమాలు, ఆయన నాయకత్వాన్ని గుర్తిస్తూ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపిక కమిటీలో ఎంపి బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎపి అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ సభ్యులుగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువల పట్ల రేవంత్‌రెడ్డికి ఉన్న నిబద్ధతను జ్యూరీ ప్రశంసించినట్లు ఫౌండేషన్ తెలిపింది.ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు అవార్డు ప్రదానోత్సవం జరగనుంది. పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేయనున్నారు. కార్యక్రమంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేయనున్నారు.ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు మంత్రిగా సేవలందించారు. దూరదృష్టి కలిగిన నేతగా, సమర్థుడైన పాలకుడిగా, కార్మిక వర్గం కోసం పనిచేసిన నాయకుడిగా కేరళ ప్రజల్లో ఆయనకు గుర్తింపు ఉంది. నిజాయితీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు ప్రతీకగా ఆయన నిలిచిపోయారు.

## చేయూత పెన్షన్‌ల దరఖాస్తుల పరిశీలన గడువు పొడిగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో చేయూత సామాజిక భద్రత పెన్షన్‌ల కోసం నూతనంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన గడువును ప్రభుత్వం పొడిగించింది. ఇప్పటివరకు ఈనెల 25 వరకు ఉన్న ఈ గడువును ఈ నెల 30 వరకు పొడిగిస్తూ సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫీల్డ్ స్థాయి అధికారులు ఎస్ఐఆర్ విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర పాలనాపరమైన బాధ్యతల్లో నిమగ్నమై ఉండటంతో నిర్ణీత గడువులోగా దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయలేకపోతున్నామని అధికారుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పొడిగించిన గడువులోగా పూర్తి చేయాలని సెర్ప్ ఆదేశించింది. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం స్పష్టం చేసింది.

## గోబెల్స్ ప్రచారం చేస్తే వదిలిపెట్టబోం

**బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు**



ప్రజాపక్షం/హైదరాబాద్: తాను క్షుద్రపూజలు చేశానంటూ ఆరోపణలు చేసిన వారికి న్యాయస్థానం తగిన బుద్ధి చెబుతుందని, వారిపైన తగిన చర్యలు తీసుకుంటుందనే విశ్వాసం తమకు ఉన్నదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గోబెల్స్ ప్రచారం చేస్తే వదిలిపెట్టబోమని, ఎంతటి వారినైనా వదలమని, ఎంత దూరమైనా పోతామని, వారికి శిక్ష పడేదాక వదిలి పెట్టబోమని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్ట్ ప్రాంగణంలో హరీశ్‌రావు గురువారం మీడియాతో మాట్లాడారు.దానం నాగేందర్‌పైన అనర్హత వేటుకు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పు సిఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టులాంటిదన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న సిఎంకు ఇది గట్టి గుణపాఠంలాంటిదని అన్నారు. అధికారంలో చేతిలో ఉన్నదని తమకు ఇష్టంవచ్చినట్టు గా ప్రవర్తిస్తే కోర్టులు చూస్తూ ఊరుకోబోవన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ విలువలను కాలరాస్తుంటే, ప్రతిపక్షాలను వేధిస్తుంటే న్యాయస్థానాలు గట్టి బుద్ధి చెబుతున్నాయన్నారు. న్యాయ వ్యవస్థలపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా వస్తున్న తీర్పులను తాము స్వాగతిస్తున్నామన్నారు. దానం నాగేందర్‌తో పాటు పార్టీ ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేలతో కూడా రాజీనామా చేయించి, ప్రజాక్షేత్రంలోకి రావాలని సూచించారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చిందని చెప్పుకునే రాహుల్ గాంధీ, ఆ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం తప్పించుకుంటుందని, ప్రజా సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదిస్తుంటే సహించలేకపోతున్నారన్నారు. క్షుద్రపూజలు చేసినట్టు మహేష్ కుమార్ గౌడ్,అద్దంకి దయాకర్ అసత్య ప్రచారం చేస్తున్నారని,ఈ విషయంలో తాము దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు స్వీకరించిందన్నారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మాటలతో ప్రభుత్వం కాలం గడుపుతోందని, రాష్ట్రం తిరోగమనం దిశలో పయనిస్తోందని హరీశ్‌రావు అన్నారు.

## మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

### కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా యువతలో అవగాహన కల్పించుటకు కృషి చేస్తున్నామని తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ జగద్గిరిగుట్ట (శామీర్‌పేట) కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. గురువారం మహిళా డిగ్రీ కళాశాలలో మై భారత్ ఎన్‌ఎస్‌ఎస్ ఉస్మానియా విశ్వవిద్యాలయం సహకారంతో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్100 వారాల సంకల్ప్ అభియాన్ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ స్రవంతి, అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ గీతలు మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహారం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



## మెరుగైన వసతులు కల్పిస్తాం

### రూ.12.50 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని ప్రతి వార్డులో ప్రజలకు మెరుగైన కనీస మౌలిక వసతులు కల్పిస్తామని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని లక్ష్మాపూర్ 3వ వార్డులో రూ. 2.50, 5వ వార్డులో రూ. 2.50 లక్షలతోమంచినీటి పైప్‌లైన్, ఉద్దెమర్రిలోని 8, 9వ వార్డులో రూ. 5 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి, 21 వార్డులో రూ. 2.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులకు మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం చైర్మన్ జాం రవి మాట్లాడుతూ మున్సిపల్‌లోని అన్ని వార్డుల అభివృద్ధికి మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్లు రాజిగల్ల లతా భూపాల్, పెద్దిరెడ్డి శ్రీలత వెంకట్‌రెడ్డి, దోసకాయల లత వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## వినాయకులను దర్శించుకున్న టిపిసిసి మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి టిపిసిసి మహిపాల్‌రెడ్డి అలియాబాద్ మున్సిపల్‌లోని లాల్‌గడిమలక్‌పేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని జగ్గంగూడలోని వార్డు కార్యాలయాల్లో గణనాథులను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మంటప నిర్వాహకుల ఆహ్వానం మేరకు విచ్చేసిన టిపిసిసి మహిపాల్‌రెడ్డిని మంటప నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమఠం కృష్ణారెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రాంప్రసాద్‌గౌడ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

**శోభాయాత్రలో పాల్గొన్న జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్ లో ఇగ్నైట్ వింగ్స్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ శోభాయాత్రలో గణనాథుడి లడ్డూను తూంకుంట జగదీష్‌గౌడ్ రూ. 1.35 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మాజి సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, డివిజన్ నాయకులు నర్సింహారెడ్డి, బాలయ్య, ప్రవీణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ చర్లపల్లి జైలు ఖైదీ మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ గాంధీ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చర్లపల్లి జైలులో జీవిత ఖైదుగా శిక్ష అనుభవిస్తున్న నల్గొండ జిల్లా ప్యారసభాగ్ కాలనీకి చెందిన అబ్దుల్ బారీ(54) మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన అమృత, ప్రణయ్ హత్యకేసు లో ఏ4గా ఉన్న ఆయన మార్చి 2025 నుండి చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గుండె జబ్బు వ్యాధి గ్రస్తుడైన ఆయన నిమ్స్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడని, గురువారం గుండె నొప్పి రావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని జైలు అధికారులు తెలిపారు.

## తాండూరులో వరుస చోరీలు..

### సూపర్ మార్కెట్‌లో రూ1.25లక్షల నగదు అపహరణ

**ప్రజాపక్షం/తాండూరు:** వరుస బెట్టి చోరీలకు దిగుతున్న దోపిడీదారులు ఇటు ప్రజలకు, అటు పోలీసులకు కునుకు లేకుండా చేస్తున్నారు. పది రోజుల వ్యవధిలో తాండూరు సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడో ఒక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. తాజాగా యాలాల మండల పరిధి లక్ష్మి నారాయణపూర్ చౌరస్తాలోని సూపర్ మార్కెట్‌లోకి దూరిన దోపిడీ దొంగలు ఏకంగా రూ.1.25లక్షల నగదును ఎత్తుకెళ్ళిన ఘటన గురువారం వెలుగు చూసింది. గురువారం ఉదయం సూపర్ మార్కెట్‌కు వెళ్ళిన యజమానులు షెట్టరు తాళాలు విరగగొట్టి ఉండడంతో ఒక్కసారిగా ఖంగు తిన్నారు. సూపర్ మార్కెట్లోకి దూరి చోరీకి పాల్పడిన దోపిడీ దారుల దృశ్యాలు సిసి కెమెరాలో నమోదయ్యాయి. సమాచారాన్ని అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. సిసి ఫుటేజీ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేస్తామని తెలిపారు. ఇప్పటికైన పోలీసులు రాత్రి వేళలో గస్తీ పెంచి ప్రజలకు భద్రత కల్పించడం తో పాటు దొంగల ఆటకట్టించాని ప్రజలు కోరుతున్నారు.

# పెండింగ్ ఫైళ్ల పరిష్కారానికి వేగం పెంచాలి

### ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్‌ల వారీగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ల (ఎసిపి) వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తులను పరిశీలించారు. అలాగే చీఫ్ సిటీ ప్లానర్ (సిసిపి), అదనపు చీఫ్ సిటీ ప్లానర్‌ల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పురోగతిపై కూడా సమీక్షించారు.

చాలా రోజులుగా ఫైళ్లను పెండింగ్‌లో ఉంచుతున్న అధికారుల తీరుపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువు లోగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటూ తదుపరి స్థాయికి పంపించాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన సేవల్లో అనవసర జాప్యాన్ని నివారించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాల ని ఆదేశించారు. బిల్డింగ్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల దరఖాస్తుల పరిశీలనలో లోపా లు లేదా షార్ట్‌ఫాల్స్ గుర్తించినప్పుడు వాటన్నింటిని ఒకేసారి దరఖాస్తుదారులకు తెలియజేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.

ఒక్కోసారి ఒక్కో లోపాన్ని తెలియజేస్తూ దరఖాస్తుదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. పారదర్శకతతో, స్పష్టమైన సమాచారంతో సేవలు అందించాలని అధికారులకు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపైనా కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఫీజు చెల్లింపునకు సంబంధించి సమాచారం అందిన దరఖాస్తుదారులు నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫీజు చెల్లించిన దరఖాస్తులను తదుపరి దశల్లో ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.

ప్రజలకు అవసరమైన బిల్డింగ్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, ఎల్ఆర్ఎస్ వంటి సేవలను వేగంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. పెండింగ్ ఫైళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమా ర్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్(ఎల్ఏఓ) సరితరెడ్డి, ఎసిపిలు నరేష్, భాగ్యలక్ష్మి , రాంరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలి

### స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య




**ప్రజాపక్షం/నవాబుపేట:** నవాబుపేట్ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ అనూరాధ ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై వివిధ శాఖల పనితీరు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి జ్యోతి మాట్లాడుతూ, రైతులు ఈ నెలాఖరులోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన రైతులకు ఎరువుల బుకింగ్, కొనుగోలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.


**విద్యుత్ సమస్యపై ఆగ్రహం :** పలు గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫ రా నిలిచిపోతోందని సర్పంచులు ఎమ్మెల్యే దృష్టి కి తీసుకురాగా, విద్యుత్ ఎఇ శ్రీకాంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆగ్రహం వ్యక్తం చేశా రు. వారంలోగా సమస్యను పరిష్కరించి, ఇకపై పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎంఈఓ అబ్దుల్ రెహమాన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, విధులకు సక్రమంగా హాజరై బాధ్యతగా పనిచేయాలని సూచించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీవో లక్ష్మీదేవి సూచించారు. కుమ్మరిగూడ చెరువు కబ్జాపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి కోరగా, గుబ్బడి ఫత్తేపూర్ స్మశానవాటిక పనులు పూర్తి కాకుండానే బిల్లులు ఎలా చెల్లించారని సర్పంచ్ మేకల సాయన్న అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, మండలంలోని రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పాటు అన్ని గ్రామాలకు లింక్ రోడ్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. సర్పంచులు పార్టీల కతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రత్యేకాధికారి కవిత, ఎఎంసి చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, ఎంపిడిఒ అనురాధ, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొండల్ యాదవ్, సర్పంచులు స్థానిక సర్పంచ్ నర్సింహారెడ్డి, అనసూయ అనంతరాములు, దీపిక దశరథ్, శివనీల లక్ష్మణ్, రేణుక రాములు, దుర్గయ్య,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థంగా సేవలందించడమే కర్తవ్యం

### నిజాంపేట్ సర్కిల్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్



**ప్రజాపక్షం/నిజాంపేట్:** ప్రజలకు నిస్వార్థంగా సేవలందించడమే నా కర్తవ్యమని నిజాంపేట్ సర్కిల్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు వాకలపూడి రంగరాయ ప్రసాద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లో బిఆర్‌ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.





బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేశ్ ముదిరాజ్‌లు రంగరాయ ప్రసాద్ నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. నిజాంపేట్‌లో పలు కాలనీల్లోని పార్కులలో రంగరాయ ప్రసాద్ మొక్కలను నాటారు. ప్రగతినగర్ కమాన్ వద్ద గల స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాచుపల్లిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన మాజీ కార్పొరేటర్‌లు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. భారీ క్రేన్‌తో గజమాలలను తీసుకువచ్చి రంగరాయ ప్రసాద్‌ని సత్కరించిన పార్టీ కార్యకర్తలు పుట్టిన రోజు కేక్‌ని కట్ చేయించారు. ఈ సందర్భంగా రంగరాయ ప్రసాద్ మాట్లాడుతూ దేశం కోసం నిరంతరాయంగా విధుల్లో ఏ రకంగా నిస్వార్థంగా పనిచేశామో తదనంతరం ప్రజల మధ్య వచ్చామని అన్నారు. ప్రజలకు నిజమైన, నిజాయితీతో పనిచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. నిరుపేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటూ ప్రజలకు సేవలందిస్తానని అన్నారు. తన పై ఇంతగా ఆదరాభిమానాలను చూపిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలను తెలిపారు. తన జీవిత కాలం పాటు పేదల పక్షాన నిలబడుతూ, పార్టీకి నిస్వార్థంగా సేవలందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దన్‌రాజ్, మాజీ ఎంపిటిసిలు బొర్ర చందు ముదిరాజ్, నందిగామ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్‌లు బాలాజీ నాయక్, వాకలపూడి రవి కిరణ్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీమ్, పెద్దఎత్తున కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.




## పేద కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ ఆపన్న హస్తం

### బండి రమేష్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** పేద కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ ఆపన్నహస్తం అని బండి రమేష్ అన్నారు. గురువారం కూకట్‌పల్లి శ్రీ హేమదుర్గా భవన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఏవీబీపురం ప్రాంతానికి చెందిన లక్ష్మి కి రూ. 43వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అందేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, మస్తాన్‌రెడ్డి, రంగామోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం ఏర్పాటు

### సర్వే నంబర్లను పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** గబ్బిలాల పేటలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించేందుకు గాను స్థలాన్ని పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, గురువారం కాప్రా మండలం లోని గబ్బిలాల పేటలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ, ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూలు లోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. అధార్ లేని పిల్లలకు ఆధార్



క్యాంప్ నిర్వహించి ఆధార్ అందించాలని కాప్రా తహసీల్దారును ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం నూతన భవనాన్ని నిర్మించేందుకు స్థల సేకరణ నిమిత్తం స్థల వివరాలను తహసీల్దారును అడిగి తెలుసుకున్నారు. గబ్బిలాల పేట లోని సర్వే నంబర్లు 285, 299, 300, 185 లలో అందుబాటులో ఉన్న స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సర్వే నంబర్లలో ఏమైనా భూ సమస్యలు, కోర్టు కేసులు ఉన్నాయా అనే వివరాలను తకు నివేదిక పంపాలని తహసీల్దారుకు సూచించారు. స్థానికులు 300 లేదా 185 సర్వే నంబర్లలలో నిర్మిస్తే అందరికి అందుబాటులో ఉంటుందని కోరాగా, పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా విద్యాశాఖ వారు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాడానికి ముందుగానే అనుమతించడం జరిగిందని వివరించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, కాప్రా మండల తహసీల్దార్ మతిన్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎలాంటి అవాంతరాలు లేకుండా గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు

### అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నేపథ్యంలో ఎన్‌టిఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పరిశీలించారు. గోల్కొండ, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్లు బి.సంతోష్, ఉదయ్ కుమార్, జిహెచ్‌ఎంసి అధికారులు, అదనపు కమిషనర్ (పారిశుధ్యం)ఎన్.రవి కిరణ్‌లతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు. నేడు జరగనున్న గణేశ్ నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. భక్తులు, శోభాయాత్రల్లో పాల్గొనే వారికి అవసరమైన సౌకర్యాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన సమయంలో, అనంతరం పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య బృందాలు నిరంతరం పనిచేస్తూ నిమజ్జనానికి సంబంధించిన వ్యర్థాలు, చెత్తను వెంటనే తొలగించాలన్నారు. ఊరేగింపు మార్గాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పరిశుభ్రతను కాపాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు.



## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి, హరిత వనం కాలనీలో మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డితో కలిసి హన్మంత రెడ్డి రూ.50లక్షలతో సిమెంటు రోడ్డుని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎంసి నిధులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతనే కాలనీలు, బస్తీల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే బాధ్యతగా తాము పనిచేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని అన్నారు. కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి కాలనీల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలను జీవన్ రెడ్డి, నాయకులు సయ్యద్ షఫి, సందీప్ వర్మ, సురేష్ నాయుడు, శివకృష్ణ, విక్రమ్ రెడ్డి, నవరాజు, తదితరులు పాల్గొన్నారు.



## స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిల్స్ అందజేత

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ నివాసులు కీ.శే.శ్రీమతి మునిగాల మమత ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి మామ మునిగాల శ్రీనివాస్, కుటుంబ సభ్యులు గురువారం రోజు బౌరంపేట్ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్ ను కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండి, ఆరోగ్యానికి మేలు చేసే స్టీల్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రాంరెడ్డి మునిగాల కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు పల్లునూరి విష్ణువర్ధన్ రెడ్డి, కోలా రవీందర్, కుటుంబసభ్య లు, సప్తగిరి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో రాణించడం అభినందనీయం : ప్రిన్సిపల్ డి.అపర్ణ

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సీఆర్పీఎఫ్ విద్యార్థులు రాణించడం అభినందనీయని, చదువుతోపాటు పాటు క్రీడాల్లో బాలబాలికలు నైపుణ్యం సాధించాలని ప్రిన్సిపల్ డి.అపర్ణ పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు చంద్రపురి కాలనీ డివిజన్ అరుంధతినగర్ సీఆర్పీఎఫ్ క్యాంపస్ ఆవరణలో గురువారం ప్రిన్సిపల్ అపర్ణ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే మంచి భవిష్యత్తును ఎంచుకొని ముందుగు సాగాలని, ఆధుని కకాలంలో ఫోన్లకు స్వస్థిపలుకుతూ క్రీడామైదానంలోకి అడుగుపెట్టాలని అన్నారు. సీఆర్పీఎఫ్ పాఠశాల క్రమశిక్షణకు నిలయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ క్రీడా పాఠశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో 4 బంగారు, వెండి, 2కాంస్య బహుమతులు, స్కూల్ క్రీడా ఫడరేషన్లో 2 బంగారు, 2సిల్వర్, 1 బ్రోజీ బహుమతులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్, అశాజీ కుమార్, ఫిజకల్ డైరెక్టర్లు రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, మన్మదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ ఫెస్టివ్ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి.

రీల్



## 'దీపు' గా కృతి శెట్టి

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ ఫెస్టివ్ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఇంట్రెస్టింగ్ ట్యాగ్లైన్‌తో వస్తున్న ఈ చిత్ర టైటిల్‌ను మేకర్స్ ఇటీవల హిలేరియస్, ఎంటర్టైనింగ్ వీడియో ద్వారా ప్రకటించారు. దీంతో సినిమాపై బజ్ మరింత పెరిగింది.ఇప్పటికే వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్స్‌ను పరిచయం చేసిన మేకర్స్ కృతి శెట్టి 'దీపు' గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కృతి శెట్టి ట్రెడిషనల్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. పర్పుల్‌పింక్ కలర్ హాఫ్ సారీలో అందంగా కనిపించారు. ఆమె ఆహ్లాదకరమైన చిరునవ్వు ఈ ఫస్ట్ లుక్కు మరింత చార్మ్, ఎలిగెన్స్‌ను తీసుకొచ్చింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్, ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌కు తోడు కీర్తి సురేష్, కృతి శెట్టి లాంటి స్టార్స్ ఉండటంతో ఈ చిత్రం ఫెస్టివల్ సీజన్‌లో ఫుల్ ఎంటర్ టైనింగ్‌గా ఉండబోతోంది.ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ చిత్రానికి సంగీతం: జివి ప్రకాష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ కృష్ణ, సినిమాటోగ్రాఫర్: సమీర్ రెడ్డి, ఎడిటర్: తమ్మిరాజు.




## 'లవ్ అండ్ వార్' ఫస్ట్ లుక్ రిలీజ్

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ వంటి ముగ్గురు స్టార్ హీరోహీరోయిన్లు కలిసి నటిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.తాజాగా ఈ సినిమాకు సంబంధించిన రణ్బీర్ కపూర్ ఫస్ట్ లుక్కు మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రణ్బీర్ పూర్తిగా కొత్త లుక్లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. సంజయ్ లీలా భన్సాలీ సినిమాల్లో కనిపించే గ్రాండ్ విజువల్స్, రిచ్నెస్ ఈ పోస్టర్‌లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. రణ్బీర్ ఇప్పటివరకు కనిపించని కొత్త అవతార్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌కు జత చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా విజువల్స్‌కు అద్భుతంగా సరిపోయింది. సంగీతం విషయంలో భన్సాలీ మార్క్ మరోసారి కనిపించింది.ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసిన మేకర్స్ వోహ్ రుత్బా, వోహ్ రౌబ్, వోహ్ జునూన్! అంటూ క్యాప్షన్ ఇచ్చారు. 'లవ్ అండ్ వార్' చిత్రం 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రణ్బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు.

## 'గ్లాడియేటర్స్ ఇన్ పర్స్యూట్ ఆఫ్ ఛాలెంజెస్' ట్రైలర్ విడుదల



ప్యాషన్, పట్టుదల, సవాళ్లను నిరంతరం ఎదుర్కొనే తపనతో సాగిన నటుడు, రేసింగ్ డ్రైవర్ అజిత్ కుమార్ అసాధారణ మోటార్‌స్పోర్ట్‌ను జర్నీని ఆవిష్కరించే డాక్యుమెంటరీ 'గ్లాడియేటర్స్ ఇన్ పర్స్యూట్ ఆఫ్ ఛాలెంజెస్' ట్రైలర్ విడుదలైంది. రేసర్ వెనుక ఉన్న అజిత్ కుమార్‌కు మరింత దగ్గరగా పరిచయం చేస్తూ ఈ ట్రైలర్ సాగుతుంది.ఇప్పటివరకు లేని విధంగా 'గ్లాడియేటర్స్' ట్రైలర్‌ను తొలిసారిగా నేరుగా థియేటర్లలో విడుదల చేశారు. డిజిటల్ రిలీజ్‌కు ముందే బిగ్ స్క్రీన్‌పై ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే మేకర్స్ నిర్ణయానికి థియేటర్లలో భారీ స్పందన లభించింది. తమ అభిమాన స్టార్‌ను స్క్రీన్‌పై చూసిన ప్రతిసారీ అభిమానులు సందడి చేశారు. అజిత్ కుమార్ అభిమానుల సందడి థియేటర్లలో మార్మోగింది. సినిమాల్లో ఎప్పుడూ చూసే తమ ఫేవరెట్ స్టార్‌ను పూర్తిగా భిన్నమైన అవతార్‌లో.. స్పీడ్, ఛాలెంజెస్‌పై తిరుగులేని ప్యాషన్‌తో రేసర్‌గా చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.విజయ్ దర్శకత్వం వహించిన 'గ్లాడియేటర్స్' కేవలం రేస్ట్రాక్ గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా.. మోటార్‌స్పోర్ట్‌ను అజిత్ కుమార్‌కు ఉన్న ప్యాషన్, ఆయన స్వీకరించిన సవాళ్లు, ఎదుర్కొన్న రిస్కులు, తన అవసరమైన డిసిప్లిన్‌ను ఆవిష్కరిస్తుంది. ట్రైలర్‌లో అత్యంత ఎమోషనల్ అంశాల్లో ఒకటి షాలిని అజిత్ కుమార్, వారి పిల్లలు అనౌష్క, ఆద్విక్ పంచుకున్న అభిప్రాయాలు. ఈ డాక్యుమెంటరీకి విజయ్ దర్శకత్వం వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గోల్డెన్ ట్రోఫీ ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై షాలిని అజిత్ కుమార్ నిర్మిస్తున్నారు.ఈ చిత్రం నవంబర్ 19న విడుదలకు సిద్ధం అవుతుంది.

## దారి తప్పిన 'ది ప్యారడైజ్'

రివ్యూ



సవారీ జాతి కథ 'ది ప్యారడైజ్' అని చెప్పాడు బాగానే ఉంది కానీ ఈ సవారీ జాతి పోరాటం ఎప్పుడు జరిగింది ? ఏ కాలంలో జరిగింది ? అనేది మాత్రం మూడు గంటల సినిమాలో ఎక్కడా చెప్పలేదు . సవారీ జాతి వాళ్ళు ఏ ''గుర్తింపు'' (ఐడెంటిటీ) కోసమైతే ఏళ్ళ తరబడి పోరాటం చేస్తున్నారో ఆ 'గుర్తింపు' అప్పటి ఎమ్మెల్యే కేసీఆర్ నాయకత్వంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్వయంగా సవారీ జాతి వాళ్ళ దగ్గరికి వచ్చి గుర్తింపు ఇచ్చినట్టు చూపించాడు. కానీ ఇది ఏ కాలంలో జరిగింది అనేది మాత్రం సినిమాలో ఎక్కడా చెప్పలేదు. ఎన్టీఆర్ , కేసీఆర్ లను స్క్రీన్ మీద చూసి ఆశ్చర్యపోవలసి వచ్చింది. ఒక చరిత్ర గురించి కానీ లేదా ఒక జాతి గురించి కానీ చెప్పాలనుకున్నప్పుడు ఆ చరిత్ర ఎప్పుడు జరిగింది? ఏ కాలంలో జరిగింది అనేది ఖచ్చితంగా సినిమా ప్రారంభంలోనే చెప్పాలి. అప్పుడే ప్రేక్షకుడికి ఆ కథమీద ఆసక్తి ఉంటుంది. ఒక జాతి గుర్తింపు కోసం జరిగిన హోరాహోరీ పోరాటంలో చివరికి ఆ జాతి నాయకుడే గెలిచినపుడు ఆ జాతికి గుర్తింపు రాకుండా అడ్డుకున్న విలన్ ను ఖచ్చితంగా ఈ జాతి నాయుడు చంపెయ్యాలి. అప్పుడే కథకు న్యాయం జరుగుతుంది. సినిమా చూసిన ప్రేక్షకుడు శభాష్ అనుకుంటాడు. కానీ 'ది ప్యారడైజ్' సినిమాలో అలా జరగలేదు. తన తల్లి మొదలు పెట్టిన పోరాటం కొడుకు పూర్తి చేసినప్పుడు దుర్మార్గుడైన విలన్ ను ఖచ్చితంగా అంతం చేస్తేనే కథకు న్యాయం జరుగుతుంది.

**కథ**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో కలిసిన ఒక సంస్థాన్ 'ది ప్యారడైజ్'. ఈ ప్యారడైజ్ ప్రాంతాన్ని మాలిక్ (మోహన్ బాబు ) అనే అతను పాలిస్తుంటాడు. ఇక్కడ మాలిక్ చెప్పిందే వేదం. ఇదే ప్రాంతంలో బానిసలుగా నివసిస్తున్న 'సవారీ'జాతి దేశంలో 'గుర్తింపు' కోసం పోరాటం చేస్తోంది. సమ్మక్క (హీరో తల్లి) మొదలు పెట్టిన ఈ జాతి గుర్తింపు పోరాటం చివరికి కొడుకు (హీరో నాని) ఎలా ముగించాడు అనేది కథ. ఇందులో నాని పాత్ర పేరు కేవలం 'జడల్' అని మాత్రమే చూపిస్తాడు. క్లైమాక్స్‌లో ఈ 'జడల్' అసలు పేరు రివీల్ చేశాడు. చివరికి ఈ సవారీ జాతి వాళ్లకు గుర్తింపు ఎలా లభించింది? ఏం జరిగింది? హీరో నాని రెండు జడలు ఎందుకు వేసుకున్నాడు అనేదే తెలుసుకోవాలంటే ప్యారడైజ్ సినిమా చూడాలసిందే. ఇక్కడ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఎంచుకున్న కథ మంచిదే. కానీ ఈ కథను నడిపించిన విధానం బాగాలేదు. సినిమా చూస్తున్నంత సేపు కథను కాకుండా హింసను నమ్ముకున్నట్టు కనిపిస్తుంది. నరకడాలు, మనుషులను కోసేయ్యడాలు చాలా దారుణంగా చూపించారు. సినిమా మొత్తం వర్షం పడుతూనే ఉంటుంది ... కొన్ని సన్నివేశాల్లో తప్ప. సినిమా ప్రారంభంలోనే చనిపోయిన ప్రముఖుల ఫోటోలకు నివాళి అర్పించిన శ్రీకాంత్ ఓదెల ప్రజా యుద్ధ నౌక గద్దర్ పాడిన 'పొడుస్తున్న పొద్దుమీద' పాటను కొన్ని సెకండ్ల పాటు చూపిస్తాడు. కేసీఆర్ పాత్ర క్లైమాక్స్ లో వస్తుంది. ఈ పాత్రను ప్రియదర్శి (బలగం ఫేమ్ ) ప్రియదర్శి పోషించాడు. కేసీఆర్ పాత్రను తీర్చిదిద్దడం మాత్రం సూపర్ అని చెప్పవచ్చు. ''చావు నోట్లో తల పెట్టి వచ్చిన ' వంటి కేసీఆర్ డైలాగులు కూడా ఉన్నాయి. కేసీఆర్ పాత్రను అచ్చు గుద్దినట్టు మేకప్ చేసిన మేకప్ మెన్ కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. హీరోయిన్ కయాదు లోహర్ అందాలను అద్భుతంగా ప్రదర్శించింది. ఒక సి గ్రేడ్ హీరోయిన్ గా సూపర్ పర్ఫార్మెన్స్ చేసింది.కానీ హీరోయిన్ చేసిన ఒక పనిని ప్రేక్షకులందరూ ఛీ కొడుతున్నారు. 'ఆయా షేర్', 'ఏష నాగుల ' రెండు పాటలు కూడా బాగానే ఉన్నప్పటికీ ఈ రెండు పాటలు కూడా యూట్యూబ్ లో ఆల్ రెడీ జనాలు చూసేశారు కాబట్టి థియేటర్ లో పెద్దగా మీ అనిపించదు. అంతేకాదు విమలక్క పాడిన 'కొడుకా' అనే పాటను కూడా శ్రీకాంత్ ఇందులో పెట్టాడు. హీరోయిన్ కీర్తి సురేష్ కేవలం ఒక్క ఏష నాగుల పాట మీద తప్ప ఎక్కడా కనిపించదు. నిజానికి ఏష నాగుల పాటమీద డ్యాన్స్ కూడా పెద్దగా ఆసక్తి కరంగా లేదు. అయితే ఇక్కడ కథలో భాగంగా ప్రముఖ విప్లవ గాయని విమలక్క పాడిన పాత పాట 'కొడుకా' అనే పాట పెట్టాడు దర్శకుడు. ఫస్టాఫ్ లో కొన్ని యాక్షన్ సన్నివేశాలు , సెకండ్ ఆఫ్ లో కొన్ని యాక్షన్ సన్నివేశాలను తగ్గించుకుంటే సినిమా బాగానే అనే ఉంటుంది. మాటల రచయితలు డైలాగులు చాలా బాగా రాశారు కానీ నాని చెప్పే డైలాగులు చాలా వరకు అర్థం కావడం లేదు.ఇక అనిరుద్ రీ రికార్డింగ్ ఏమి గొప్పగా లేదు. బ్లాక్ బస్టర్ అవుతుందనుకుని థియేటర్ కు వెళ్లిన ప్రేక్షకుడికి మాత్రం నిరాశే మిగులుతుంది.

## 'మత్స్య' గ్లింప్స్ రిలీజ్



హీరో వివస్వాన్ నటిస్తున్న అడ్వెంచర్ ఫిలిం 'మత్స్య'. ఈ చిత్రాన్ని జి.బి.ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సంహిత గణపతి ఇంటూరి నిర్మిస్తున్నారు. రవి గోలి, తేజ కనకాల దర్శకత్వం వహిస్తున్నారు. 'మత్స్య' సినిమా అఫీషియల్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ టాప్ క్వాలిటీ విజువల్స్, వీఎఫ్ఎక్స్ తో ఒక కొత్త సినిమాటిక్ వరల్‌ను పరిచయం చేసింది.'అమ్మా కొత్త బెడ్ టైమ్ కథ చెప్పమ్మా..! అంటూ బాబు అమ్మను అడగగా, ఒక ఫిష్ కథ చెప్పనా అంటూ అమ్మ చెప్పే డైలాగ్ తో 'మత్స్య' గ్లింప్స్ మొదలవుతుంది. ఎన్నో వింతలు, అద్భుతాలు, ఒక ట్రావెలర్ ఉండే ఆ కథను అమ్మ చెబుతుంటే హీరో క్యారెక్టర్‌ను కలర్ ఫుల్ గా పరిచయం చేశారు. గ్లింప్స్ లో వివస్వాన్ స్టైలిష్ లుక్, అప్పీయరెన్స్, బాడీ లాంగ్వేజ్ తో ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రంతో ఒక ప్రామిసింగ్ యంగ్ హీరోగా వివస్వాన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఎక్స్‌పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. 'మత్స్య' చిత్రంలో ఫోక్ లోర్, అడ్వెంచర్ వంటి అంశాలను మేళవించి ఒక కొత్త ప్రపంచాన్ని చూపించబోతున్నట్లు గ్లింప్స్‌తో తెలుస్తోంది. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్ల, ఎడిటర్ పి.ఎస్.రెడ్డి, డిఒపి సురేష్, మ్యూజిక్ ఉజ్వల్ గుప్తా, డైలాగ్స్ జే కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజీవనేత్ర.

యమునా ఎక్స్‌ప్రెస్‌వే బస్సులో మంటలు...

# 9 మంది ప్రయాణికులు మృతి

20 మంది సురక్షితం



**నోయిడా:** ఢిల్లీ నుంచి ఉత్తర ప్రదేశ్‌లో మహోబాకు వెళ్తున్న బస్సులో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై మంటలు చెలరేగడంతో తొమ్మిది మంది ప్రయాణికులు మృతి చెందారు. ఈ ఘటనలో మరో 20 మంది ప్రయాణికులను సురక్షితంగా రక్షించినట్లు అధికారులు గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, బిఆర్ 32 ఫిఎ 8647 రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న ఈ బస్సు న్యూఢిల్లీలోని కశ్మీరీ గేట్ నుంచి మహోబా వైపు వెళ్తుండగా, జేవర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్స్‌ప్రెస్‌వేపై 33వ కిలోమీటర్ మైలురాయి సమీపంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక సిబ్బంది, రెస్క్యూ టెండర్, జేవర్ టోల్ ప్లాజా వద్ద ఉన్న ఫైర్ టెండర్‌తో పాటు మరో నాలుగు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయని ప్రదీప్ కుమార్ తెలిపారు. సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సహాయక చర్యల్లో 20 మందికి పైగా ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. పొగలు కమ్ముకున్న బస్సులోకి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ప్రవేశించినప్పుడు తొమ్మిది మృతదేహాలు కనిపించాయి. మంటల్లో కాలిపోవడం లేదా ఊపిరాడకపోవడం వల్ల వారు మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. బస్సులోని ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలో మంటలు రేగడం లేదా పేలుడు సంభవించి ఉండవచ్చని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఆయన చెప్పారు. దాని కారణంగా ఇంజిన్‌లోని లూబ్రికెంట్ ఆయిల్‌కు మంటలు అంటుకుని, ఆ తర్వాత అగ్ని వేగంగా బస్సు అంతటా వ్యాపించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. మృతిచెందిన తొమ్మిది మంది ప్రయాణికుల గుర్తింపును నిర్ధారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు ప్రకటించారు. గాయపడిన వారికి సరైన వైద్యం అందేలా చూడాలని, మృతుల కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయాలు అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

బెంగాల్ 'అధికార పీఠం' పైనే బిజెపి కన్ను...

# రూ.286.99 కోట్లు ఖర్చుతో వశం

కాంగ్రెస్ 4 రాష్ట్రాలు, యుటిలో చేసిన మొత్తం వ్యయం రూ.248.55 కోట్లే
'ఇసి'కి సమర్పించిన 'వ్యయ నివేదిక' వెల్లడి

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బిజెపి అధిక మొత్తంలోనే తన ధనబలాన్ని ఉపయోగించి విజయం సాధించింది.ఈ ఏడాది ఆరంభంలో ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రా లు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో కాంగ్రెస్ ఖర్చుచేసిన మొత్తం రూ. 248.55 కోట్లు అయితే, కేవలం ఒక్క పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోనే బిజెపి రూ.286.99 కోట్లు ఖర్చు చేసిందని ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ నివేదికలో వెల్లడైంది. 5 ఎన్నికల కోసం బిజెపి చేసిన రూ.529. 38 కోట్ల ఖర్చులో సగానికి పైగా వాటా ఒక్క పశ్చిమబెంగాల్ రాష్ట్రం వాటానే ఉంది. మిగిలిన 4 ఎన్నికలు అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలలో జరిగాయి. బెంగాల్‌లో సాధారణ ప్రచారం కోసం పార్టీ రూ.217.16 కోట్లు , అభ్యర్థులపై రూ. 69.83 కోట్లు ఖర్చు చేసింది. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)ను గద్దెదించిన బిజెపి తొలిసారి గాఅధికారంలోకి వచ్చింది. ఫలితాలు వెలువడిన 293స్థానాలకు గాను, టిఎంసికి వచ్చిన 80స్థానాలతో పోలిస్తే, బిజెపి 207 స్థానాలను గెల్చుకుంది. పశ్చిమబెంగాల్‌లో నామమాత్రపు శక్తిగా ఉన్నప్పటికీ, 293 స్థానాలలో స్వతంత్రంగా పోటీచేసిన కాంగ్రెస్ రెండు స్థానాలను గెలుచుకుంది. తన కేంద్ర ప్రధాన కార్యాలయం, రాష్ట్ర విభాగం ద్వారా బెంగాల్‌లో రూ. 42.08 కోట్లు ఖర్చుచేసినట్లు ఆ పార్టీ నివేదించింది. ఇందులో సాధారణ ప్రచారానికి రూ.12.96కోట్లు, అభ్యర్థులు, సంబంధిత ఖర్చులకు రూ.29.12కోట్లు వెచ్చి ంచారు. 2011లో అధికారాన్ని కోల్పోవడానికి ముందు దశాబ్దాలపాటు బెంగాల్‌ను పాలించిన సిపిఐ(ఎం), 197స్థానాలలో పోటీచేసి ఒక స్థానాన్ని గెలుచుకుంది. అభ్యర్థులపై చేసిన ఖర్చుతో సహా, దాని రాష్ట్ర విభాగం రూ.8.23 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదించింది. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్ ఖర్చుల వివరాలు ఇంకా బహిరంగపర్చలేకపోయింది. పార్టీలు ప్రకటించిన వ్యయాల ఆధారంగా కేరళం రాష్ట్రంలో వైరుధ్యం కనిపిస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి, సిపిఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)ను పడగొట్టింది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63 సీట్లు, సిపిఐ(ఎం) 26 సీట్లు, బిజెపి మూడు సీట్లను గెలుచుకుంది. కాగా, బిజెపి ఖర్చుచేసిన రూ.82.67 కోట్లకంటే ఎక్కువగా, కాంగ్రెస్ తన ప్రధాన కార్యాలయం, రాష్ట్ర విభాగం ద్వారా కేరళం రాష్ట్రంలో రూ.105.34 కోట్లు ఖర్చుచేసింది. కాంగ్రెస్ పార్టీ తన ఖర్చులో రూ.71.30 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.34.05 కోట్లు అభ్యర్థులు, సంబంధిత ఖర్చులకు కేటాయించారు. కేరళంలో సాధారణ ప్రచారానికి రూ.54.93 కోట్లు, అభ్యర్థులపై రూ.27. 74 కోట్లు ఖర్చుచేసినట్లు బిజెపి తెలియజేసింది. కేరళంలో ఒక ప్రధానశక్తి అయిన సిపిఐ(ఎం) తన రాష్ట్ర విభాగం రూ. 28.60 కోట్లు ఖర్చుచేసినట్లు నివేదించింది. ఇందులో సాధారణ ప్రచారానికి రూ.26.30కోట్లు, అభ్యర్థులకు రూ.2.31 కోట్లు కేటాయించారు. 5ఎన్నికలలో కాంగ్రెస్ సాధారణ ప్రచారానికి రూ. 143 కోట్లు, అభ్యర్థులపై రూ. 105.55 కోట్లు ఖర్చుచేసినట్లు నివేదించింది. దీంతో,దాని మొత్తం వ్యయం రూ.248. 55 కోట్లకు చేరింది. సిపిఐ(యం) ఏకీకృత వ్యయం రూ. 39.04 కోట్లుగా ఉంది. బెంగాల్ , కేరళంలోని వ్యయంతో పాటు అస్సా ంలో రూ.96.27 కోట్లు, తమిళనాడులో రూ. 51.56 కోట్లు, పుదుచ్చేరిలో రూ.11.90 కోట్లు ఖర్చుచేసినట్లు బిజెపి నివేదించింది. గతంలో దాఖలైన వివరాల ప్రకారం...ఎన్నికల కాలంలో బిజెపి కేంద్ర ప్రధానకార్యాలయానికి రూ. 1,472.8కోట్లు అందగా, కాంగ్రెస్ తన ప్రధాన కార్యాలయం,5 రాష్ట్ర యూనిట్ల నుంచి రూ.207. 17 కోట్లు వసూలైనట్లు నివేదించింది. ఎన్నికల ఫలితాలు ప్రకటించినప్పుడు రూ.6,72.6కోట్లుగా ఉన్న బిజెపి కేంద్ర కార్యాలయం బ్యాలెన్స్, ఎన్నికల కాలం ముగిసే నాటికి రూ.7,627.2కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో కాంగ్రెస్ ప్రధానకార్యాలయం, 5 రాష్ట్ర యూనిట్లలోని మొత్తం బ్యాలెన్స్ సుమా రు రూ.169.06 కోట్ల నుంచి రూ. 103.2 కోట్లకు పడిపోయింది.

# విస్తృతంగా వర్షాలు

తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు ఐఎండి రెడ్ అలర్ట్

**న్యూఢిల్లీ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తూర్పు, దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కోస్తా ఆంధ్ర ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) గురువారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలో ఈనెల 24, 25 తేదీల్లో అత్యంత భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడి న వర్షాలు, బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండి తన తాజా ప్రకటనలో పేర్కొంది. ఈనెల 26న కూడా భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశాలో శుక్ర, శనివారాల్లో అత్యంత భారీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కూడా ఐఎండి తెలిపింది. కోస్తా ఆంధ్రలోనూ గురువారం అత్యంత భారీ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. బిహార్, జార్ఖండ్, కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ వర్షాలకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణమని, ఇది ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలను దాటి భూభాగంలోకి ప్రవేశించిందని ఐఎండి వివరించింది.

**రాష్ట్రంలో పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక**

**హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల పాటు వర్షాల తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వరకు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశముందన్నారు. ఈ సమయంలో అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో కూడా ఉండే అవకాశం ఉందన్నారు. శనివారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు.

## సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. శోభాయాత్ర మార్గాల్లో విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. వీటి పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక నోడల్ ఆఫీసర్లను కూడా రంగంలోకి దించారు. నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఖైరతాబాద్ బడా గణేశ్, బాలాపూర్ గణేశ్ నిమజ్జనాలను మధ్యాహ్నంలోపే ముగించేలా వివిధ శాఖల అధికారులు పక్కా వ్యూహం రచించారు. చారిత్రాత్మక నిమజ్జన వేదికైన హుస్సేన్ సాగర్ చుట్టూ 40 భారీ క్రేన్లను అందుబాటులో ఉంచారు. ఎన్‌టిఆర్ మార్గ్ వైపు ఉన్న క్రేన్ నెంబర్ 6 వద్ద ఖైరతాబాద్ విగ్రహాన్ని మధ్యాహ్నం 12 గంటల కల్లా నిమజ్జనం చేసేలా ప్రణాళిక రూపొందించారు. గురువారం సాయంత్రం నుంచే దీనికి సంబంధించిన ఏర్పాట్లు విగ్రహాన్ని మధ్యాహ్నం 1 గంట కల్లా చార్మినార్ దాటించేలా చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఈ ప్రక్రియను నేరుగా పర్యవేక్షించనున్నారు. బాలాపూర్ గణపయ్యను అప్పర్ ట్యాంక్ బండ్ వద్ద నిమజ్జనం చేయనున్నారు. ఈ రెండు ప్రధాన విగ్రహాల నిమజ్జనం మధ్యాహ్నానికి పూర్తయితే నిమజ్జనోత్సవం సింహభాగం ముగిసినట్లేనని అధికారులు భావిస్తున్నారు. ఎంఎంసి పరిధిలో నిమజ్జనం పర్యావరణహితంగా, ప్రశాంతంగా జరిగేలా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎంఎంసి పరిధిలోని ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్.బి. నగర్ జోన్లలో మొత్తం 39 నిమజ్జన పాయింట్లను ఏర్పాటు చేశారు. వీటిలో 18 ప్రధాన చెరువులు, 7 కుంటలు/బేబీ పాండ్లు, 15 కృత్రిమ చెరువులు పోర్టబుల్ ట్యాంకులు ఉన్నాయి. సరూర్ నగర్, సఫిల్‌గూడ, శామీర్‌పేట్, ఎదులాబాద్ వంటి ప్రధాన చెరువులతో పాటు పార్కులు, మైదానాలు, మార్కెట్ యార్డుల్లో కృత్రిమ ట్యాంకులను అందుబాటులోకి తెచ్చారు. సిఎంసి పరిధిలోనూ నిమజ్జనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. 16 సర్కిళ్ల పరిధిలో 53 నిమజ్జన పాయింట్లను ఏర్పాటు చేసి, 82 క్రేన్లను అందుబాటులో ఉంచారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లలో ఈ క్రేన్లను అమర్చారు. స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తూ 1,145 మంది శానిటేషన్ వర్కర్లతో గణేశ్ యాక్షన్ టీమ్లను ఏర్పాటు చేసి రౌండ్ ది క్లాక్ సేవలు అందిస్తున్నారు.

## కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కాగా, సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఖైరతాబాదా నియోజవర్గానికి ఉప ఎన్నికలు ఖాయంగా కనిపిస్తున్నాయి, అయితే ఉప ఎన్నికల ఎప్పుడు జరుగుతుంది అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు, ఇప్పటికే బెంగాల్ లో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో వాటితో పాటుగా ఖైరతాబాద్‌కు ఉప ఎన్నికలు జరుగుతాయా? లేక మరో తేదీని ఖరారు చేస్తారా? అనేది తేలాల్సి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరపున పోటీచేసి గెల్చిన దానం ఆ తరువాత కాంగ్రెస్‌లోకి మారారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు, అసెంబ్లీ రికార్డుల ప్రకారం దానం బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నందున తనపై అనర్హత వేయడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. కాంగ్రెస్ పార్టీలోకి మారిన దానంపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా, పరిశీలన కోసం ఈ అంశాన్ని స్పీకర్‌కు పంపింది. దానం పార్టీ మారినట్టుగా ఎటువంటి ఆధారాలు లేవని అధికారిక రికార్డుల ప్రకారం ఆయన బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నారంటూ స్పీకర్ రూలింగ్ ఇచ్చారు.

ఈ రూలింగ్‌ను సవాలు చేస్తూ బిఆర్ఎస్, బిజెపి విడివిడిగా హైకోర్టును ఆశ్రయించగా దానం పై అనర్హత వేటు వేస్తూ కోర్టు ఆదేశాలు జా రీ చేసింది. దీనితో దానం సుప్రీం కోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం దక్కలేదు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com